# కూలిరాజు

బోయి భీమన్న

## అంకితం

# శ్రీ వేముల కూర్మయ్యగారికి

(ఆనాటి మద్రాసు రాష్ట్ర మంత్రి)

శ్రీ రమకు తండ్రి వారధి; తండ్రి
శీతగిరి; లోకపాలన చేయునట్టి
ఉభయులకు తండ్రి కూర్మయ్య విభవ మదిర!
దయకు వార్ధి; ధైర్యముకు శీతగిరి యితడు!

దున్నేవాడిదె భూమి, సోమరులు రై
తుల్ కారు; సర్వ ప్రజల్
అన్నం బట్టకు హక్కు దార్లె; సములే
యౌ నందరున్; లేమియే
కన్నీరంతకు కారణమ్ము అనుచు
వక్కాణించి, రాజ్యమ్ములే
కున్నన్‌గాని ప్రభుత్వమున్ నడుపు మా
కూర్మయ్య సామాన్యుడే!

చదువు చెప్పని సమాజమున జన్మించి, వి
ద్యామేరు శిఖరమ్ము లందినాడు;
పాలేరు కులమున ప్రభవించి, రాష్ట్ర చ
క్రము త్రిప్పు మంత్రియై ప్రబలినాడు;
హరిజనులను జూడ ఆత్రము పడుచున్న

హరికోసమ్మై గుడుల్ తెరచినాడు;
విద్యకోసము వసతులు, వేతనములు,
బ్రతుకు కోసము బంజర్లు గ్రాంటుచేసి
శిష్టరక్షణ కవతరించిన రమా ధ
వుండు కూర్మయ్య గురుదేవుడండి ప్రజకు!

బ్రహ్మ విష్ణు మహేశ్వర ప్రాణశక్తి
అవతరించిన గాంధీ మహాత్మ శక్తి
ప్రోచు గావుత సంతతము వ్యవసాయ
కూలి నాయకుడైన మా కూర్మయార్యు!

కలవారు, లేనివారని
కులములు దేశమున రెండె; కూలీలంతా
కలిసిననే సుఖ శాంతులు
కల వను కూర్మయ్య మంత్రి కర్పింతు కృతిన్!

—బోయి భీమన్న

## సర్వోదయ సోషలిజం

మొదట్లో కేవలం వ్యవసాయ కూలీల సాంఘిక, ఆర్థిక సమస్యలను మాత్రమే తీసుకొని "కష్టజీవి" అనే పేరుతో వ్రాసిన నాటకం ఇది.

అందులో సమ్మె ప్రధాన సాధనం కావడం వల్లనూ, అది ఆగస్టు విప్లవ సమయం కావడం వల్లనూ, అదే సమయంలో కమ్యూనిస్టుల కార్యకలాపాలు ఉధృతంగా వుండడం వల్లనూ "కష్టజీవి" తొలి ప్రదర్శనతోనే కష్టాల పాలు కావలసి వచ్చింది.

ఆ తరువాత పేరు మార్చుకొని "కష్టజీవి" "ధన్యజీవి" అయి, రాష్ట్రంలో చాలా చోట్ల ప్రదర్శించబడింది. దీనిని ఎక్కువగా ప్రదర్శించిన వాళ్ళు కాంగ్రెస్ సోషలిస్టు భావాలూ, కమ్యూనిస్టు సంస్కరణ భావాలూ గల విద్యావంతులైన కాపూ, కమ్మా, బ్రాహ్మణ యువకులే.

ఆ తరువాత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి, కాంగ్రెసు ప్రభుత్వాలు ఏర్పడి, కాంగ్రెసు వాదిగా నాకు ప్రభుత్వ నాయకులలో కొంత పలుకుబడి వున్న కారణంగా నాటకంలో కొన్ని సిద్ధాంత పరమైన మార్పులు చేసి "కూలిరాజు"గా పేరు మార్చి 1948లో మద్రాసు నుంచి దీనిని పుస్తక రూపంలో ప్రకటించడం జరిగింది.

అప్పుడు ఉమ్మడి మద్రాసు రాష్ట్రం కాంగ్రెసు ప్రభుత్వంలో వేముల కూర్మయ్యగారు మంత్రిగా వున్నారు. అప్పటికి ఆయన వ్యవసాయ కూలీ ఉద్యమాన్ని బహుముఖంగా నడిపిస్తున్నారు. గ్రామాలలోని ప్రముఖులైన హరిజన కార్యకర్తలు ఈ ఉద్యమాన్ని నడిపిస్తూ కాంగ్రెస్ పార్టీకీ, కూర్మయ్య గారికీ అనుచరులై వున్నారు. అయితే వ్యవసాయ కూలీలలో అధిక సంఖ్యాకులైన హరిజనులు కమ్యూనిస్టు నాయకుల ప్రభావానికి లోనై వుండేవాళ్లు. కమ్యూనిస్టులలో నాయకులు అగ్ర కులాల యువకులే. వాళ్ల అండర్ గ్రౌండు స్థావరాలు హరిజన పేటలుగా వుండేవి. తత్కారణంగా ప్రభుత్వ ఆగ్రహానికి గురి అవుతూ వుండేవి.

అట్టి పరిస్థితిలో హరిజనోద్యమానికి అండగా వుంటూ వచ్చిన గాంధీజీ ఒక సవర్ణ కులతత్వవాది చేతిలో మరణించడం జరిగింది. కాంగ్రెస్ అగ్ర నాయకులలో తదితర ప్రముఖులు చాలా వరకూ ధనిక భూస్వామిక వర్గాలకు చెందిన వాళ్లే. కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చే సూచనలు లేవు. ఒక వేళ వచ్చినా కాంగ్రెసు లాగే అది కూడా అగ్రకులాల ప్రభుత్వమే అవుతుంది. రష్యా కూడా ఈ దేశపు కమ్యూనిస్టులను వదిలేసి

కాంగ్రెసు జాతీయ ప్రభుత్వాన్నే అభిమానించసాగింది. కులం పేరుతో రాజకీయ పార్టీని నడపడం ఎలాగూ ప్రయోజనకరం కాదు. అలాంటప్పుడు ఈ దేశపు, కనీసం ఈ రాష్ట్రపు, హరిజనుల్ని, ముఖ్యంగా వ్యవసాయ కూలీలను ఉద్ధరించడం ఎలా? ఏం చెయ్యాలి?

ఈ సమస్యతో మంత్రిగా వున్న కూర్మయ్యగారు, అక్కడే అసిస్టెంటు పబ్లిసిటీ ఆఫీసరుగా వున్న నేను, జిల్లాల నుంచి వచ్చిన నక్కా చిన వెంకయ్య, ఆళ్ల చలమయ్య, కమతం షణ్ముఖం, సాకేటి గురువులు, రెడ్డి కామయ్య వంటి కొందరు వ్యవసాయ కూలీ నాయకులు కలిసి కొన్ని రాత్రులు నిద్ర మానుకొని చర్చించడం జరిగింది. అప్పుడే రాష్ట్ర వ్యవసాయ కూలీ సంఘం ఏర్పాటు చేయబడింది. దానికి అధ్యక్షుడిగా కూర్మయ్యగారే నిర్ణయించబడ్డారు. షణ్ముఖం గారి సంపాదకత్వంలో "వ్యవసాయ కూలీ" పత్రిక ప్రారంభించబడింది. ఆయన అప్పటికి కాంగ్రెస్ శాసన సభ్యుడు. ఎడిటరు ఆయనే అయినా పత్రికను నడిపింది నేనే.

కాంగ్రెసుకు అనుబంధ సంస్థగా ఏర్పాటు చెయ్యబడిన ఈ వ్యవసాయ కూలీ యూనియన్‌ను ప్రజలలో ప్రచారం చెయ్యడం కోసం కొన్ని వ్యవసాయ కూలీ పాటలు వ్రాసీ, సేకరించీ ఒక పుస్తక రూపంలో ప్రకటించాం. కష్టజీవి నాటకంలో కొన్ని మార్పులు చేసి 'కూలి రాజు'ను తయారుచేశాం. ఆ మార్పులలో ముఖ్యమైనవి – "సమ్మె" అనే మాటను తీసివేసి దాని స్థానంలో 'సత్యాగ్రహం' అనే మాటను పెట్టడం ఒకటి. అప్పటికి కాంగ్రెసు లక్ష్యంగా వున్న "సోషలిస్టు తరహా ప్రజాస్వామికం"ను "సర్వోదయ సోషలిజం"గా స్వీకరించడం రెండు. స్వతంత్ర భారత్‌కు తొలి అధ్యక్ష స్థానంలో ఒక హరిజన మహిళ ఎన్నుకోబడాలనీ, ఆమెకు జవహర్‌లాల్ నెహ్రూ గారు సెక్రటరీగా వుండాలనీ 'హరిజన' పత్రికలో గాంధీజీ చేసిన సూచనను కార్య రూపంలో చూపాలనేది మూడు. ఈ చివరి మార్పుకోసమే నాటకంలో అదనంగా ఎన్నికల రంగం చేర్చడం జరిగింది. కూర్మయ్యగారూ, నేనూ నాటకం వ్రాత ప్రతిని ఎన్నో సార్లు చదివి సమగ్రంగా వున్నదని సంతృప్తి పడిన తర్వాతనే దీనిని పుస్తక రూపంలో ముద్రించాం. ముద్రణ ఖర్చు కూర్మయ్యగారే భరించారు. ఆయనకే దీనిని అంకితమిచ్చాను.

ప్రజాసేవకు, ముఖ్యంగా హరిజన సేవకు, అందులోనూ వ్యవసాయ కూలీలను

ఒక బలమైన రాజకీయ వర్గంగా సంఘటిత పరచాలనే దీక్షకు అంకితమైన వాడు వేముల కూర్మయ్యగారు. నా విషయంలోనూ, సాహిత్యం విషయంలోనూ శ్రద్ధ వహించి కూలి రాజు ద్వారా నా ఉద్యమ సాహిత్యం వెలుగు చూడడానికి ఆర్థికంగా సహాయపడ్డవాడు కూడా కూర్మయ్య గారే. ఆయన మంత్రిగా వుండగానే ఈ నాటకాన్ని మద్రాసు ప్రభుత్వ సెక్రటేరియట్ తెలుగు సాంస్కృతిక సంఘం వారు ప్రదర్శించడం జరిగింది. అందుకు శ్రద్ధ తీసుకొన్న ఆఫీసర్లలో మంత్రి కూర్మయ్యగారి దగ్గర పర్సనల్ సెక్రటరీగా వున్న జనార్దన్ రావు నాయుడు గారు ముఖ్యులు. ఆయన సంగీత సాహిత్యాలలో అందె వేసిన చెయ్యి. మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాజమన్నార్‌గారి అధ్యక్షతలో మ్యూజియం థియేటర్‌లో జరిగిన తొలి ప్రదర్శన అత్యద్భుతంగా రక్తి కట్టింది. అందరి ప్రశంసలనూ అందుకొంది.

పద్యాలకూ, పాటలకూ, సర్వోదయ సోషలిస్టు వ్యవస్థకూ ప్రాధాన్యం ఇవ్వబడిన నాటకం ఇది. ఆనాడు ఈ నాటకానికి సంగీత దర్శకుడు సుప్రసిద్ధ సినీ, సంగీత దర్శకుడైన టి.వి. రాజు గారు.

ఈ నాటకాన్ని ఎవరైనా ఏ రూపంలో అయినా ప్రదర్శించుకోవచ్చు. తగు విధంగా ఎడిట్ చేసుకోవచ్చు. ఎన్నికల రంగం అక్కరలేదనుకొంటే మినహాయించు కోవచ్చు. ప్రధాన ఇతి వృత్తానికి భంగం కలిగించకుండా వుంటే చాలు.

ఈ కూలి రాజు ఇప్పుడు ఈ నాలుగో ముద్రణకు నోచుకొన్నదంటే అందుకు ప్రోత్సాహం ఇచ్చిన వాడు ముఖ్యంగా మిత్రుడు గనుమల జ్ఞానేశ్వర్. ఆయనకు నేనెంతో కృతజ్ఞుడ్ని. ఈనాడు దళిత సాహిత్యం పేరుతో ఒక కొత్త శాఖ ప్రచారంలోకి వస్తూ వుంది. దానితో నాకు సంబంధం లేక పోయినా నా పేరునూ, నా రచనలనూ అక్కడక్కడ ఉదాహ రించడం జరుగుతూ వుంది. అట్టి వారిలో ఆంధ్ర యూనివర్సిటీ తెలుగు శాఖ అధిపతి ఆచార్య ఆపదరావుగారు ముఖ్యులు. శివసాగర్ (సత్యమూర్తిగారు) మరొకరు. వారందరికీ, పాలేరు, కూలిరాజు నాటకాలపై నా సాహితీ షష్టి పూర్తి సంచికలో ఒక సమగ్ర విమర్శను ప్రకటించిన బొజ్జా తారకం గారికీ నేను కృతజ్ఞతలు చెప్పుకోవలసి వుంది.

ఇప్పుడు ఈ మాటలు వ్రాస్తూ 'జమీన్ రైతు' పత్రికలో చూసిన ఒక విషాద వార్తను బట్టి, నాకు సాంఘిక, రాజకీయ, ఆర్థిక, తాత్విక విషయాలలో అన్నగారి వంటి

స్వర్ణ వేమయ్య గారికి కూడా కృతజ్ఞతలు చెపుతున్నాను. వేమయ్యగారు నాకంటే సుమారు తొమ్మిది నెలలు పెద్ద. ఆయన 1-1-1911లో పుట్టి, 16-6-1995న కీర్తిశేషులయ్యారు. నాకు చిరకాల మిత్రులు. వ్యవసాయ కూలీ ఉద్యమకారులు. హరిజన నాయకులు. కమ్యూనిస్టు పార్టీ విశిష్టకార్యకర్తలు. నాలుగుసార్లు శాసన సభ్యులైన వారు. అన్నిటికంటే ముఖ్యం వేదాంత తత్వవేత్తలు.

ఈ నాటకం ద్వారా వ్యవసాయకూలీ యూనియన్‌ను అఖిలభారత జాతీయ పార్టీగా ఎన్నికలలో గెలిపించడం జరిగింది. లక్ష్యం సోషలిస్టు వ్యవస్థ. అందుకే ఈ యూనియనును సర్వ భారత జనామోదకరమైన పేరుతో పిలవవచ్చు. ఆ పేరు సర్వోదయ సోషలిస్టు పార్టీ.

హైదరాబాద్ భీమన్న

జూలై 1995.

మొదటి ముద్రణకు వ్రాసిన పరిచయం

"చేతికీ నోటికీ మధ్య వున్నదే అనంత మానవ చరిత్ర"

సామ్రాజ్యవాదంతో కాంగ్రెసు చివరి పోరాటాన్ని జరిపిన 1942లో ఈ నాటకం మొదట వ్రాయబడింది. "కష్టజీవి' అనే పేరుతో ప్రదర్శింపబడింది. తర్వాత కొన్ని మార్పులు.పొంది "ధన్యజీవి" అయింది. 1947లో 'నవజీవన' పత్రికలో సీరియల్‌గా ప్రకటించబడింది. మరికొన్ని మార్పులు చేసి 1948లో ఈ నాటకాన్ని "కూలీరాజు" అను పేర ప్రజలకు అందించాను. వ్యవసాయ కూలీ ఉద్యమాన్ని బలపరచడమే ఈ మార్పుల ఉద్దేశ్యం.

మన దేశంలో నూటికి 80 మంది వ్యవసాయం మీద బ్రతికేవారే. అందులో భూస్వాములు బహుకొద్దిమంది. వారిని తీసివేస్తే తక్కిన మెజారిటీ ప్రజలంతా పేదలే. ఎన్ని రాజకీయ పార్టీలైనా ఈ మెజారిటీ ప్రజలమీద ఆధారపడి బ్రతుకవలసినవే. కాగా ఎవరో ఒక భూస్వామి నాయకత్వం క్రింద, గొల్లవాడి క్రింద గొర్రెల్లాగ, ఈ పేద ప్రజలంతా నడవడంవల్ల ఏమీ లాభం లేదని, తమలో నుంచే ఒక నాయకుణ్ణి ఎన్నుకొని, తామంతా ఒక్క త్రాటిమీద నడిస్తే ఈ పేదలంతా తామే ప్రభుత్వ అధికారాన్ని చేబట్టగలరని ఈ నాటకం సూచిస్తుంది.

జగత్తు పరిణామ శీలం. ఎల్లప్పుడూ పురోగమిస్తూనే వుంటుంది. ఆ పురోగమనంలో ప్రాత శిథిలమై పోతూ క్రొత్త ఆవిర్భవిస్తూ వుంటుంది. అదే విప్లవం. విప్లవం ప్రకృతిసిద్ధం.

నేను ఈ నాటకంలో నిరుత్సాహ పరచింది. సాయుధ దౌర్జన్య విప్లవం మాత్రమే. కేవలం ఎన్నికల ద్వారానే సర్వోదయ సమాజాన్ని నిర్మించే అవకాశంగల నేడు దౌర్జన్య విప్లవం అనవసరం. సత్యం, అహింస, విశ్వమానవప్రేమ వీటి ద్వారా సర్వోదయ సమాజాన్ని రూపొందించడం గాంధీయిజం. అది వయోజన వోటింగుతో కూలీలు అధికారంలోకి రావడం ద్వారా సాధ్యం.

కులమత వర్గ రహితమైన స్వామ్య సమాజాన్ని గాంధేయ కార్యక్రమం ద్వారా సాధించడాన్ని ఇది చిత్రిస్తుంది.

ఇందులో అవసరమైన మార్పులు చెయ్యడంలోను, ఇది ప్రజల హస్తాల నలంకరించడంలోను, అనుక్షణమూ అమూల్యమైన సలహా సహాయాలతో నాకు గురువుగా, నాయకుడుగా ఎంతగానో తోడ్పడ్డ శ్రీ కూర్మయ్యగారి అపార వాత్సల్యానికి భక్తితో ఈ నాటకాన్ని అంకితం చేశాను. దీన ప్రజావనతకు, దరిద్రనారాయణ సేవకు జీవితాన్ని అంకితం చేసిన వ్యవసాయ కూలీ నాయకుడు కూర్మయ్యగారు.

రాజకీయాన్ని ఇతివృత్తంగా తీసుకుని రసవంతంగా నాటకం వ్రాయడం ఇసక నుండి నూనెను పిండడం వంటిది. ఈ సాహసంలో నేను ఎంతవరకు కృతకృత్యుణ్ణయ్యానో నిర్ణయించే బాధ్యత పాఠకులదీ, ప్రదర్శకులదీ, రసజ్ఞులదీను.

1948
మద్రాసు

-భీమన్న-

## పాత్రలు

| | | |
|---|---|---|
| 1. | మధుమూర్తి | : విద్యావంతుడైన కూలి యువకుడు |
| 2. | పరంజ్యోతి | : మధు స్నేహితురాలు, కూలి యువతి |
| 3. | మిత్ర | : మధు ప్రియురాలు, కూలి పిల్ల |
| 4. | నిష్కలయోగి | : కూలి ఉద్యమ ప్రబోధకుడు |
| 5. | భయంకర్రావు | : కూలీలలో రౌడీ నాయకుడు, మిత్ర మేనమామ |
| 6. | విశ్వనాథరావు | : భూస్వామి |
| 7. | ప్రేమకుమార సుందర దివాకర లావణ్యమూర్తి | : విశ్వనాథరావు కుమారుడు, అభ్యుదయగామి |
| 8. | దయానందరావు | : మంచిరైతు |
| 9. | శివరామకృష్ణ బ్రహ్మం | : విశ్వనాథరావు గుమాస్తా |
| 10. | జోగులు | : పాలేరు |

(ఇంకా రైతులు, కూలీలు, పోలీసులు వగైరా )

## రంగం:1

(ప్రశాంతమైన ప్రభాతవేళ, ప్రజాపురంలో ఒక కూలీ పేట. ఒక వీధిలో, పాడుతూ నిష్కల్ ప్రవేశిస్తాడు)

(పాట)

కుమార ! లేవర ! కుమారా !
లేవరా నిదురా !
కోడికూసే ! కోకిల పాడే,
కూలీ వాకిట గులాబి పూసె,
ఆవుపెయ్య నిన్నాహ్వానించె
జీవకోటి నీకై పరికించె

కుమార ! లేవర ! కుమారా !
లేవరా నిదురా !
ఉషః కాంతి నీ యుల్లము చల్లగ
ఉద్బోధించుట లేదా
ధాత్రియెల్ల తీర్థంకర మయ్యె,,
రాత్రి గడచి చాలా సేపయ్యె,

కుమార ! లేవర ! కుమారా !
లేవరా నిదురా !
అదిగో నీ చిరకాల వాంఛ,
అందుకోర సహస్రకరములు;
చేతగాని రాజ్యము స్వరాజ్యము
జేసి పేదల బాధ లార్పర !

(కొంత నడచి) ఓ భారత పుత్రులారా !

బంగారమే పండు పంటభూముల ప్రక్క
విత్తనం బెరుగని బీటినేల
ఆకాశమున కంటు అద్దాల మేడల
ప్రక్కలో, నిరుపేద పాడుకొంప
బలిసిన యేన్గు గున్నలబోలు-స్వాముల
ప్రక్క యెమ్ముల గూటి బడుగుజీవి
వేదాంత విద్యాప్రవీణుల ప్రక్క చూ
డగరాని శుద్ధ చండాల కులము
ధనమదాంధత రాతి పాదముల ప్రక్క
జాలిబడి యేడ్చు పేదకూలీల గోల,
ఇంత భారతజాతి భేదించుచుండ
సౌఖ్యమెటుగల్గు ? ఎటుగల్గు శాంతి ప్రజలకు ?

(ఒకళ్ళిద్దరు ప్రజలు చూస్తూపోతారు. నిష్కల్ పాడుతూ ముందుకు సాగుతాడు.)

జాతిభేదము పుట్టి నాశనము చేసె
ధన్యభారతదేశ సౌభాగ్య శోభ,
దాస్య దారిద్ర్య దుఃఖ దగ్ధ ప్రజాళి
తన్పు దమృతాన వివిధ భేదములు బాసి.

(నలుగు రైదుగురు ప్రజలు అనుసరిస్తారు. అతడు అలానే ప్రచారం చేసుకుంటూ ముందుకు పోతాడు)

మానవతియైన భారతమాత మెడకు
క్రూరతరమైన ఉరిత్రాళ్ళు కులమతాలు,
నిష్కలము, నిర్మతము చేయనేర్చి, మాత
నుద్ధరింపగ లెండిక యువకులార !

(నిష్క్రమిస్తాడు. ఇద్దరు కూలి యువకులు మిగులుతారు)

1యు : ఒరే! ఈయనెవరో మహానుభావుడిలా వున్నాడ్రా !

2యు : ఏదో ప్రచారం చేసుకుంటూ పోతున్నాడు.

1యు : ఈయన సంగతేంటో కనుక్కోవాలి.

2యు : ఇదెంత పని ? పరంజ్యోతి గారింటికి తీసికెళదాం పద.

మధుమూర్తి కూడా వచ్చాట్టకదూ అన్నట్టు ?

1యు : ఈ వేళ బడిసాలలో మీటింగు కూడా వుందిగా.

(నిష్క్రమిస్తారు. వెనుకనుంచి నిష్కల్ పాడుతూ తిరిగి ప్రవేశిస్తాడు. వెనుక కొందరు కూలి ప్రజలుంటారు.)

(పాట)

మాతా ! కూలీ మాతలనే
మల మల మాడిచి వైవక తగనే ?
లోకము కంతా ఆకలి దీర్చే
కూలీ బిడ్డకు కూడు పెట్టవా ?
త్యాగమునకు పేదరిక మొక్కటే
ఫలితమటే ఓ భారతమాతా ?

మాతా ! కూలీ మాతలనే
మల మల మాడిచి వైవక తగనే ?

నీ వాకిటిలో నెలవంకలతో
ముగ్గులు పెట్టే ముద్దు బిడ్డలను
ముళ్ళ కంపల మోదగనేల ?
దయలేదా; ఓ ధాత్రీ మాతా !
మాతా ! కూలీ మాతలనే
మల మల మాడిచి వైవక తగనే ?

పగలు రేయి తన బ్రతుకు బ్రతుకుతో
నీ పాదాబ్జములే పూజించే
కూలి కన్నియకు కోరిక లేదా ?
శాంతి సౌఖ్యములు వలదా ?
మాతా ! కూలీ మాతలనే
మల మల మాడిచి వైచక తగనే ?

(పాడుకొంటూ నిష్క్రమిస్తాడు. వెనుక ప్రజలంతా వెళతారు. అంత తెర లేస్తుంది. కూలీల ఇళ్ళు కనిపిస్తూ వుంటాయి. అదోక మామిడి తోట. అందుబాటులో పూలచెట్లుంటాయి. పరంజ్యోతి పాడుతూ పవ్వులు కోస్తూ వుంటుంది.

(పాట)

పర : ఇది క్రొంజిగురే
ఇది ఫలమే
ఏది వలతువొ రావే
ఏది వలుతువొ రావే
ఏ పికమా ! ఓ శుకమా !
ఓ మకరందనమా !
పూవులు పూసే వేళే, ఇది
మాపులు కాసే వేళే !
ఇది పాటే.... కూలీ పాటే,
ఇది ఆటే.... ముందుకు బాటే,
తీయని మామిడి తోటే,
కోయని పూవులకోటే !

నేడే రావే !
రే పెన రెవరో !
దొరికిందెంతో అంతే సుఖమే
దొరికిన వాటిదె జీవనమే !

(పాట అందుకొని పాడుతూ మధు ప్రవేశిస్తాడు)

- నేడే బ్రతుకా ?
రేపే లేదా ?
దొరికిందెంతో అంతేనా ?
దొరికిన దానితొ తృప్తేనా ?

పర : తృప్తే. మధూ ! తృప్తి ఏనాటి కానాటిదే. ఐతే - నిన్ననగా వచ్చి ఇప్పుడా కనిపించడం ?

మధు : రాత్రేగా వస్త ? ఔనుగాని, ఎవర్ని రమ్మంటున్నావు ?

పర : వాసంతికని

మధు : ఎందుకూ ?

పర : పాడడానికి.

మధు : ఐతే - అదిగో వచ్చింది పాడించు !

(మిత్ర ప్రవేశిస్తుంది)

మిత్ర : ఎంత చక్కగా పాడుతున్నా వక్కా ! నీ పాటకు వసంతుడే -

మధు : ప్రత్యక్షమయ్యాడు !

మిత్ర : (మధును చూచి సిగ్గుపడుతుంది)

పర : ఎవరికే ప్రత్యక్షమౌత !

మధు : మిత్రకులే.

మిత్ర : (కోపంగా) మరే

పర : తథాస్తు

మధు : ఏదీ, దేవతలు పూలవర్షం కురిపించరేం (ఒక కొమ్మ పట్టుకుని దులుపుతాడు, పువ్వులు రాలతాయి)

మిత్ర : (తలమీది పువ్వులు దులుపుకుంటూ) ఈ రోజులలో దేవతలు భూమ్మీదనుంచే దులుపుతున్నారు పువ్వులు.

మధు : "దులుపుకుంటున్నా"రను.

పర : మీరు పేచీలు పడుతూవుండండి; నే నిప్పుడే వస్తా.

(వెళుతుంది)

మిత్ర : నేనూ వస్తున్నా (వెళ్ళబోతుంది)

మధు : (చేయి పట్టుకుని) ఆగు, మిత్రా ! ఎన్నాళ్ళయింది. నిన్ను చూచి !

మిత్ర : అయితే ?

మధు : నీ మాట – నీ పాట –

మిత్ర : ముఖస్తుతులకేంలే !

మధు : ఆ ! నేను మధుని మిత్రా !

మిత్ర : కాబట్టే (వెళ్ళిపోతుంది.)

మధు : (నిరుత్సాహంగా)

మోడు కొమ్మలు పసిరించె, మొగ్గదొడిగె
మూగకోయిల గొంతుకల్ మ్రోయసాగె.
నిజన వనములు ప్రియజనావృతము లయ్యె
జీవితమ్మేలొ నాకు శైశిర నిశీధి !

పర : (ప్రవేశిస్తూ) ఏం మధు ! ఈ వసంతంలో శైశిర నిశీధాన్ని అనుభవిస్తున్నావేం?

మధు : కాక ?

ఆకురాల్చి మోడైన తాటాకు కొంప
అట్లెయున్నది, వికసింపనైన లేదు
తమ్ముల మొగాలు, ఇంట భత్యమ్ము లేదు,
కార్మికుని బ్రతుకేమి మాఘమ్ము గాక.

(మిత్ర మామిడిపండుతో ప్రవేశిస్తుంది.)

పర : నిత్యమాఘం, మధూ ! కూలీల ఈ ధౌర్భాగ్యానికి అంతం లేదా అనిపిస్తున్నది. స్వరాజ్యం వచ్చిన తర్వాత కూడా....

మిత్ర : మనకు వచ్చింది స్వరాజ్యం కాదు. స్వాతంత్ర్యం మాత్రం.

మధు : అబ్బో ! మిత్ర చాలదూరం వచ్చిందే !

పర : నీ శిష్యురాలు కదా ?

మధు : నా శిష్యురాలి కింత కోపముంటుందా ?

మిత్ర : ఉండవలసిన కారణం ఉంటే సరి.

పర : నీవు లేఖ లెప్పుడూ నా పేరనే వ్రాసేవాడివి. అదీ ఆ కారణం.

మధు : నీ వంటే వ్యవసాయ కూలీలలో పని చేస్తున్నావు కాబట్టి...

పర : నా కంటే మిత్రే ఎక్కువ బాగా పనిచేస్తూ వుందిప్పుడు.

మధు : ఇకనుంచి మిత్రకే వ్రాస్తాను లేఖలన్నీ.

పర : ఎక్కడనుంచి ? ఇక కాలేజీకి వెళ్ళనక్కరలేదుగా ?

మధు : కాలేజీకి కాదు, మద్రాసులో ఒక ఉద్యోగం వచ్చింది. ఇదిగో ఆర్డరు.

(జేబులో నుంచి తీసి ఇస్తాడు)

పర : ఐతే – ఉద్యోగం చేస్తావన్నమాట ?

మధు : మరి – ఈ దరిద్రం తీరే దెట్లా ?

పర : నీ లాంటి యువకులంతా పొట్ట చేతబట్టుకొని ఉద్యోగాల్లోకి పోతుంటే ఈ నిరుపేద కూలీలకు దిక్కెవరు...?

మధు : నాకేమీ గత్యంతరం కనిపించడం లేదు.

ధనము గల్గిన గల్గు స్వాతంత్ర్య, మంత
భాగ్యవంతుల బంధమ్ము వదిలిపోవు ;
సౌఖ్యమును, స్వేచ్ఛ కోరెడి శ్రమికులెల్ల
ఎవ్విధమునైన ధనము గడింపవలయు,

ఏం, మిత్రా ?

మిత్ర : ఇదిగో బహుమానం (మామిడిపండు మీదకు విసురుతుంది)

మధు : (పండు కళ్ళకద్దుకుని) మహా ప్రసాదం !

పర : (అయిష్టంగా) మధు ఉద్యోగం చెయ్యడం నీ కిష్టమేనా మిత్రా ?

మిత్ర : (మౌనం)

పర : మీ రిద్దరూ ఏదో ఆలోచించుకున్నారా యేమిటి ? ఏమో, మధూ! నీవులేకపోతే ఈ కూలీలంతా తల్లిలేని పిల్లలైపోతారు. నిన్ను నమ్ముకునే ఇక్కడ నే నీ ఉద్యమాన్ని లేవదీశాను. నీవు దీన్ని నడిపించితీరాలి. (మిత్రతో) ఏమే, మాటాడవు?

మిత్ర : నేను ముందే చెప్పాను. మనకు స్వాతంత్ర్యమే వచ్చింది గాని, ఇంకా స్వరాజ్యం రాలేదు. దానిని మనం సాధించవలసివుంది.

మధు : (ఎదరకు చూచి) అడుగో ! మహారాజాధిరాజ, రాజ పరమేశ్వర, మహారౌడీ, మీ మేనమామ..

మిత్ర : (భయంతో చూచి) తులసివనంలో గంజాయి మొక్క..

(నిష్క్రమిస్తుంది, భయంకర్రావు ప్రవేశిస్తాడు, మంచి నిషాతో)

భయ : హహ్హహ్హ ! పరంజ్యోతి ! ఈ రాలుగాయి ఇంటి చుట్టూ ఎంతకాలం తిరగను? (పాట ధోరణిలో) నన నననన నన న్ననా నననన... (ఎదర చూచి) ఛెస్ ! ఈ పందికొక్కెప్పుడొచ్చింది ? డేమ్ రాస్కెల్.

మధు : రారా, భయంకర్ ఏమిటి, ఎలా ఉంది నీ హయాం ?

భయ : నా హయామా ? నా హయాం ? హూం ! (ఈ భయంకర్ పేరెత్తితే బ్రహ్మాండం (మీసం త్రిప్పుతూ) ఈ బ్రహ్మాండం.....

మధు : బ్రద్దలై పోద్దంటావు !

భయ : కాకపోతే ? ఈ ఒక్క మీసానికి జవాబు చెప్పే మొగోడు ఈ మూడు లోకాల్లోనూ లేడు.

మధు : నీ బల మంతా జాత్యుద్ధరణ కోసం ఉపయోగిస్తే బాగుండున్రా.

భయ : జాతా ? జాతి ! కప్పల తక్కెడ, పీతల మంగలం, యీ కూలిజాతి నుద్ధరించే వాడెవడ్రా ?

మధు : నీలాంటివాడు పూనుకుని నడిపిస్తే –

భయ : వరేహ్వా ! నేను కాదు, నువ్వుకాదు, నిన్ను పుట్టించిన జేజేమ్మ అమ్మా మొగుడైనా సరే ఈ పాటకపు జనాన్ని ఒక దార్ని నడిపించలేడు.

పర : వాళ్ళు దరిద్రులు కాబట్టి –

భయ : వాళ్ళకి బుద్ధుంటే దరిద్రులెందు కవుతార్రా ? (చివాలున లేచి పోతాడు)

మధు : మమూలే, ఏమీ మారలేదు.

పర : పుడకలతోటే వాడు మారడం, పద, కాఫీ త్రాగి వద్దాం.

మధు : పల్లెటూళ్ళలో కూడా కాఫీ లేమిటి ? పాలో, మజ్జిగో, కలో, గంజో, త్రాగక ?

(ఇద్దరూ నిష్క్రమిస్తారు. వెనుకనుండి నిష్కల్ ప్రవేశిస్తాడు)

ని : ఓ భారతీయులారా !

మీ బిడ్డలే కూటికై బాధపడుచుండ
దయలేక చూతురా తండ్రులార ?
మీ కూలితమ్ములే ఆకట బడియేడ్వ
కన్నులు తెరువరా అన్నలార ?

మీ తల్లి దండ్రులే ఆతపోగ్నులఁగాగ
కన్నీరు నింపరా పిన్నలార !
మీ జాతియే అన్నమే లేక నశియింప
ఊరక చూతురా యువకులార ?
పేదకూలీలలో పుట్టి పెరిగి కొంత
బాగుపడునట్టి యో భాగ్యవంతులార !
మరచిపోదురా జాతిని ? మాతృదేశ
చరణ సేవా పథమ్మిది సాగిరండు.

(పరికించి ఇదేనా మదుమూర్తి ఇల్లు ! ఇట్టి దారిద్ర పిశాచి వాడి కోరల నుంచా ఈ అమృత వాహిని ప్రవహించింది ! ఇట్టి పేదతనపు ఊబినుంచా ఈ పద్మం పరిమళించింది !

కప్పులపై ఆకు లన్నియు గాలి కెగిరి
పోయె, వాసనలచే కూలిపోయె గోడ ;
ఎండిపోయిన శ్రమికుని గుండెవోలె
క్రూర దారిద్ర్య మీ యింట కొలువుతీర్చె.

(అంత మధు ప్రవేశిస్తాడు)

ని : ఓ ! మధు ! ఇదేనా మీయిల్లు ! నేను జ్ఞాపకం వున్నానా ?

మధు : (చేతులు మోడ్చి) అనామకుడైన నన్ను మీరు జ్ఞాపకం పెట్టుకోగాలేంది - జగత్ప్రసిద్ధులైన మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకోలేనా, స్వామీ ?

ని : మనం ఒక్కసారేగా కలుసుకున్నాం, మీ కాలేజీలో ?

మధు : చిత్తం నాటి మీ ఉపన్యాసం ప్రతీ అక్షరమూ నా చెవుల్లో గింగురుమంటూ వుంది.

ని : ఇప్పుడు కావలసింది ఉపన్యాసాలు కావు, పని ! పని కావాలి చదువయిపోయిందిగా? ఇక నీ కార్యక్రమ మేమిటి ?

(పరంజ్యోతి ప్రవేశిస్తుంది)

మధు : ఈమె పరంజ్యోతి, అదిగో మా యింటిప్రక్క యిల్లే. తెలుగు బాగా చదివింది. పాటలూ, పద్యాలూ వ్రాస్తూ కూలీలలో ప్రబోధం కలిగిస్తూ వుంటుంది.

పర : నమస్కారం స్వామీ !

ని : కూర్చో, అమ్మా ! కార్మికోద్యమంలో నాకు మంచి శిష్యురాలివే లభించావు.

పర : మధు మాటలకేం లెండి !

ని : మా ఉద్యమానికే నీవొక జ్యోతివి, తల్లీ ! మధూ ! నీ కార్యక్రమం మాట ?

పర : ఉద్యోగం చేస్తాడట. ఆర్డరుకూడ వచ్చింది.

ని : ఆ ?

మధు : నావి చాల దుర్భరమైన పరిస్థితులు. ఇంతవరకు చదవడమే కష్టమై పోయింది. ఇంటినిండా కటిక దరిద్రం. ఉద్యోగం చెయ్యకపోతే బ్రతికే విధానం లేదు.

ని : ఇది మీవంటివారు అనవలసిన మాటకాదు. బ్రతుకా? నీ తాత తండ్రుల కెలా గడిచింది? బ్రతకడానికి బానిస వృత్తి తప్ప గత్యంతరమే లేదా ?

మధు : జాతిసేవ పేరుతో ప్రజల డబ్బు తినడం నాకు కిట్టదు.

ని : నీ వంటి విద్యావంతులు పొట్టకోసం జాతిని విడిచిపెట్టి పోతూవుంటె-అజ్ఞానులూ, స్వార్థపరులూ, జాతికి నాయకులమని ప్రజల్ని దోచుకుతింటున్నారు కదా ? దానితో ఇన్ని కోట్లమంది నిరుపేద కూలీలు దిక్కులేకుండా పోవడం లేదా ?

పర : స్వామీ! మీది కేవలం కూలీ ఉద్యమమేనా? హరిజనోద్యమం కూడ కలిసివుందా ?

ని : నాది కేవలం కూలీ ఉద్యమమే. ఈ ఉద్యమంలో కులానికి స్థానం లేదు. కులభేదాలు రూపుమాపే ఏకైక భారతజాతిని తయారుచేసి రాజకీయ ఆర్థిక సాంఘిక సమత్వం స్థాపించడమే నా ఆశయం.

పర : కులాలు నశిస్తాయంటారా ?

ని : ఆహాఁ ఎందుకు నశించవు ?

కూడు దొరకక ప్రతిరోజు కూలికేగు
కులము లన్నియు నొక్కటె కులము కాదె?
బ్రాహ్మణుడు మొదల్ మాదిగవాని వరకు
కష్టపడువాడు ప్రతివాడు కార్మికుడె.

ప్రజల్లో నేడు రెండే తెగలు – భాగ్యవంతులు, నిరుపేదలు. సర్వ సమత్వాన్ని స్థాపించగలవారు పేదలు – అంటే కూలీలు మాత్రమే మధూ ! ఏమంటావు ?

మధు : ఆలోచిస్తాను.

ని : బ్రతకడం ఎలాగ అనే ప్రశ్న నిన్నేకాదు, ప్రపంచ యువకుల్నందర్నీ బాధిస్తోంది. దానికి జవాబు – నేటి ఆర్థిక విధానాన్ని మార్చడమే. మార్చడం ఎలా? మీవంటి యువకులంతా బ్రతుక్కి భయపడి పారిపోతూ వుంటే ఎదిరించి నిల్వగల మగవాడింకెవరు ? అదిగో, అలా చూడు ఆ కూలీల్ని ! పాపం ! ప్రొద్దస్తమానం పొలాలలో, గనులలో, కర్మాగారాలలో రెక్కలు ముక్కలు కట్టుకొని, జీవచ్ఛవాలలాగ తనువుల్ని ఇళ్ళకు చేరవేస్తున్నారు – నిర్భాగ్యులు! నిరాధారులు ! !

(తెరలో పాట)

ఆకటి బాధల మే మల్లాడగ
నీవు భుజించెదవా ? తండ్రీ !

అంతము లేదా మా కష్టాలకు
దేవా, నీవొక దుంటే ?

నూటికి తొంభైమంది దీనులకు
నోటికి తాళం బాబూ !

ఆకటితో మేమేడ్చుచు నుండగ
అరుగునె తిన్నది నీకు ?

పర : (కళ్ళు తుడుచుకుంటూ) మధూ ! బ్రతుక లేకపోతామా ? ఆ ఉద్యోగం ఆర్డరు చింపెయ్యి?

మధు : (ఆర్డరు చింపేస్తూ) స్వామీ ! మీ అడుగుజాడలలో నడుస్తాను. ఆ కూలీల కోసం నేను త్యాగం చేస్తాను. నా బ్రతుకంతా ఆ నిరుపేదలకు ఒక్క మెతుకు విలువైనా కాగలిగితే !

పర : ధన్యులం మధూ !

ని : నేడు సుదినం, ఈ వారంలోనే ఈ తాలూకా కూలీ యూనియన్ ఏర్పాటు చేద్దాం. గాంధీ మహాత్ముడు ఏ ఆదర్శం కోసం పోరాడాడో ఆ ఆదర్శాన్ని మనం సాధించుదాం. ఆహా, ఇప్పుడు గదా గాఢాంధకారంలో నాకు కించిత్తు వెలుగు గోచరిస్తున్నది !

పర : పదండి, బడిసాలలో వ్యవసాయకూలీలు సమావేశం అవుతున్నారు మీకు స్వాగతం యివ్వడానికి.

మధు : (ఆశ్చర్యంతో) జ్యోతీ !

ని : ఔను, మనకు జ్యోతే మార్గదర్శిని !

(అంతా నిష్క్రమిస్తుండగా తెరపడుతుంది. తెరలో పాట తిరిగి వినిపిస్తూ వుంటుంది.)

# రంగం : 2

(కాలువగట్టు : ఉదయం విశ్వనాధం గారి పాలేరు జోగులు ప్రవేశిస్తాడు, చేతిలో కాగితం వుంటుంది.)

జో : తస్సాగొయ్య! పప్పొండుకున్నంత సంతోషంగా వుందీయేల. ఇల్లు నిండుకున్నా కడుపునిండుగా వున్నట్టుంది. రోజూ ఇల్లాగే అబద్ధంగా కడుపు నిండుతున్నా – ఆ యెధవ పాలేరు తనం మానేద్దును (కాగితం చూస్తూ) కీస్, బాస్, పీస్ ! మా బాబు నన్ను బళ్ళో యేశాడు గాడు, గాడిదకొడుకు ! లేకపోతేనా ? ... (కాగితం గోచీకి ముడివేస్తాడు. అంత శివరాం ప్రవేశిస్తాడు – వెనుకనుంచి)

శివ : ఎవడ్రా దున్నపోతు, దారికడ్డంగా ?

జో : (ఉలిక్కిపడి) ఎవరండి బాబో ! అయ్యబాబో !! తమరా ? (తప్పుకుంటాడు)

శి : ఓరి, గాడిద కొడకా !

జో : పాలేరోణ్ణి బాబయ్యా, రచ్చించాలి.

శి : ఏడిశావుగాని, ఏమిటా ముడేస్తున్నావ్ ?

జో : గోచిపాతండి బాబు !

శి : ఎక్కడి కిలా తగలడుతున్నావు ?

జో : కాట్లాల దిబ్బకండి. మా పెద్దలంతా అక్కడున్నారు.

శి : అయితే త్వరగా చావు.

జో : ఛిత్తం తమరు కూడా–

శి : ఓరి, ఎడ్డి గాడిదా ?

జో : చిత్తం చిత్తం (కంపరంతో నిష్క్రమిస్తాడు)

శి : (ఆలోచించి) వీడెక్కడికి పోతున్నాడు చెప్మా! (పొడుంపీల్చి) ఆc! తెలిసింది తాలూకా కూలి సంఘం ఈ వేళేగా? ఈ వూళ్ళో ఎక్కడా సభ పెట్టుకోకుండా చేశాను. ఆ కాష్టాల దిబ్బలలో పెట్టుకుంటున్నారు, వెధవలు కానీ – ప్రపంచం తల్లక్రిందులవు తోంది! వెధవ కూలి పీనుగులకీ సంఘాలే!

(నిష్క్రమిస్తాడు. అంత తెరలేస్తుంది. సుందరభవనం. పుస్తకాల గది, కుర్చీలు, సోఫాలు వుంటాయి, ప్రేమకుమార్ పాడుకుంటూ – ఎక్కడికో వెళ్ళడానికి ముస్తాబవుతూ వుంటాడు.)

ప్రేమ : (పాట)

కోకిల పాడినగానీ
కాకులు కూసిన పోనీ,
హాయిని గూర్చే తీయని
ఆమని కేలా ?

ప్రియు లోహో భళి యందురో
విరసులు విసుగొందుదురో,

వెన్నెల జల్లే చల్లని
పున్నమ చంద్రుని కేలా ?

మధుక్షణములు వర్షించునొ
మందాగ్నులు దహియించునొ

సహజమైన నీ గానము
చాలించకుమోయి కవీ !

(అంత విశ్వనాధం ప్రవేశిస్తాడు)

వి : ఏదైనా వూరా ?

ప్రే : లేదండీ నాన్నగారు, ఇక్కడికే వాళ్ళేదో సభ పెట్టుకుంటున్నారట. పిల్చారు.

వి : ఎవళ్ళు ?

ప్రే : తాలూకా వ్యవసాయ కూలీ యూనియనో ఏదోనట. మధు ఒకసారి రమ్మన్నాడు.

వి : (ఆలోచించి) ఓహో ! అదా ! ఏ మధు?

ప్రే : వాళ్ళ మధు, నా క్లాస్‌మేటేగా ?

వి : వాడికేం మతిపోయిందా ? ఏదో ఉద్యోగం సంపాదించుకోక, ఈ కోతులముఠాను లేవదీస్తున్నాడు ?

ప్రే : విషయాలన్నీ తెలుసుకొద్దామనే.

వి : సరే, వెళ్ళిరా, ఇదిగో, అబ్బాయ్ ! వాళ్ళతో కలసి కూర్చోకేం, అన్నట్టు వాళ్ళు వల్ల కాట్లో పెట్టుకుంటున్నారు సభ ! కుర్చీ ఏదైనా పట్టించు కెళ్ళు.

ప్రే : సరే లెండి. చూస్తాను.

(నిష్క్రమిస్తాడు. అంత రెండో ప్రక్కనుంచి శివరాం ప్రవేశిస్తాడు)

వి : ఇదిగో – చూడండి, అబ్బాయి వాళ్ల మీటింగు కేదో వెళతాడట కూడా కుర్చీ ఒకటి పంపించండి.

శి : చిత్తం. (తలగోకికొని) అబ్బాయిగారు ఆ పాడుచోట్లకి వెళ్ళడం అంత క్షేమం కాదనుకొంటానండి.

వి : క్షేమమో, గీమమో – ముందు పని చూడండి.

శి : చిత్తం. చిత్తం (పొడుం పీలుస్తూ పోతాడు)

వి : ఈ చదువులూ – ఈ బుద్దులూ – ఇక గోతులూ గొప్పలూ సరిచేసేలా గున్నాయి!

శి : (వినయంగా ప్రవేశించి) చిత్తం అబ్బాయిగారు బండీ చేయించు కుని వెళ్ళారండి అయితే – చూశారూ కానికాల మొచ్చేసింది.

వి : నేనూ అదే ఆలోచిస్తున్నాను. ఏదీ - కాస్త -

శి : (ప్రక్క బీరువానుండి సీసాతీసి గ్లాసులో పోసి అందిస్తూ) క్రొత్తది - ఇదివరకెప్పుడూ మనం వాడలేదు.

వి : (ఒక్క గుక్కలో త్రాగేసి) ఊఁ ! అబ్బా ! బాగుంది ఏమిటీ ?

శి : ఈ కూలీ సంఘాలు -

వి : ఆ అదే ! అదే ! ఆ గాంధీ పుట్టినప్పటినుంచీ అంతా తగలబడి పోతోంది.

శి : బ్రతికుండగా సాధ్యంకాని వాడి ఆదర్శాలు చచ్చిం తర్వాత సాధిస్తారట ఈ కోతులు. వీటిని గోటితో త్రుంచెయ్యకపోతే - గొడ్డళ్ళదాకా వస్తుంది.

వి : ప్లాను తయారుచెయ్యండి.

శి : మనం పెద్ద ఉద్యోగస్తులందరికీ యిద్దామనుకుంటున్న విందు మనకు ఈ విషయంలో బాగా ఉపయోగపడద్ధి.

వి : భేషుగ్గా ! నెంబరు వొన్ బుర్రండి మీది, గుమస్తా గారు ! బాగా మెహర్బానీగా చేయించండి. ఖర్చుకు చూడవద్దు.

శి : అబ్బే, అందులో వెనకడుగు వేస్తానా ? ప్రత్యేకంగా -

వి : ఊఁ నన్నడగాలా ?

శి : ఎస్టిమేటు (కాగితం తీసి) ఏదో వేశాను.

వి : ఇలా తేండి (తీసుకుని సంతకం చేసి ఇచ్చేస్తాడు) ఎవడ్రా అక్కడ?

శి : చిత్తం ఎవడ్రా అక్కడ ? జోగడు కూడా రాలేదే !

వి : రాస్కెల్ ఇంకా రాలే ?

శి : వాళ్ళ సంఘం గదండీ

వి : వీడికీనా ?

శి : ఏమో 'వినాశకాలే విపరీత బుద్ధిః' -
(అంత కంగారు పడుతూ జోగులు ప్రవేశిస్తాడు)

జో : దండాలు దొరగారు !

శి : వచ్చావూ ? ఏం రా ? పెళ్ళాం విడిచిపెట్టలేదా యేంటి ?

జో : కాదండి బాబయ్య -

వి : (కోపంతో) దొంగ రాస్కెల్ ? ఇంత ఆలస్యమేల రా ? ఇడియట్ ?

జో : (వణుకుతూ) మా వాళ్ళుండి -

వి : ఆ ! మీ వాళ్ళు ?

జో : సంగం పెట్టుకున్నారండి. నేను రానంటుంటే రెక్కట్టుకుని లాక్కుపోయారండి.

శి : చిత్తగించారా తమరు ? తమరింకా జీవించి వుండగానే

వి : ఊఁ ! వీళ్ళపని చెప్పుతాగా (హూంకరిస్తాడు)

జో : (వణుకుతాడు)

శి : చెప్పరా చెప్పు - ఇంకా యేంటి మీటింగు సంగతులు ?

జో : సంగం నోటి చేశారండి. దానికి మధు పెసర్రొట్టండి. జోతి సెక్కర్రొట్టండి. భయంకరంగాడు వీసె పెసర్రొట్టండి. అందరిచేతా యేలుముద్దర్లు యెయ్యించుకున్నారండి. సంగ మింకా నడుస్తోందండి....

శి : నువ్వూ వేశావా వేలిముద్ర ?

జో : లేదండి నా యేలు పట్టుకెళ్ళి - మసిలోముంచి, కాగితం మీద లెగదీశారండి.

శి : కొంపముంచేర్రా ! నట్టేట్లో కలిపేశేర్రా నిన్ను !

జో : (ఏడుస్తూ) నిజమేనండి బాబయ్యా ? అయ్య నా కొంపో ! (నెత్తీ నోరూ కొట్టుకుంటాడు)

వి : (సిగరెట్ వెలిగిస్తూ) పొమ్మనండి, గాడిద కొడుకుని.

శి : పోరా - జోగా, ఆనక నాకు కనిపించు, పో.

జో : రచ్చించాలండి బాబయ్య ! (గుండె కొట్టుకుంటూ పోతాడు)

శి : తమకు పోటీ తయారైందన్నమాట !

వి : నాకా ? హు !

శి : భయంకర్‌గాడు మనచేతిలో వుండేవాడు. ఆ పిల్ల కోసం వాడు అందులోకి పోయాడనుకుంటాను.

వి : ఏ పిల్ల ?

శి : సంఘానికి సెక్రటరీ – పరంజ్యోతి. తమరు ఆ పిల్లని చూశారా ? పోతపోసిన బంగారు తీగ కదండీ ?

వి : మరి – చూపారు కాదేం ?

శి : ఆ ప్రయత్నంమీదే వున్నాను సుమండీ... వాడెవడో నిష్కులయోగట! "కులం లేదు, మతం లేదు" అని వీధుల వెంట తెగ అరుస్తున్నాడు. కడకి కులాన్నీ, మతాన్నీ కూడా నాశనం చేసేలాగున్నారండీ వీళ్ళు!

వి : ఆఁ ! దుంప తెంపేస్తానని చెప్పండి. వెధవమూక – నల్లుల్ని నలిపినట్టు నలిపేస్తా – ఏదీ కొంచెం లేవదీయండి.

శి : (లేవదీస్తూ) తమశక్తి నాకు తెలీదూ ? హనుమంతుడి దగ్గర కుప్పిగంతులా, వెధవలు ?

వి : ఊఁ (నిష్క్రమిస్తాడు)

శి : (పొడుంపీల్చి – వికటంగా నవ్వుతూ) కాళ్ళు నెత్తి మీద కెక్కుతామంటే చెల్లుద్దా. రైతులూ, కూలీలు ఒకటే అని ఆ నిష్కుల్‌గాడి బోధ. రైతులూ, కూలీలూ ఏకమైతే ఇంకేముంది ? కూలీల్నీ, రైతుల్నీ ఎప్పుడూ కలవనివ్వగూడదు. కలిశారా – విప్లవమే! విప్లవం వచ్చిందా, సర్వం జగన్నాథమే. అప్పుడు నాలాంటివాళ్ల నోట్లో దుమ్మేగా ? చుక్క పట్టించి చుక్కాని పుచ్చుకొని విశ్వనాథరావుని నేను నడిపిస్తాను. ఈ కూలీ ఉద్యమాన్ని మొగ్గలోనే త్రుంచేస్తాను. (పొడుంపీల్చి) విందేర్పాటు చేసున్నాంగా ? పెద్ద ఉద్యోగస్తులంతా నా చేతిలో ఉంటారు. ఇందులో కొంత సొమ్ము మిగులుద్ది. (తలవూపుతూ, పచార్లు చేస్తూ వుంటాడు)

(తెర)

## రంగం:3

(ప్రజాపురంలో ఒక వీధి. ప్రచారం చేసుకుంటూ పాడుతూ పరంజ్యోతి ప్రవేశిస్తుంది.)

పర : (పాట)

పగలెల్ల పనిచేసి
పస్తు పడుకుంటావు
పల్లెత్తు మాటాడలేవా ? ఓ కూలి !
పావలా తెచ్చుకోలేవా ?
పుట్ల కొలది నీవు
పురిగట్టి వస్తావు
ఆకలని చెప్పుకోలేవా ? ఓ కూలి !
అర్థభాగము పొందలేవా ?
పంట పండిస్తావు
పరుల కర్పిస్తావు
ప్రియముగా భుజియించలేవా ? ఓ కూలి !
ప్రేమతో జీవించలేవా ?

(నిష్క్రమిస్తుంది. అంత నిష్కల్ ప్రవేశిస్తాడు)

ని : ఓ భారత వీరులారా ! వ్యవసాయకూలీ యూనియన్‌ను బలపరచండి. ఈ యూనియన్ పరమాశయం ఒకే ఒకటి. అది కుల మత వర్గ విభేదం లేని సర్వస్వామ్య సమాజాన్ని నిర్మించడం. మీరంతా ఈ యూనియన్లో చేరి, దీన్ని బలపరచి, సర్వమానవ శ్రేయస్సుకు తోడ్పడండి.

కుల మతముల్ నశించి, తన
కూర్మి తనూభవు లేకజాతిగా
కలసి వసింప, జూచు తను
కమ్మున నున్నది భారతాంబ ! యో

ధులు గలరేని రండు ! మన
దోర్బల ధీ బల శ్రీ బలమ్ములన్
మిళితము జేసి జాతి నొక
మేరకు దెత్తము భాగ్యశాలిగా !

(నిష్క్రమిస్తాడు. అంత మధుమూర్తి ప్రవేశిస్తాడు)

మధు : ఓకూలీ యువకులారా !
అతుల దరిద్రమే నరక
మౌ, నరకమ్మున గూలి చచ్చినన్
బ్రతికిన నొక్కటే గనుక,
శ్రామికులార ! నిరంతర వృథా
చితిపయి నెంతకాలము వ
సించి నశింతురు ? లెండు, రండు, భా
రత ధన ధాన్యముల్ మనకు
రాగల భాగము పంచుకొండికన్
తరిమి తెగవేయుడెల్ల సోమరితనమ్ము,
సత్వరమ్ముగ గొనుడు విజ్ఞానదీపి,
కాంతి నింపుకొనుండు మన్గడల నిండ
జాలి జీవింపవలెనన్న సరసులార !

(నిష్క్రమిస్తాడు అంత తెర లేస్తుంది. అది మిత్రగది. మిత్ర చక్కగా అలంకరించుకొని, చేత జాతీయపతాక తీసుకొని, బైటికి పోవడానికి తయారవుతూంది – మధ్య మధ్య పాడుకుంటూ)

మి : (పాట)
నీ ప్రేమే నా జీవనము
నీ ప్రేమే నా బలము;
నీ ప్రేమోదయ తారాపథమున
వేరవి తెర్వరి నేను:

ప్రేమింపుము చెలి ! ప్రేమింపుము నను,
శ్యామల కోమల సస్యవల్లిగా;
నీ కానంద సుధాపాత్రమునై
లోకానికి శ్రేయము కూర్తు

(మెల్లిగా భయంకర్రావు ప్రవేశిస్తాడు

భ : వారెహ్వా !

మి : (అదిరిపడి వెనక్కిచూస్తుంది)

భ : హ్హా ! హ్హా ! కాకర పువ్వొత్తిలా తయారవ్వావే !

మి : వ్యవసాయ కూలీ యూనియన్ జిల్లా కమిటీ మీటింగు వుంది అన్నా! అక్కడికి వెళుతున్నాను

భ : ఓహో ! ఆ జడలో పువ్వులు నేను సర్దుతా, ఇలారా !

మి : అక్కర్లేదు.

భ : నీ తల వెంట్రుక అంత పల్చగా వున్నాయేల ?

మి : పోనీలే.

భ : నా తలవెంట్రుకలు చూశావా ఎంత దట్టంగా....

మి : తలకు వెంట్రుకలున్నంత దట్టంగా మెదడుంటే బాగుండును.

భ : హహ్హహ్హా ! సారా గుక్కలాంటి మాటాడావు, ఏదీ ఒక్క...

మి : ఇంతకాలమూ నీవుచేసిన పాపాలు చాలు. సంఘంలో వైస్ ప్రెసిడెంటు వయ్యావు. ఇకనైనా కాస్త మంచిగా బ్రతుకు.

భ : వైస్ ప్రెసిడెంటైతే – అన్నం తినడా. పిల్లల్ని కనుక్కోడా ?

మి : ఛీ, నే వెళ్ళి పోతున్నాను.

భ : వద్దు, వద్దు , కాని ఇదిగో .. జ్యోతి..

మి : ఛీ !

భ : ఆమె నా క్రింద సెక్రటరీ ! తెలుసా ? ఆమె నా కింద, నేను పైని ! అహ్హహ్హ!

(తలుపు చప్పుడవుతుంది)

భ : డామిట్ !

మి : (పోయి తలుపు తీస్తుంది, మధు, నిష్కల్, పరంజ్యోతి ప్రవేశిస్తారు. మిత్రపోయి జ్యోతి ప్రక్క నిలబడుతుంది.)

ని : ఏమిటి నాయనా, హుషారు ?

మి : హుషారుగాక మరి పనేముంది స్వామీ !

ని : మనశక్తిని దుర్వినియోగం చెయ్యగూడదు, నాయనా ! సమాజ శ్రేయస్సుకోసం అభివృద్ధి నిరోధక శక్తుల మీద బహిరంగంగా పోరాటం సాగించేకాలం వచ్చింది. నీలాంటి ఉత్సాహవంతులైన యువకులే కదా ఈపీడిత ప్రజలకు అండ ?

భ : ఓస్ ! మొనగాళ్ళు బైలుదేరారు ! అసలు ఈ కూలీ సంఘాన్ని లేవదీసిన మొగాణ్ణినేనే. ఈ ప్రాణాలు నావికావు, నా సంఘానివి. నేను బ్రతికి వుండగా నా సంఘం మీద ఈగ వాలనివ్వన్ (మీసం దువ్వుతాడు)

పర : ఆ కాలానికి బకాసురుడు; ఈ కాలానికి వీడూను.

భ : హహ్హా ! అదీ మాట.

ని : సమర్థుడవు, ఈ రాష్ట్ర యూనియన్‌ను నీ భుజాలమీద మొయ్యాలి.

భ : రాష్ట్ర, జిల్లా, ఆలిండియా...

మధు : భేష్ ! అదిరా ప్రయోజకత్వం !

మి : మాటల్లో మేరువు, చేతల్లో రేణువు !

భ : షటప్ ! నువ్విక్కణ్ణుంచి పో

ని : ఇక మన కార్యక్రమం జరుపుకుందాం. ముందు సమాజంలో చైతన్యం కలిగించడానికి సమర్థులైన యువకులు కావాలి.

పర : తమలాంటి ప్రబోధకులు...

భ : ఓస్ ! ఇలాంటి సన్యాసులా జాతి నుద్ధరించేది ? నా వంటి బలపరాక్రమ విక్రమ...

మి : వెయ్యిమంది దుర్మార్గుల కంటె, ఒక్క మంచి సన్యాసి ఉత్తమం.

భ : (ఉగ్రుడై) నువ్విక్కణ్ణుంచి పోతావా, పోవా ?

పర : నువ్వు మాట్లాడకు, మిత్ర ! ఇక కార్యాలోచన సాగనియ్యండి.

ని : ఇక మన కార్యక్రమం...

భ : ఏముంది ? ఈ యేడు పొలాలన్నీ కూలీలే కోసేసుకోవాలి. భూస్వాము లడ్డంవస్తే బాజుపట్టాలి.

మధు : ఓరే ! ఆ పని సాగేదికాదు. అసలది మన కార్యక్రమానికే విరుద్ధం. జీవిత వ్యయప్రమాణం పెరిగింది కాబట్టి కూలీరేట్లు పెంచమని ముందు భూస్వాముల్ని అడుగుదాం.

పర : ముందు విశ్వనాథరావుని అడిగి, ఆయన వినకపోతే తక్కిన రైతుల్ని అడుగుదాం.

భ : ఇలాంటి పిరికిపందలా సంఘానికి నాయకులు ! కత్తీ కర్రా పుచ్చుకోవాలి, బరిమీద నిలబడాలి. కూలీల చేత వీరకార్యాలు చేయించాలి. 'దొరగారూ, కాస్త గంజి పొయ్యించండీ ?' అని దేవురించడమా ? ఛీ ! ధిక్ !

మధు : ఉద్రేకం వల్ల పనులు సాగవు. పైని ప్రభుత్వం ఉంది. భూస్వాముల దగ్గర ధనం వుంది.

పర : మనది బ్రతుకు తెరువు సమస్య, ఇది ఇప్పుడు సాఫీగా పరిష్కారమైతేనే సుఖం !

భ : పడతి ఇంటికి పెత్తందారైతే, గడపనిండా ముల్లకంపలే.

పర : భయంకర్ ! నువ్వంత మొనగాడివైతే, ఆ పని ఇంతకు ముందే ఎందుకు చేశావు కావు ?

మి : ఇంతకు ముందా... టైం లేక.

ని : మధు పద్ధతే బాగుంది. అత్యవసరమైన తిండి సమస్య ముందు పరిష్కారమైతే, తక్కిన కార్యక్రమ నిర్వహణకు మార్గం సరళమౌతుంది.

మధు : విశ్వనాథం గారి దగ్గరకు రాయబారం ఉత్తమం

భ : మీరు పొండి, నేను రాను.

మధు : వచ్చితీరాలి. నాయకుడికి శ్రమ, ఓరిమి వుండాలి.

ని : కార్యసాధనకు – బుద్ధిబలానికి వెనుక భుజబలం వుండాలి.

భ : తక్కిన వారెవరు ?

మధు : నీవూ, రాజు, హరి, జ్యోతి...

భ : ఆడవాళ్ళెందుకు ? ఆ విశ్వనాథం మంచివాడు కాదు.

మి : నీ కన్న నయమేమో ?

ని : ఇక లేదాం. నేను రైతుల్లో ప్రబోధం చేసి వస్తాను. మీరు రాయబారం నడుపుకు రండి.

(అందరూ లేస్తారు. ముందు పరంజ్యోతీ, ఆ వెనుకనే భయంకర్, తర్వాత నిష్కల్ వెడతారు)

మధు : మిత్రా, ఏమిటి విశేషాలు ?

మి : త్రాగుబోతును మించి పోతున్నదా మధు !

మధు : అనుభవిస్తాడు.

మి : అతను కాదు అనుభవించేది. మనం ! వీడిని మన యూనియన్‌లో ఎందుకు చేర్చుకున్నారు.

మధు : వీడి సంగతి నాకు తెలుసు. అయినా – వీడు వుంటే బలమని –

మి : బైట వాళ్ళని భయ పెట్టడానికి ఇంట్లో పెద్దపులిని పెట్టు కుంటామా?

మధు : వీడు బైటవుంటే తిరిగి మనమీదే కత్తిగట్టడా ?

మి : ఇప్పుడు మానాడా ? ఒక దుర్మార్గుడికి భయపడుతూ ఒక సంస్థని ఎంతకాలం నడపగలం ? సరేగాని – జ్యోతిని మాత్రం ఒక కంట కాపాడుతూవుండు.

మధు : ఆమె విషయం నాకు వొదిలెయ్యి మరి నీ విషయం ?

మి : నా విషయం నాకే వొదిలెయ్యి, నీ ప్రేమబలం నాకు లేకపోతే ఏమో గాని–

మధు : (దగ్గరకు తీసుకొని) మిత్రా ! పేదలకు ప్రేమే గదా బలం ?

మి : ఆ బలం పొందిన వాళ్ళే గదా ధన్యులు.

మధు : నన్ను అనుమానిస్తున్నావా ?

మి : ప్రారంభించిన ప్రవాహం మధ్య ఏ ఎడారిలోనో ఇంకి పోవచ్చు లేక ఏ పెద్ద ప్రవాహంలోనో కలిసిపోవచ్చు.

మధు : పేదరికం బ్రతుక్కు ఒక ఎడారి. ఎడారిలో పుట్టిన ప్రవాహం ఎండి పోతుందా ? ఇక – ఏ సరస్సులోనో కలిసిపోగూడదా అంటావు.

ఆశయము జూచుకొని ప్రేమ అంకురించు
అంకురించగనే దాన నైక్యమొందు,
ఎడతెరపి లేక ప్రవహించు నెంత నైన,
ప్రణయ జీవితమున నెడబాటు లేదు

(చెక్కిలి మీటి నిష్క్రమిస్తాడు)

మి : (మధు వెళ్ళే దారివంక చూస్తూ) ధన్యురాల్ని ! !

(పాట)

నీ ప్రేమే నా జీవనము,
నీ ప్రేమే నా బలము,
నీ ప్రేమములో లేదిక నా కే
నిస్పృహా, నిరాశ తృణమేని
మెలగుదు నీ కన్నుల ఛాయలలో,
చెలగుదు నీ హృదయాదర్శములో,
నీ యదుగులలో అడుగు లిడుచు నీ
నీడగ, జాడగ ఆడుదు, పాడుదు.

(తెర)

## రంగం:4

(ఎదుట పైరుచేలు కనిపిస్తూవుండే తోట. చల్లని నీడల విహరిస్తూ కుమార్ ప్రవేశిస్తాడు)

ప్రే : తరలిపోయిన వాసంతి మరలివచ్చు
భవ్యనవ్య సౌందర్య సంపదలు దాల్చి !
ప్రాతకోకిలమే క్రొత్త పాటపాడు !
ప్రాత తీగెలె క్రొత్త పుష్పములు పూయు
ప్రాత మామిడియే క్రొత్త ఫలము లొసగు
ప్రాత చేలలో సరిక్రొత్త పంటపండు

ప్రాత మెదడులో క్రొత్త భావములు పుట్టి
కదుపవలయును జాతి నభ్యుదయ పథిని

ఒక్క మానవజాతి తప్ప ప్రకృతి అంతా ఆనందమయి ! .. జాతి మతవర్గ విభేదాలు పెట్టుకుని మానవజాతి మతిహీనమై, సౌఖ్యహీనమై పోయింది. ఇంగ్లండులో పుట్టినా, ఇండియాలో పుట్టినా మామిడిచెట్టు – మామిడిచెట్టే, మనిషి ఎక్కడ పుట్టినా మనిషే .... ఇతర ప్రకృతిలో లేని కులమత విభేధాలు మనుష్యుల కెందుక్కావలసి వచ్చిందో ?... ... నిష్కల్ ప్రబోధం కొంత సత్యబద్ధంగానే కనిపిస్తున్నది !... కులమత వినాశనమే మానవజాతికి పురోభివృద్ధి... అదిగో ! ఆ పొలంలో గడ్డికోస్తున్న కూలీబాలిక ! ఆమె కులమతాలతో సంబంధం లేకుండా ప్రకృతిమాత ఒడిలో పెట్టుకుని లాలిస్తున్నది. ఉదయిస్తున్న సూర్యుడు ఆమె మొగం ముద్దులాడుతున్నాడు! ఆ మైలపడ్డ సూర్యునికే వందనం చేస్తున్నాడా బ్రాహ్మణుదెవరో ! ఆహా ! ఈ వనంలో కూర్చుని ఆ గడ్డిపిల్లనిచూస్తూ – ఏ వర్డ్స్వర్తు మహాకవో అయితే– ఒక చక్కని సుందరకావ్యం నిర్మించి వుండును.... ఆ పిల్ల నాకు పరంజ్యోతిని జ్ఞప్తికి తెస్తూవుంది !... చిన్నప్పుడు స్కూల్లో చదువుతూ నాతో యెంతో యిదిగా ఆడుకొనేది !... మొన్న మహాసభలో చూశాను. వ్యవసాయకూలీ యూనియన్‌కు సెక్రటరీ అయింది ! పరంజ్యోతి.

శ్రమిక వర్గములోపల జనన మొంది
జన్మదేశము గొల్చు దీక్షను వహించి,
పంకజము రీతి, ప్రమిదె దీపమ్ము వోలె,
జ్యోతి నా కంటిలో పరంజ్యోతి యయ్యె

ఎవరది ? ఒరే జోగులూ !

జో : చిత్తం (ప్రవేశిస్తాడు)

ప్రే : అలా నీరసంగా వున్నా వేమిరా ?

జో : అయ్య ?

ప్రే : ఒరే ! పరంజ్యోతికి పెళ్ళయిందా ?

జో : అయిందండి. ఇద్దరు పిల్లలు కదండి, బాబు ?

ప్రే : (కోపంతో) ఎవరికిరా ?

జో : నాకండి

ప్రే : ఓరి చెవిటి మాలోకమా ! ఎప్పటినుంచిరా నీకీ చెవుడు ?

జో : అయ్య ? (తూలిపడిపోతాడు)

ప్రే : అరే ? వీడికి వడగొట్టినట్లుందే ?

(జేబులో నిమ్మకాయతీసి పిండుతాడు)

జో : (లేచి) నిన్న తాగిన గెంజండి బాబయ్య ! దొరగారికి నా మీద ఏదో కోపమొచ్చి ఇగరేశారండి బాబయ్య ? చెవులు గళ్ళడి పోయాయండి (ఏడుస్తాడు)

ప్రే : ఆహా ! అయితే – నే నిప్పుడే వెళ్ళి అన్నం పంపిస్తాను. ఇక్కడే వుండు (నిష్క్రమిస్తాడు)

జో : ఓహో ! దయగల తండ్రి ధరంరాజు

(అంత భయంకర్ ప్రవేశిస్తాడు)

భ : ఓహో ! ఒరె, జోగులూ !

జో : (అదిరిపడి) చిత్తం బాబయ్య ! (చూచి) ఓసి, నువ్వా ! నా కీ తలకాయ పనికి రాడంలేదురా !

భ : ఆ దొంగ రాస్కెల్ అంతేరా, నేను చూశావూ ? ఎప్పుడూ నా తలకాయ టోపీలో పెట్టుకుని నడుస్తాను... సరేగాని – నీ కామందెక్కడ !

జో : ఏమో –

భ : నువ్వు కూడా సంఘంలో మెంబరువేగా ? రా (చెయ్యి పట్టుకొని లాగుతాడు)

జో : బాబోయ్ ! నన్ను చెట్టుకు కట్టేసి తన్నుతారు.

భ : నేనుండగా నిన్ను తన్నే పీనుగెవడ్రా ? (బర బర లాక్కుపోతాడు, అంత శివరాం పొడుం పీలుస్తూ ప్రవేశిస్తాడు)

శి : ప్రేమ్‌కుమార్ వైఖరి యేమీ బాగండలేదు. ఈ దివాణంలో అతడొక్కడే నాకు వ్యతిరేకి. ఈ మాల చదువులు మనుషుల్ని మార్చేస్తూ వున్నాయి. మడీ, మైలా, కుడి, ఎడమ, హెచ్చు, లొచ్చు, కలిమి, లేమి, కష్టం, సుఖం ఏమీ లేవనడం నేర్చుకున్నాడే త్రాష్టం! సరే ! (అంత ఊరేంగింపులో మధుమూర్తీ, పరంజ్యోతి యింకా కొందరు కూలీలు ప్రవేశిస్తారు.)

మధు : గుమాస్తాగారికి నమస్కారాలు

శి : సర్వేజనా స్సుఖినోభవంతు. ఒరే ! ఎప్పుడొచ్చావురా; చదువు పూర్తి అయిందిరా!

మధు : చిత్తం మీ ఆశీర్వాదబలం వల్ల.

శి : కష్టపడి చదివించారు మీ వాళ్ళు ఏదో నాలుగు డబ్బుల ఉద్యోగం సంపాదించుకుని బ్రతుకు. ఏం పని మీద వచ్చారు...? జ్యోతి పెద్దదయిందే!

మధు : మేము విశ్వనాథంగారి దర్శనార్థం వచ్చాం.

శి : ఏం పని ?

మధు : ఈ వచ్చే కోతల్లో కూలీలకు యిచ్చే కూలీ కొంచెం పెంచమని –

శి : బాగుంది. మంచిదే, సబబే, అడగండి.

మధు : మీ సహాయం –

శి : తప్పకుండా... దొరవారు కొంచెం... ఫర్వాలేదు... అడగండి ! నేను తప్పకుండా చెపుతాను. తాను పెట్టలేకపోయినా, పెట్టే యిల్లుచూపమన్నారు పెద్దలు. భూమి మీద నిల్చేది ఒక సుకృతమే కాదట్రా ? మనం నెత్తిని గట్టుకుపోతామా ? వెళ్ళండి. వెళ్ళి – అడగండి. నేను తప్పకుండా చెబుతాను.

మధువగైరా : (కృతజ్ఞతతో చేతులు మోడ్చి) దయ వుంచండి (నిష్క్ర మిస్తారు.)

శిం : (వికటంగా) కూలీ సంఘాలు ! గోంగూర సంఘాలు ! వేటాడ బోయిన కుందేలు వంటిల్లు జొచ్చింది ! వీళ్లని మెత్తగా తన్ని ఈడ్పించాలి. విశ్వనాథం మంచి కైపు మీద వుంటా డిప్పుడు – మంచి సమయం, (పొడుం పీల్చి నిష్క్రమిస్తాడు. అంత తెర లేస్తుంది. సుందర భవనం కచేరీసావిడి. విశ్వనాథం కూర్చుని వుంటాడు సోఫాలో, వెనుకగా ప్రేమ్‌కుమార్ కనిపించకుండా కూర్చుంటాడు. శివరాం విశ్వనాథం వెనక నిలబడతాడు. మధు, భయంకర్రావు, పరంజ్యోతి వగైరా రాయబారవర్గం ఎదుట నిలబడి వుంటారు)

వి : మేం కూలీ సంఘం, చింతకాయ సంఘం అంటే మన్నించేవారం కాము, పొండి.

మధు : ఈ నిరుపేదల్ని దయజూడండి. చిన్నప్పటి నుంచీ మమ్మల్ని బ్రతికించు కొస్తూవున్న దొరలు మీరు. ఈ కరువు రోజుల్లో కూడ బ్రతికించండి.

వి : బ్రతికిస్తూనే వున్నాం. మేము లేకపోతే ఈపాటికి మీరు చచ్చి వుండేవాళ్ళు.

భ : (పెడగా) లేకుండా పోండి. ఎలా బ్రతకగలమో. చూస్తాం.

మధు : ఇప్పుడు ధరలు పెరిగాయి, జీవనవ్యయం హెచ్చి పోయింది. మామూలు కూలీ రేటుకు బ్రతకలేం. మిమ్ము కోరేది అద్దెడు ధాన్యం మాత్రం. ఈ నిరుపేద కూలీలను ఈ యెద్దడి రోజుల్లో బ్రతికించిన పుణ్యం ఊరికెనే పోదు.

భ : రోజుకు వందులు వేలు ఖర్చు చేసే మీకు ఒక దరిద్ర కార్మికుడికి అద్దెడు

గింజలివ్వడం ఒక లెక్కలోది కాదు.

వి : నోరుముయ్ ! మా ఖర్చు జోలి నీ కెందుకు ? నీ వెవ్వడవ్ మమ్మల్ని విమర్శించడానికి ? తన్ని ఈడ్చినా దమ్మిడీ రాలని ముష్టి వెధవ అంతా మమ్మల్ని ధిక్కరించడమా ? (మీసం త్రిప్పుతాడు)

భ : (మీసం మెలేస్తాడు)

మధు : వీళ్ళింత ముష్టివెధవలు కావటానికి కారణం ?

వి : పొండి, పొండి ! గాడిదల్లాగ !

పర : మీరంత ఆగ్రహపడితే మే మెలా బ్రతకగలం ?

వి : రోడ్డుమీద కంకర తిని బ్రతకండి.

భ : (హుంకరిస్తాడు)

మదు : మీ అడుగులకదగ్గరకు వచ్చి అడుగుతున్నామని మాకు గౌరవం లేదని అనుకోవద్దు. మీ గాదెలో ఒక్క ఎలక తిన్నంత కాదు. ఇన్నివేల కార్మిక జీవనాల్ని...

వి : ఎలుకలు, చిలుకలు, తినేసినా సరేగాని మీ కూలీలకి గిద్దెడు కాదు; ఒక్కగింజ కూడా ఎక్కువగా ఇయ్యను.

ప్రే : (మాట్లాడబోయి ఊరుకుంటాడు)

పర : మనుష్యుని కనీస లక్షణం కారుణ్యం కూడ చూపలేరా ?

వి : అది నీ మీద చూపగలను. నీ వుండి తక్కిన వాళ్ళని పంపెయ్యి.

భ : రాస్కెల్ ! ఏమన్నావ్ ? (ఉద్వేగంతో విశ్వనాథం మీదకు దూకుతాడు, శివరాం క్రిందపడిపోతాడు, ప్రేమ్‌కుమార్ భయంకరరావును అడ్డుకుంటాడు. మధు వెళ్ళి విడదీసి భయంకర్‌ను తీసుకుపోతాడు. పరంజ్యోతి అంతకు ముందే వెళ్ళిపోతుంది. అల్లరి గగ్గోలు మధ్య తెర పడుతుంది.

## రంగం:5

(ప్రజాపురంలో వీధి నిష్కల్ పాడుకుంటూ ప్రవేశిస్తాడు)

ఆక లాక లని అడిగే వాడికి
అన్నము లేదేమయ్యా ?
అందరి ఆకలి తీర్చేవాడికి
ఆకటి చావేమయ్యా ?
కొంపగట్టి, బట్టనేసి జగతికి
కోరిన సౌఖ్యం కూర్చే వాడికి
కొంపలేదు, గుడ్డలేదు, సౌఖ్యం
గోరంతయు లేదయ్యా !
శ్రామికులారా ! లెండయ్యా మీ
జన్మ హక్కులను గొండయ్యా !
గాంధిమహాత్ముని చరణ ద్వయమే
గట్టిగ నమ్ముక పదరయ్యా !

ఓ శ్రామికులారా !

కూటికోసము, అటుమీద కులము లేని
జాతికోసము, అటుమీద జాతిలేని
మానవత్వము కోసము, పూని మీరు
అడుగు ముందిడి సాగుడో యయ్యలార !
కల్గునేని కూడు, కల్గును సౌఖ్యమ్ము
సౌఖ్యమున్న భూమి స్వర్గ మగును,
శ్రమికులార లేచి సాగుడు ముందుకు
కూడు వచ్చు, దాన కులము చచ్చు.

కార్మికులా ! ఏకంకండి. ప్రపంచం తలక్రిందులైనా సరే, మీ కోర్కెలు

నెరవేరే వరకూ మీ అభ్యుదయ పురోగామిత్వాన్ని వీడకండి. సర్వోదయ స్వామ్యవాదం స్థాపించడమే మన ఆశయం. మానవజాతిని మహోన్నత స్థాయికి ఎత్తగల శక్తిమంతులం మనమే. ఓ భూస్వాములారా ! ఈ కార్మికుడెవరు ?

గట్టుపై మిమ్ము గూర్చుండబెట్టి తాను`
పొలము పండించి మీయింట పురులుగట్టు,
అద్దముల మేడలను మిమ్ము నిద్దురించి
కాపలా కాయు రేయెల్ల కార్మికుండు !

అట్టి కార్మికుని శ్రేయస్సే, మీ శ్రేయస్సు. జాతి శ్రేయస్సు, కార్మిక జాతి నుద్ధరిస్తే మిమ్ము మీరే ఉద్ధరించుకొన్నట్టు. గాంధేయ సిద్ధాంతాన్ని ఉద్ధరించినట్టు లేక ఉపేక్షిస్తే –

రగులుచున్నది అగ్ని పర్వత మొకొక్క
శ్రామికుని గుండెలో, అది రగిలి రగిలి
భళ్ళుమని బ్రద్దలై అగ్ని బరపునేని
అపుడు చింతించి లాభ మేమైన గలదె ?

(నిష్క్రమిస్తాడు, అంత తెర లేస్తుంది. పరంజ్యోతి గృహోపరసాల వనం, ఆమె బెంగగా ఆలోచిస్తూ వుంటుంది.)

పర : పెట్టుబడిదారీతనం, భూస్వామ్యం – ఈ రెండు ముఖాల రాక్షసత్వాన్ని ఈ మానవ సంఘం ఎంతకాలం నుంచి భరించుకొంటూ వస్తున్నదో! ఆహా.)

(పాట)

లోకమా !

ఎట్లు భరించెదవో ? లోకమా !

రాజరికమ్ముల పేరిట అడిగే

రౌడీతనములు, రక్తపాతములు

ధనమదాంధకారములో పగిలే

ధర్మహృదయ పాత్రములు

ఎట్లు భరించెదవో ? లోకమా !

నెత్తురు పీల్చె విత్తవంతతను

బొమికలు నమిలే - భూస్వామికమును

ఒక్కని కడనే - పెక్కు బానిసలు

సాధుజనులకే సకల యాతనలు

ఎట్టు భరించెదవో ? లోకమా ! !

(అంత నిష్కల్ ప్రవేశిస్తాడు)

ని : అమ్మా ! పరంజ్యోతీ ! ఇంకా నీవు అవమానంతో అలమటించి పోతూనే వున్నావా ?

పరం : స్వామీ ! నా అవమానం గురించి నేను విచారించడం లేదు. కాని -

జగతి కాహారమిడునట్టి శ్రామికునకు

కడుపునిండ గంజియు లేదు, పుడమి నెల్ల

సతుల మానము గాచెడి శ్రమిక సతికి

గౌరవము లేదు - బ్రతుకెంత కాల మిట్లు ?

ఈ అన్యాయం ఎంతకాలం సహించడం ? (కన్నీరు తుడుచు కొంటుంది)

ని : విచారించకు తల్లీ ! అవమానం అగ్నిజ్వాల. అది పుట్టిన చోటును తగలబెట్టి తీరుతుంది.

పాంచాలి నవమానపరచి దుర్యోధను
డెట్టి త్రోవకు బోయె నెరుగ నమ్మ ?
సీత వల్లనె గదా సిద్ధబలుండు ద్రా
విణ చక్రవర్తి రావణుడు తెగియె ?
బాలనాగమ్మను బలవంతపరచిన
మాయమరాఠీడు మడియ లేదె ?
సామ్రాజ్యములె వినాశముజెందె నీ రీతి
ఒక్కొక్క యిల్లాలి నుసురుపెట్టి !
కడుపు నింౘెడు వేరు మార్గమ్ములేక
చచ్చి శ్రామిక వృత్తికి చనిన పడతి
దుర్భరావమాన కఠోర దూషణాగ్ని
గ్రాగి కనువిప్ప, జగమేల కాలకుండు ?

పర : మానవుడు తనతోడి మానవుణ్ణి హింస పెడితేనే గాని తాను సుఖపడలేడా? కానివ్వండి, సమ్మె జరిపి తీరవలసిందే !

ని : సమ్మెకాదు, సత్యాగ్రహం, జాతీయ ప్రభుత్వంలో సమ్మెకూడదు. భారతపిత గాంధీమహాత్ముడు మనకిచ్చిన ఆయుధం సత్యాగ్రహం. అది సర్వసమత్వానికి రాజబాట. దానినే ఇక్కడ మనం ప్రయోగిద్దాం.

పర : అదే మధు కూడా అన్నాడు. మార్క్సు ఇచ్చిన కార్యక్రమం పాతబడిపోయిందనీ – గాంధీజీ ప్రసాదించిన మార్గమే ప్రస్తుత కాలంలో మనకు అనుసరణీయమని చెప్పాడు ! కాని – బుద్ధుడూ, ఏసుక్రీస్తూ –

ని : బుద్ధుడూ, క్రీస్తూ కేవలం మత ప్రవక్తలు. వారి సిద్ధాంతాలు ఆచరణలోకి వచ్చే కార్యక్రమాన్ని వారు నిర్మాణయుక్తంగా ఇవ్వలేదు. మార్క్సు, గాంధీజీలు అలా కాదు. వారి సిద్ధాంతాల సాధనకు కార్యప్రణాళికలను ఇచ్చారు. వారి వెనక రాజకీయ బలం వుంది ! మార్క్సు ఇచ్చిన ప్రణాళిక నూరేండ్ల క్రితం వున్న నిరంకుశ పరిస్థితులకు సరిపడ్డది. వయోజన వోటింగు,

ప్రజాస్వామికమూ వున్న నేటి పరిస్థితులకు మార్క్సు కార్యక్రమం పనికిరాదు. గాంధీజీ ఇచ్చిన కార్యక్రమం నేడు అవశ్యం అనుసరణీయం, నేడేకాదు – సర్వదా, సర్వత్రా అది చెల్లదగిందే.

పర : ముఖ్యంగా మన వ్యవసాయ కూలీలు అనుసరించదగింది ఒక్క గాంధీ మహాత్ముని సత్యాగ్రహ మార్గమేనేమో !

ని : కుల మత వర్గ రహితమైన సాంఘిక వ్యవస్థను ప్రేమద్వారా సత్యాగ్రహం ద్వారా సాధించమన్నాడు మహాత్ముడు. వయోజన వోటింగు ప్రసాదించాడు. హరిజన బాలికను భారతరాజ్య అధ్యక్షురాల్ని చెయ్యమన్నాడు. భారత ప్రధాని కూడా హరిజనుడే కావాలన్నాడు. గాంధీజీని మించిన మహాత్ముడు ఇంతకు ముందు పుట్టి వుండలేదు. రైతులు, కూలీలు ఈ విషయం గుర్తిస్తున్నారు. ఇక లే వెళతాను–

పర : మమ్ము నిర్దిష్ట మార్గాన్ని నడిపించే బాధ్యత మీదే, ఉద్రిక్తులై వున్న కూలీలకు ఉత్తమ శిక్షణ అలవరచి, ఉన్నతాదర్శాల వెంట తీసుకుపొండి.

ని : నే నా యేర్పాట్ల మీదే వుంటాను తల్లీ, నీవు కొంచెం విశ్రాంతి తీసుకో. (నిష్క్రమిస్తాడు)

పర : విశ్రాంతి ? నాకు విశ్రాంతి లేదు.

భాగ్యశాలిను లుద్యానవనము లందు
కేళి నాట పాటలతో సుఖించు చుండ్రి !
కూలి పడతులీ మధ్యాహ్న కుటిల వేళ
మండుటెండల కూటికై మాడుచుండ్రి ! !

ఓ కార్మిక కాంతలారా !

శ్రమికులై యెంతకాలమీ చచ్చు బ్రతుకు ?
దీనలై యెంతకాలమీ దేవురింపు ?
గౌరవ ప్రతిపత్తికై కత్తిగట్టి
దెబ్బలాడగ కచ్చ బంధింపుడమ్మ !
(అంత భయంకర్రావు ప్రవేశిస్తాడు)

భ : ఇన్నాళ్ళ కీమె ఒంటరిగా దొరికింది. సరే, (తలవూపి) జ్యోతీ ! నే నన్నట్టే అయిందా ?

పర : (చూచి) ఏమిటి ?

భ : రాయబారం విఫలమౌతుందని –

పర : సఫల మవుతందని ఎవరనుకొన్నారు ? ఉద్యమం క్రమబద్ధంగా వుండాలని కాని –

భ : విశ్వనాథం మంచివాడు కాడన్నానా ? (కోపంతో) రాస్కెల్! నా యెదర! నిన్ను ! ఎంత మాటన్నాడు ! గ్రుద్దుకు గ్రుక్కెడు నెత్తురు క్రక్కిద్దును గాని–

పర : నీ ప్రవర్తన మన సిద్ధాంతానికీ, కార్యక్రమానికీ కూడ విరుద్ధం, భయంకర్! ఆ గొడవ ఇక ఎత్తకు, కూలీలు ఉద్రిక్తులై వున్నారు. నీవు పోయి తర్వాత కార్యక్రమం నడిపించు !

భ : కార్యమూ లేదు – క్రమమూ లేదు. (దగ్గరకు జరుగుతాడు)

పర : (దూరంగాపోయి) నీ కోసం చూస్తూ వుంటారు వెళ్ళు.

భ : వెళ్ళడానికేనా వస్త ?

పర : అయితే కూర్చో, నే వెళతాను. (వెళ్ళ బోతుంది)

భ : (ఆపి) పులి నుంచి నిన్ను రక్షించాను !

పర : నీ నుండి రక్షించుకోడానికి మరొక పుత్ర రావాలా ?

భ : నా నుండి బ్రహ్మదేవుడు కూడా రక్షించలేడు.

పర : నీ శక్తి నాకు తెలుసును. నీవు చాల మంచివాడవు, నేను నీ సోదరిని నన్ను క్షమించి –

భ : నిన్ను ప్రేమిస్తున్నాను.

పర : నిన్నూ నేను ప్రేమిస్తున్నాను.

భ : నీవు నాకు కావాలి.

పర : శీలం లేనివాడు సంఘానికి చీడపురుగు.

భ : ఈ పాటి నీతులు నేనూ బోధించగలను. నీ కోసమే నేను సంఘంలో చేరాను. నీవు లేకపోతే సంఘం ఎవడిక్కావాలి ? ఇదివరకు నేను దుర్మార్గుణ్ణే. కాని ఇప్పుడు నా దుర్మార్గాలన్నీ విడిచి పెట్టుకున్నాను. శివరాం గుమాస్తాగారి స్నేహం మానుకుని, కూలీ సంఘంలో చేరాను. నీవు నాకు కావాలి. లేకపోతే చచ్చిపోతాను. (బోకారి నమస్కరిస్తాడు)

పర : (అతణ్ణి లేవనెత్తి) భయంకర్ ! (కంపిత స్వరంతో) భయంకర్ ! నేను నీకు కావాలేమో ! కాని నీవు మాత్రం నా కక్కరలేదు. స్త్రీ పురుషుల మధ్య అప్పుడప్పుడు కలిగే ఈ విషమ సంఘర్షణలకు అర్థం వుంటుందో లేదో తెలియదు. ఐనా – నీ ప్రేమ ప్రేమగానే వుంచు. దానిని విషయ ప్రకోపంగా మారనియ్యకు. పద, వాళ్లు మనకోసం చూస్తూవుంటారు.

భ : నీకేమి అర్థంకాదు, నిన్ను కదలన్వివను. నీవు నాకు కావాలి.

పర : అసాధ్యం.

భ : మధుమూర్తిగారి వల్లో పడ్డావు !

పర : నోరుముయ్యి అతడు నా సోదరుడు.

భ : నె నెవర్నో తెలుసా ?

పం : తెలుసు, నె నెవర్నో కూడ నీకు తెలుసు.

భ : నా వైస్ ప్రసిడెంటు పదవికి రాజీనామా పెట్టేస్తున్నాను.

పర : సరే

భ : నన్ను తప్పించుకోలేవు.

పర : చూద్దాం.

భ : బ్లడీ (దురుసుగా పోతాడు, వెనుకనుంచి మధు ప్రవేశిస్తాడు)

మధు : జ్యోతీ ! ఇంకా ఇల్లు వదలవా ? అవమానం భరించి మెదలకుండా కూర్చోదలిచావా ?

పర : మన స్త్రీలు ప్రతి నిత్యమూ పొందే అవమానాల ముందు నాకు మీ అందరి మధ్యా జరిగిన అవమానం ఒక లెక్కలోదా మధూ !

మధు : ప్రతీకారానికి పూనుకోవద్దా ?

పర : అవమానం ప్రతీకారానికి అతీతం. పగ సాధించడ మనేది పశుగుణం. సత్త్వవంతులెప్పుడూ దానికి పాల్పడరు. శాంతమే దానికి ఉపశమనం. ఆరబ్ధ కార్యసాధనమే దానికి విరుగుడు. కూలీ లెలా వున్నారు.

మధు : మంచి వుత్సాహంగా వున్నారు. అంతా ఒక్క త్రాటిమీద నిలబడి వున్నారు. కడుపు కాలే కొలది శక్తి పెరుగుతుంది. దరిద్రం ముదిరి విప్లవం అవుతుంది. నేడు మానవ సాంఘిక ఆర్థిక వ్యవస్థ క్రుళ్ళి కంపెత్తి పోతూ వుంది. ఇప్పుడు మనం ప్రారంభించే ఉద్యమం జాతి నిర్మతం, నిష్కులం, నిర్వర్గం అయ్యేవరకూ ఆగిపోకూడదు.

పర : నీ కడుపునిండా రత్నాలు వున్నై మధూ ! ఔను. ప్రతీ మనిషీ విశ్వతోముఖంగా వికసించగల సర్వస్వామ్య సామాజిక వ్యవస్థ మనమే స్థాపించాలి.

(అంత మిత్ర ప్రవేశిస్తుంది)

మి : ప్రెసిడెంటు, సెక్రటరీ గార్లకు నమస్కారం.

మధు : ఇద్దరికీ ఒక్కటేనా ?

మి : ఇద్దరూ ఒక్కటే కాబట్టి.

పర : మిత్రా ! (కోపంతో)

మి : నా దగ్గర నమస్కారాలు తక్కువగా వున్నాయక్కా ! పొదుపుగా వాడుకుంటున్నాను.

పర : (నవ్వుతూ) ఓహో ! మధు సంసారాని కిక లోటు రాదు.

మధు : లక్షాధికార్ని అవుతానా ?

పర : అప్పుడు మా కూలీలకు గిద్దెడు గింజలుకూడ యెక్కువియ్యవు.

మధు : మా ఆవిడ కూడ పిచ్చి కుంచాలతో కొలుస్తుందా ?

మి : (కోపంతో) నేనెంత లోకువై పోయానర్రా మీకు !

పర : ఆఁ ? నిన్నెవ రేమన్నా రిప్పుడు ?

మధు : దెయ్యం పట్టుకోలేదు గదా ?

మి : నేనే ఒక దెయ్యాన్ని.

పర : ఇదిగో, భయంకర్ రాజీనామా యిచ్చి లేచిపోయాడు. మీరు మాట్లాడుకొంటూ పదండి. నేను ఇప్పుడే వస్తాను. (నిష్క్రమిస్తుంది)

మి : రాజీనామా ఇచ్చాడా ?

మధు : నేను అనుకుంటూనే వున్నాను. అతణ్ణి ఒక కంట కనిపెడుతా వుండాలి.

మి : రెండో కంట ?

మధు : నిన్ను.

ఒక్క కంటను రిపుమర్దనోగ్ర వహ్ని
ఒక్క కంటను ప్రేమ పీయూష లహరి,
దాల్చి అల యుద్ధ సమయ సత్యకును వోలె
నరగ వలయును నీ వంటి ప్రాజ్ఞురాలు.

మిత్ర : నాకంత శక్తి లేదు.

ప్రకట దేవాంత సంభూతులకునె గాక
పేదకూలీల కెట్లబ్బు పెద్దశక్తి ?
రెండు శక్తులు దాల్చి నర్తించు కొరకు
నేను దేవతగాను మానిసిని గాని

మధు : వెర్రిదానా ! నీవు దేవాంశ సంభూతుల కోసమూ, దేవతల కోసమూ వెదుకుతున్నావా ?

భూతలమ్మె దేవాంశ సంభూత మగును,
దైవసంభూతమెల్ల సౌందర్యశోభ,
దేవతలె సుమ్ము కనిపించు జీవులెల్ల,
పరమ మిదె ! చూడు, ఎక్కడో పైని లేదు.

మి : అయితే నేను దేవతనే.

మధు : (నిట్టూర్పు) అమ్మయ్య ! నిన్ను దేవతను చెయ్యడానికి ఎంత శ్రమపడ్డాను. మరి నాశ్రమకు బహూమానం ?

మి : నేను దేవతను కావడమే బహుమానం !

మధు : మిత్రా ! నేను ధన్యుణ్ని

కష్టమయమైన ప్రాపంచికమ్మునందు
సుఖమయ స్వప్నములు కల్గుచుండనేని
ఎవరు జీవింప నేర్తురు ? జ్యేష్ఠ సమయ

## రంగం:6

(సుందర భవనం. కచేరీ సావిడి. కుర్చీలు వగైరా అలంకారాలన్నీ వుంటాయి. విశ్వనాథరావు, శివరాం మాట్లాడుకొంటూ వుంటారు. విశ్వనాథ్ మధ్య మధ్య వొకో గ్లాసు త్రాగుతూ వుంటాడు.)

వి : మనకు పైగా యీ వెధవ గొడ మేమిటండీ ? ఈ పన్నులేమిటి ? ఈ చట్టాలేమిటి ? మధ్య ఈ సత్యాగ్రహమేమిటి ? మన విందు ప్రోగ్రాం సరిగ్గా సాగేట్టుగా వుందా ?

శి : వెధవలు ! వాళ్ళేమి చెయ్యగలరండీ? కోతలు కొయ్యకుండా సత్యాగ్రహం చేస్తారా ? పొట్టమీద కోపం వచ్చి తక్కిన అవయవాలన్నీ సమ్మె గట్టినట్టుంది.

వి : ఔనౌను. అయినా – తీరా కంచంలో అన్నం మన్నుపాలు చెయ్యరు గదా? అసలే దాళవ !

శి : తమకా భయం అక్కరలేదు. ఎన్నిరోజులు చేస్తారు సత్యాగ్రహం? ఒక్కరోజు పనిచేసుకోకపోతే పదిరోజులు పస్తుండే దరిద్రులు సత్యాగ్రహం చెయ్య గలరా ? వాళ్ళ తరమా ?

వి : ఔను. కాని జాగ్రత్తగా కనిపెట్టుతూ వుండండి. పోనీ – మన విందుకు వాయిదా వేద్దామా ?

శి : అబ్బే, అసలు ఇప్పుడే విందు అవసరం. కూలీలు అకటితోవున్న యెలుగుగొడ్డులు ఎటుపోయి యెటువచ్చినా – పోలీసులూ, ఉద్యోగస్తులూ మన చేతిలో వుండడం మంచిది.

వి : మందిది ! మంచిది ! ఖర్చుకు చూడవద్దు.

శి : ఒక్కమాట చిత్తగించండి – విందు ఆరగించిన ప్రతివాడు తమ వెంట కుక్కలాగ తిరగాలనండి ?

వి : భేష్ ! భేష్ ! మరులు మందేమైనా తెలుసునా యేమిటి మీకు.

శి : హి ! హి! తమ దయవుండాలి గాని, అదంతా వుంది లెండి.

వి : సరే – ఏదో చెయ్యండి. ముందు ఈ కూలీ పీనుగుల్ని యేమి చెయ్యాలో ఆలోచించండి.

శి : ఆ ప్లాను అంతా వేస్తున్నాను లెండి. దొంగ కేసులూ, సెక్యూరిటీ కేసులూ అవీ కల్పించి వాళ్ళమీద బాగా గుప్పాలి. వాటితో తీసుకుంటూ, లాక్కుంటూ వుంటారు గాడిదలు. వాళ్ళని మీరేమీ క్షమించకూడదు. కొంచెం...... అబ్బాయి గారికి కూడా చెప్పాలి.

వి : ఆఁ ఏమిటి ?

శి : అబ్బే వూరికే, ఆ కూలివాళ్ళు మంచివాళ్ళు కాదు; వాళ్ళతోటి స్నేహం మన హోదాకు తగదని.

వి : తగదు, తగదు, ఏదీ......

(ప్రవేశం ప్రేమ్‌కుమార్)

శి : (ఉలిక్కిపడి కుర్చీ చదురుతాడు)

వి : రా, అబ్బాయి ! కూర్చో !

ప్రే : (కూర్చుని) నాన్నగారు ! ఆ కూలీలు, పాపం.......

వి : ఆ వ్యవహారాలు నీ కెందు కబ్బాయ్ ?

శి : (తల వూపుతాడు)

ప్రే : వాళ్ళు సత్యాగ్రహం చేస్తారుటగా ?

వి : చెయ్యనీ.

ప్రే : వాళ్ళ కోరికలు యేమంత పెద్దవి కావే.

శి : పెద్దవైనా, చిన్నవైనా......

ప్రే : మీ రాగండి గుమాస్తాగారు ! వాళ్ళు మనమీద ఆధారపడివున్న వాళ్ళుగదా, ఈ యెద్దడిరోజుల్లో వాళ్లని కాపాడడం మన విధి కాదా? కూలీలంటే ఈ విరోధభావం ఎందుకు మీ కసలు ?

వి : నీ కివన్నీ తెలీవు. వాళ్ళకీ మనకీ ఎప్పుడూ పడదు. ఏలితే వాళ్ళన్నా ఏలాలి రాజ్యం. లేకపోతే మనమన్నా ఏలాలి. వాళ్ళడుగుతారు; మనం లేదంటాం, వాళ్ళు పండిస్తారు ; మనం అనుభవిస్తాం, ఇది నేటి ధర్మం, ఇది తారుమారు కాగూడదు. అర్థం చేసుకో !

శి : వాళ్ళది ఏక్షన్, మనది రియాక్షన్.

ప్రే : మీ పద్దతే పూర్తిగా తప్పండి. నాన్నగారు : రాజ్యం ఏవొక్క వర్గానిదో కాదు. అందరిదీని. నేడు మన ఒక్క వర్గమే రాజ్యమేలు తోంది కాబట్టి రెండో వర్గానికి మనం భయపడుతున్నాం. దేశంలోవున్న యావదాస్తీ సంఘపరం చేసి మనం అంతా ఒకే వర్గంగా అయిపోతే, యిక పేచీయే లేదుగా ?

వి : (విసుగ్గా) అయితే, మన భూములన్నీ కూలీలకి పంచి పెట్టెయ్య మనా?

ప్రే : మనం పంచి పెట్టకపోతే వాళ్ళు పంచుకుపోతారు.

వి : ఛీ, నోరుముయ్ !

ప్రే : సర్వసమత్వాన్ని మనం ఆపలేం, దానికీ గాంధీజీ చక్కని కార్యక్రమాన్ని ఇచ్చాడు. దాన్ని మనం తృణీకరిస్తే, విప్లవాన్ని మనమే ప్రోత్సహించి నట్టు అవుతుంది.

శి : ఆ నిష్కల్ గాడి బోధలే యివన్నీ !

ప్రే : ఏదైనా, మీరు కాలప్రవాహానికి యెదురీద లేరు. రేపటి వయోజన వోటింగే సర్వమూ చక్కబెడుతంది.

శి : ఓస్, దాని కన్ని ఏర్పాట్లూ ముందే చేశాం.

ప్రే : వయోజన ఓటింగే విఫలమైతే, గాంధీయిజమే విఫలమైనట్టు, గాంధీయిజమే విఫలమైతే, మిగిలేది మహా భయంకరమైన ప్రళయాగ్నిగుండం.

వి : (కోపాగ్ని అణుచుకుంటూ) ఇక పో నువ్వు.

ప్రే : పోతాను – కాని బాగా ఆలోచించండి ధర్మానికి విరుద్ధంగా వెళ్ళవద్దు. (నిష్క్రమిస్తాడు)

శి : చిత్తగించారా ! సహవాస దోషం !

వి : ఆ కూలీ వెధవలకి తగిన శాస్తీ చెయ్యాలండీ. అబ్బాయిని ఇల్లు కదలనివ్వకండి (వెళతాడు)

శి : (పొడుంపీల్చి) అబ్బాయో, బొబ్బాయో ? ఇక ముందు విందు సంగతి – పెద్ద అధికార్ల నందర్నీ పిలిచాను. చాలామంది రారు... ఎంత మహా వచ్చినా వొక సంచి రూపాయలతో విందు బ్రహ్మాండంగా జరిపించవచ్చు. ఎక్కువ హంగామా మాత్రం చెయ్యాలి. అర్జంటు పనులు కల్పించుకొని అడిగేవాడిమాట కందకుండా తిరుగుతూ వుంటే, కావలిసినంత తేలిగ్గా అవుద్ది. దేవుడు మేలుచేస్తే అంతా మిగులే యిందులో ! .... భయంకర్రావు గాడికి కబురుచేశాను. వాడు మళ్ళీ నా ప్రక్కకొచ్చేస్తే !...

(ప్లాను వేసేటట్టగా చేతులు త్రిప్పుతుంటాడు. అంత దయానంద రావూ, మరికొందరు రైతులు ప్రవేశిస్తారు.)

అందరూ: గుమాస్తా గారికి దాసోహాలు !

శి : సిద్ధిర్భవతు... కులాసాగా వున్నారా ? ఏమిటి విశేషాలు ?

ద : తమకు తెలుసుగా ... కూలీలు సత్యాగ్రహం చేస్తామని నోటీసు ఇచ్చారు.

శి : ఇవ్వనివ్వండి.

ద : పోనీ – ధరలు చూస్తే ఆకాశం మీద నడుస్తున్నాయి. వాళ్ళు మాత్రం ఎక్కడ తెచ్చుకు తింటారు. వాళ్లడిగిన రేటు యిచ్చేద్దామా అని వుంది.

శి : యిచ్చేద్దామా ?

1 రై : ఇచ్చేద్దామండి బాబు, గుమాస్తాగారు ! వాళ్ళూ మనలాంటి జీవరాసులే గదండి !

2 రై : వాళ్ళూ గంపెడేసి పిల్లలతో వున్నవాళ్ళే పాపం !

శి : అదేనయ్యా ! మనలోవున్నలోటు, గంపెడేసి పిల్లల్ని యెవరు కనుక్కోమన్నారు ? కనడం వాళ్ళూ, పెంచడం మనమూనా ?

1 రై : మనల్ని పెంచమనడం లేదే ! న్యాయమైన కూలీ యిప్పించ మంటున్నారు.

శి : న్యాయమైన కూలీ అంటే యెంత ? ఈ వేళ కుంచెడు రేపు రెండు కుంచాలు, ఎల్లుండి నగం వాటా, ఆవలెల్లుండి అందరికీ సమానంగా పంచిపెట్టమంటారు. పంచి పెట్టేస్తారా ?

2 రై : అవేం మాటలండి గుమాస్తాగారు ? వాళ్ళు మాత్రం మనుషులు కాదా ? అన్నం తినడం లేదా ?

శి : అన్నం తినేవాళ్ళయితే, అలా యెందుకు యేడుస్తారు ?

ద : లేదుగాబట్టి యేడుస్తున్నారు.

శి : అయితే పోయి మీ యిష్టం వచ్చినట్టు చెయ్యండి. దొరగారి వుద్దేశం వేరు విధంగా వుంది.

1 రై : సెలవిప్పించండి. ఆయన నోటిమీదే నడుస్తాం.

శి : అలా దారికిరండి, కూలీలు మంచివాళ్ళే కాని వాళ్ళని కొందరు దుర్మార్గులు పాడుచేస్తున్నారు. వాళ్ళకు మనం ఒకసారి లొంగితే అదే లొంగడం, వాళ్ళను యిప్పుడే అణచకపోతే మన కొంపలు నిలిచేటట్టు లేవు. దాని కొకటే మార్గం, మీరు కూలీల కిస్తామంటున్న అదనపు సొమ్ము వుందే – చందాల రూపంగా వసూలు చేయించండి. దానితో రైతు సంఘం ఒకటి ఏర్పాటు చేద్దాం. ఆ వసూలు చేసిన ధనంతో కొన్ని పెద్ద నోళ్ళు కట్టేశామంటే – ఈ కూలీల్ని సుళువుగా లొంగదీసెయ్యొచ్చు. అధికార్లంతా మనచేతిలో వుంటారు. రేపు యిక్కడికి విందుకు రండి.

1 రై : ఆలోచన బాగుంది.

2 రై : అచ్చర లచ్చలు

ద : గుమాస్తాగారూ ! మీ ఆలోచన కాకుల్ని కొట్టి గ్రద్దలకు వేసేదిగా వుంది.! కూలీల పొట్టమీదకొట్టి – ఆ డబ్బుతో పెద్దల నోళ్ళు కట్టడమా ? మానెడు గింజలతో తృప్తిపడి మనకు సేవసేసే కూలీల్ని వేలకు వేలు లంచమిచ్చి తన్నించడమా ? ఎంత నీచమైన ఆలోచన!

శి : అయ్యో ! రైతు సంఘమెంత మంచిదయ్యా !

ద : రైతు సంఘం మంచిదే. కాని మీరంటున్నది భూస్వాముల సంఘం, రైతు సంఘమైతే కేవలం కూలీల్ని త్రొక్కెయ్యడానికే స్థాపించబడదు. రైతు, కూలీ సంఘాలు రెండూ కలిసి మరొక ఉత్తమాశయంకోసం పోరాడాలి. అంతేగాని కూలీల్ని అణిచే రైతు సంఘం, రైతుల్ని దోచే కూలి సంఘం – వినాశనకరాలు.

శి : పెద్ద వుపన్యాసాలు నేర్చావే ! ఆ నిష్కల్ గాడి బోధలు తలకెక్కాయా ?

ద : ఒకడిబోధ నాకెందుక్కావాలి ? ఈ మాత్రం మనిషై పుట్టి మనిషిగా పుట్టే ప్రతివాడికి తెలుస్తుంది. !

శి : యేమయ్యా తక్కిన రైతులు ?

రై : దొరగారి మాట తీసెయ్యడమా ?

శి : అవును మీరంతా వొక త్రాటిమీద వుండండి. ప్రతి మంచిపనికి యేవో అడ్డంకులు వుండనే వుంటాయి.

ద : గుమాస్తాగారూ ! మీరు అనవసరంగా కూలీలకు, రైతులకు మధ్య విద్వేషాగ్నిని రగుల్పొల్పుతున్నారు. యిది చెప్పిరాదు.

శి : నేను వున్నదున్నట్టుగా చెప్పానయ్యా ! మధ్య నా కెందుకూ ఆవు, దూడ మధ్య గుంజలాగ ? దొరగారి వుద్దేశము ఖరారుగా యిదీ అని చెప్పాను.

రై : ఖరారుగా చెప్పారా ?

శి : అయ్యో ! నేను కూలీల తరపున యెంతో వాదించాను. రండి యిలా చెబుతాను. (శివరామం, రైతులూ నిష్క్రమిస్తారు)

ద : ఆహా ! కాలం ! సరే ! విషవృక్షం నాటిన వాడు దాని ఫలం అనుభవించక తీరదు... ఇక నేను ఆలోచించడ మెందుకు? కూలీలు అడిగిన రేటు యిచ్చేసి నా పని చెయ్యించేసుకుంటాను. నేను ధర్మమని నమ్మినదాన్ని ఆచరించడానికి సంకోచ మెందుకు ? (నిష్క్రమిస్తాడు, అంత భయంకర్రావు ప్రవేశిస్తాడు. రూపం కొంత వికృతంగా వుంటుంది.)

భ : మళ్ళీ నా యెప్పటి డూటీలో ప్రవేశిస్తాను. దోపిడీలు సాగిస్తాను. కూలీ యూనియన్ను నాశనం చేస్తాను. దౌర్జన్యాన్ని రెచ్చగొడతాను. కొంపలంటిస్తాను. కోతి కొమ్మచ్చి ఆడతాను. నా కడ్డమొచ్చిన వాణ్ణెల్లా అబద్ధాలతో, అపవాదులతో, లాఠీతో, లూటీతో, కత్తితో, కఠారుతో పడగొట్టేస్తాను. జ్యోతి నాకు ఎలా దక్కదో (మీసం వడేస్తూ) చూస్తాను. (పిలుస్తాడు) గుమాస్తాగారూ !

శి : (ప్రవేశించి) వచ్చావురా ! వచ్చావూ ? నేననుకొన్నట్టే అయిందిలే.

భ : చిత్తం, వాళ్ళంతా రాస్కెల్స్ !

శి : నేను చెప్పలేదట్రా ? ఎందుకురా నీకా దిక్కుమాలిన సంఘమని చెప్పానా ? విన్నావూ ? నన్ను విడచిపెట్టేసి యెన్ని అవకాశాలు పోగొట్టుకున్నావు ?

భ : బుద్ధొచ్చింది గదండి ! యేమిటి సెలవు ?

శి : యేమీలేదు గానీ – నీవల్ల పెద్ద కార్యం కావాలిరా !

భ : ఓ! మీరు అగ్గిలో వురకమంటే వురుకుతా. వీడెవడో తెలుసునా? (మీసం దువి) మీ సేవకుడు.

శి : నాకు తెలీదట్రా ! డబ్బు పంపించాను అందిందా ? యిదిగో యిదిగూడా తీసుకో (డబ్బిస్తాడు)

భ : మీ చేతి కడ్డుందా ! (తీసుకుంటాడు)

శి : సరే, రా ! మాట్లాడుకుందాం.

(నిష్క్రమిస్తారు)

(తెర)

## రంగం:7

(ఒక తోట గట్టు, ఆకలితో నీరసంగా జోగులు ప్రవేశిస్తాడు)

జో : అబ్బబ్బా ! ఆకలి ! (కడుపు చేత్తోపట్టుకుని) కుప్ప తిప్పలుగా కూడూ వుంది; కర కర మంటూ ఆకలీ వుంది. రెంటికి కలవడం మాత్రంలేదు!... దొరగారింట్లో ఎంతెంత గొప్ప భోజనాలు ! ఎంతెంత గొప్ప పెభువులు! వారికి ఎంతెంత గొప్ప కడుపులు... గొప్పోరికి గొప్ప కడుపులుంటాయి!... ఆహా ! పిండొంటలు ! హల్వా పుల్వా (గాలి గట్టిగా పీల్చుకుని ముక్కు మూసుకుంటాడు. అంత పరంజ్యోతి జాతీయజెండాతో ప్రవేశిస్తుంది.)

పర : ఏమిటి జోగులూ ! తపస్సు చేస్తున్నావే !

జో : కాదమ్మగారూ ! పిండొంటల వాసన కడుపులోకి బాగా పీల్చుకుని అది మళ్ళీ బయటికి పోకుండా ముక్కుమూసుకున్నాను.

పర : (నవ్వుతూ) ఓహో ! అయితే నీ బొజ్జ నిండిందా ?

జో : లేదమ్మగారు, నాకో బొజ్జవుంటే నేనూ గొప్పోణ్ణవుదును. తెలియకడుగుతా నమ్మగారు. మనిషికి కడుపాధారమా ?. కడుపుకి మనిషాధారమా ?

పర : నీకు వేదాంతంకూడావచ్చునే? మరి యేమి తేలింది ?

జో : అంతంత చిన్న మనుషులు అంతంత పెద్ద కడుపుల కాధారమంటే నాకు నమ్మకం లేదు. కడుపే మనిషి కాధారం !

పర : చక్కగా చెప్పావు. కడుపపాడించినట్టే మనిషి ఆడుతాడు. నీకూ, నీ కామందుకు తేడా ఏముంది, ఒక్క కడుపేగా ?

జో : (కడుపు నొక్కుకుని బాధపడతాడు)

పర : ఏమీ ? అలా నొక్కుకు పోయిందేం నీ కడుపు ?

జో : నిన్నటి నుంచి దీనిలో ఏమీ పడలేదు.

పర : ఆc ! పస్తే ? అంత గొప్పవిందు నీ కామందుల యింట జరుగుతూ వుంటే నీవు పస్తా ?

జో : రామ రామ ! యీ మూడు రోజుల బట్టీ రాత్రీపగలూ ఒక్కటే పని. అంతగొప్ప సంబిరంలో నన్ను ఎవరు సూత్తారు ?

పర : ఆహా ! లోకం !

కడుపు నిండిన వానికే కడుపునిండ
భోజనము పెట్టుచుందు రీ భూమిపతులు ;
ఆకలో ఆకలో అని అడలువాని .
కన్నమిడు పుణ్య జీవు లీ యవని నరుదు

ఇది తీసుకెళ్ళి, బియ్యం తెచ్చుకుని, వండించుకో, పో (ఉంగరం తీసి యిస్తుంది)

జో : (అందుకుని) వెయ్యి దండాలమ్మా !

పర : త్వరగా వెళ్ళు (నిష్క్రమిస్తుంది)

జో : చల్లని తల్లి ! ఈ యమ్మగారి పనే యిది. కట్టపడే వోల్లని చూత్తే యెంత కరుణ తల్లికి ! ఇంత ఉంగరం నాకు ఇచ్చెయ్యడమే ! ! (ఉంగరం చూచుకుంటూ వుంటాడు. అంత ప్రేమకుమార్ ప్రవేశిస్తాడు)

ప్రే : ఈ పరిస్థితులు నాకేమి అర్థం గావడం లేదు.

శ్రామికులొకవంక చచ్చుచు నుండిరి,
వండి వాలిన వెల్ల పంటచేలు;
ఆకట కార్మికు లటమటించుచు నుండ,
అధికారులకు విందు లారగింపు !
మెతుకైన నిరుపేద బ్రతుకున కొసగరు,
నిండిన కడుపులే నింపు చుంద్రు;
భూదేవి దయ తాము పుష్కలమ్ముగ పొంది
దయ జూడరేమొ పేదలగువారి,

తలప – భూస్వామికంపు విధానమందె

కలదొ యేమొ ఈ విషము ! దుష్కాలమయ్యె !
కష్టపడి పనిచేసెడి కష్టజీవి !

నీది కష్టము, ఫలితము మాది సుమ్ము ! !

ఇదెక్కడి న్యాయమో ! ఒకడు కష్టపడి మరొకణ్ణి పోషించడం !

నేను తినుచున్న ప్రతిముద్ద నీ శ్రమా ప్ర
యత్న లబ్ధమే యనెడు సత్యమ్ము – నీ కృ
శింపు క్రుళ్ళు జీవితము దృష్టికి ఘటించి
కంఠమున నడ్డుపడుచుండు కష్టజీవి !

ఎంత ప్రయత్నించీ – మా నాయనగారి పంథా మార్చలేకుండా వున్నాను.

(పరిక్రమించి – చూచి) ఎవరబ్బీ అక్కడ ?

జో : (ఉలిక్కిపడి) బాబయ్యగారూ, జోగణ్ణండి ?

ప్రే : జోగులా ! ఏమిట్రా, అది ? (సమీపిస్తాడు)

జో : (భయపడుతూ) ఆ యమ్మగారు దానం చేశారు, దొరగారూ ? లేకపోతే నా కెక్కడిదండీ ? (వుంగరం యిస్తాడు)

ప్రే : (తీసుకుని) ఏ యమ్మగారు ?

జో : జ్యోతి అమ్మగారండి. అదుగొండి ? అదుగో (దారి చూపుతాడు)

ప్రే : ఇంత చక్కని వుంగరం నీ కెందుకిచ్చిందిరా ?

జో : ఆకలేసి యిక్కడ కూకున్నానండి. అన్నం వండుకోమని యిచ్చారు.

ప్రే : ఆహా ? జ్యోతీ నీ బాహ్య సౌందర్యానికే యెంతో మురుస్తున్నాను. నీ హృదయ

సౌందర్యం యెంత మనోజ్ఞకరం ! నీ హృదయం అమృతభాండం కాదు గద ! ఈ వుంగరం -

ప్రణయ హృదయాజ్ఞ మృదుహస్త పల్లవమున
వాసముండిన దీ భాగ్యవంతురాలు !
అద్వితీయ ఫలప్రదమైన కరుణ
పూజలో నుంపబడ్డ దీ పూజ్యురాలు !

ఈ ముద్రిక నాదగ్గర వుండదగ్గది... జ్యోతీ !

ప్రేమ నీ విడినట్టి యీ భిక్షమునకు
పాత్రుడగు భిక్షకుడ నేను, పరులు కారు;
అంధకారములో దీప మవసరమ్ము
అంధునకు దీపమేల, చేయండకాక !

(ఉంగరం తన వ్రేలికి పెట్టుకొని, తన వ్రేలి వుంగరం తీసి జోగులికిస్తూ)

జోగులూ ! ఇదిగో, ఈ వుంగరం మరీ ఖరీదైనది, ఇది తీసుకుపో... ఇప్పుడు నేను ... ?

(నిష్క్రమిస్తాడు : అంత మిత్ర ప్రవేశిస్తుంది - జెండాతో)

మి : (నవ్వుతూ) లక్షాధికారి భిక్షుకుడైనాడు ! ఎందుక్కాడు ?

మండువా నిండ ధనమున్న ముండుగాక,
కొనగ వచ్చునె దానితో ప్రణయ సుఖము ?
ప్రేమనుంగోరి వేడెదు ప్రియుడు, తాను
లక్షలకు నాథుడైనను భిక్షకుండె ! !

జోగులూ ? ఇప్పుడు ప్రేమ్‌కుమార్ ఇచ్చిందేమిటి ?

జో : ఏమైతే ఎందుకు ?

మి : ఒక్క బంగారు వస్తువు నీ చేతిలోకి వచ్చిందో లేదో – అప్పుడే నీకు గర్వం తలకెక్కింది ? ఆహా ! ధనమహిమ !

జో : నువ్వెక్కడ దాపురించావు తల్లీ ! నా పాలికి ?

మి : దాని ఖరీదు నేను యిచ్చేస్తాను (డబ్బిచ్చి వుంగరం తీసుకుంటుంది.

జో : రచ్చించావు తల్లీ ! (నిష్క్రమిస్తాడు)

మి : దీనితో నేను... ? (నిష్క్రమిస్తుంది, వెనుకనుంచి పరంజ్యోతి ప్రవేశిస్తుంది.)

పర : ఆహా ! ఈ యాంధ్రభూమి యెంత సంపత్పరిశోభిత !

పచ్చని పొలముల పచ్చి బాలెంత మా
బంగారు తెలుగు తల్లి !
తీయని ఫలముల తీపి లే మావి మా
తీదియ తెనుగు తల్లి !
జీవ తటాకమ్ము, శీతలచ్ఛాయ మా
శ్రీ లక్ష్మి తెనుగుతల్లి
పుష్కలాకృతి, అన్నపూర్ణమ్మ మముగన్న
పూబోణి, తెలుగుతల్లి !

ఇట్టి భాగ్యశాలి ఒడిలో బిడ్డలైన మా కూలీలు ఇంత దరిద్రులై మలమల మాడి చస్తూ వుండడం క్షంతవ్యం కాదు.

(వెనుకనుంచి ప్రేమకుమార్ ప్రవేశిస్తాడు మెల్లిగా.)

ప్రే : ఆమె క్షంతవ్య కాకపోవచ్చును. నేను కానా ?

పర : (తిరిగిచూచి) భక్తురాలు నమస్కరిస్తున్నది.

ప్రే : నేను నమస్కృతి కర్హుణ్ణి కాను. క్షంతవ్యుణ్ణి.

పర : మీరు భాగ్యవంతులు, గుణవంతులు, విద్యావంతులు –

ప్రే : నీతో మాట్లాడడానికి ముందు నేను క్షమించాలి.

పర : మమ్మల్ని అందర్నీ క్షమించవలసిన మిమ్ము క్షమించే వారెవరు? మీతో చనువుగా మాట్లాడుతున్నందుకు నన్ను ముందు మీరే క్షమించాలి.

ప్రే : అలా కాదు. మా నాయనగారు, నిన్ను అవమాన పరిచారు. నేను చూస్తూ వూరుకున్నాను. మా నాయనగారి తరఫున, నా తరఫున నిన్ను క్షమాపణ వేడుతున్నాను.

పర : అవమానం ! (కన్నీరు నించుతుంది.)

ప్రే : నీవు ఏడ్చి నన్ను ఏడ్పించవద్దు.

పర : మేము కూలీలం, నిత్యదరిద్రులం, నిర్బంధ సేవకులం, ఆకల్నీ, అవమానాల్నీ నిరంతరం భరించడమే మా వృత్తి, నాకు జరిగింది. అవమానంకాదు – ధర్మం తరతరాలనుంచి వస్తూవున్న భూస్వామిక ధర్మం. అట్టిదానికి – నన్ను క్షమింపుమని మీరు కోరడం అపూర్వం.

ప్రే : ఇదివరకే దెబ్బతినివున్న నా హృదయం చిల్లులు పడి రక్తం కారుతూ వుంది.

పర : నన్ను క్షమించండి, స్వామీ ! నేను కఠినురాల్ని.

ప్రే : మల్లి మృదుదళానికి కాఠిన్యమా ! లేదు లేదు. ఈ క్షమాపణ ఆనాడే చెప్పుకోవలసింది. కాని ఈ దర్శనం లభించలేదు.

సదయ హృదయాబ్జ ! నీ వంటి మృదుల హృదయ
నొచ్చి శపియింప జగములు విచ్చిపోవు ;
విలయమైనను వెరవను, వెరతునొక్క
శీలవతి కంట నిప్పులు చెరగునేని.

నా హృదయం నీకు విప్పాను. నీవు నన్ను క్షమించితీరాలి.

పర : నాడు అవమానం పొందింది నేను కాదు; నా జాతి.

ప్రే : నీజాతి తరఫున నీవు క్షమించు.

పర : నా జాతి తరపున నేను క్షమించలేను.

పొట్టగడవక కూలికిపోయి, ఆత్మ
గౌరవము సున్నగాగ, బెంగల కృశించి,
ఎందరు కులాంగనల్ నశియించినారొ !
మిమ్ము క్షమియింప, నన్ను క్షమింత్రె వారు ?

ఆ పేటల్లోని కూలీల దారిద్ర్యం వంక ఒకసారి చూచి, మీరు అధికార్లకిస్తున్న విందు వంక ఒకసారి చూడండి.

గుప్పెడన్నము భిక్షించు కూలివాని
పొట్టపైగొట్టి, ధనధాన్యపూరితులకు
షడ్రసోపేత మధుర భోజనము పెట్టు
మిమ్ము నేమందు ? ఎట్లు క్షమింపగలను ?

ప్రే : క్షమించలేవా ?

పర : మాటమాత్ర మనగలను కాని దానివలన ప్రయోజనమేమిటి ?

ప్రే : హృదయపూర్వకంగా క్షమించలేవా ?

పర : నాకు హృదయం లేదు.

ఆకలని కూలి పసిబిడ్డ లడలు నపుడు,
మండుటెండల చెల్లెంద్రు మాడునపుడు
మించి – అవమానమెంతొ దహించునపుడు,
హృదయమేయున్న పగిలిపోదె ? మహాత్మ !

ప్రే : (తలవాల్చుకొని ) జ్యోతీ ! వద్దు, క్షమించవద్దు, క్షమాపణకు నేను అర్హుణ్నికాను. అట్టి అర్హతపొంది నీ పునర్దర్శనం గావించు కొంటాను. నీ కింత శ్రమ ఇచ్చి నందుకైనా క్షమించు.

పర : మళ్లీ మీ దర్శన భాగ్యానికై ఎదురుచూస్తూ వుంటాను.

ప్రే : (అలాగే మెల్లిగా వెళ్ళిపోతాడు)

పర : విషవృక్షాన మధుర ఫలమా ! హాలాహలం నుంచి అమృత ప్రవాహమా ! ! (అతని కాలిక్రింద అణగిపోయిన గడ్డిపువ్వుల్ని ఎత్తి) ఓ పూలారా!

ధనికతత్వపు అగ్గి పాదముల క్రింద
మాడిపోయెడి కూలీల మమ్మ మేము,
నలిగిపోతిరి మీరును ! లలిత హృదయు
పాదపద్మము లైనను భారమె గద.

మీరు నలిగిపోయినా ధన్యులే !

క్రూరచిత్తుల పేరాస కుమ్ములోని
ఇంధనమ్ములు మా జీవితేచ్ఛలెల్ల;
ప్రణయ హృదయుని చల్లని పాదములకు
పూజసల్పి తరించిన పూలు మీరు !

(ఆ పూలను హృదయానికి అదుముకొంటుంది. అంత తెరలో కలకలం బైలుదేరి - హాహా కారాలు చెలరేగుతాయి. భయ భ్రాంతులై, దెబ్బలు, రక్తాలు కారుతూ, అనేకమంది కూలీలు ఇటూ, అటూ చెల్లాచెదురుగా పారిపోతూ వుంటారు. మిత్ర భీతితో ప్రవేశిస్తూ)

మి : అక్కా ! అక్కా ! రౌడీలు ! భూస్వాములు ! కూలీల్ని చావగొట్టేస్తున్నారు ! చావగొట్టేస్తున్నారు (పరంజ్యోతిని కౌగలించుకొని పడిపోతుంది. తెర హఠాత్తుగ పడుతుంది.)

## రంగం : 8

(ఒక దారి, సాయంత్రం మసక చీకటివేళ, దోపిడీకి తగిన వేషంతో భయంకర్రావు ప్రవేశిస్తాడు.)

భ : విశ్వనాథరావుతో మళ్ళీ నాకు బేరం కుదిరింది. దయానందరావు ఇల్లు దోచెయ్యడం, వాణ్ణి పొడిచెయ్యడం ఇలాంటి పక్కాపన్లు చెయ్యించే ఖామందులే ఖామందులు – గుడ్ ! పెట్టుబడికి విశ్వనాథరావు, ఆలోచనకి శివరాం, పనికి నేను (మీసం వడేస్తూ) భేష్ ! త్రిమూర్తులం ! హహ్హహ్హ త్రిమూర్తులం ! ! ఈ సర్వప్రపంచానికి –

(అంత ఎదురుగా మిత్ర ప్రవేశిస్తుంది. చూచి బిత్తరపోతాడు. ఆమె కఠినంగా చూస్తుంది.)

మి : ఎక్కడికన్నా ?

భ : ఊఁ ?

మి : నీవేం మనిషి జన్మమెత్తలే ?

శ : షటప్ ! నీ కూలీ యూనియన్‌తో నా కేమీ సంబంధం లేదిప్పుడు.

మి : ఎందుకు లేదు ! విరోధ సంబంధం వుందిగా ?

భ : మీరంతా చవట పంథాలో పోతున్నారు. నా దంతా దెబ్బకు దెబ్బా – విప్లవమార్గం.

మి : నీది ముత్తాతలనాటి పద్ధతి, భయంకర్ (అధికారం ప్రజలకు లేని రోజుల్లో, ఎవడో ఒక రాజో, పది రాజకుటుంబాలో నిరంకుశంగా అధికారం చెలాయించిన రోజులలో, తిరుగుబాటుకి – పోరాటానికి స్థానం వుండేది. ఇప్పుడు అధికారమంతా ప్రజలది. ఎవరిమీద నీ తిరుగుబాటు ?

భ : అదంతా నా కక్కర్లేదు. నువు పో.

మి : అక్కర్లేకపోతే సరే, "తిరుగుబాటు - విప్లవం" అనే పెద్ద కబుర్లతో దొంగవేషాలేస్తూ కూలీల్ని మోసగించకు.

భ : డామిట్ ! (మిత్రని ఒక్క చెంపకాయ కొడతాడు. ఆమె తెరలోకి పడిపోతుంది. చుట్టూ భీతితో పరకాయిస్తాడు) ఎక్కడా యిలాంటి బుద్ధిలేనోళ్ళే ? ఛీ, యెధవ ప్రపంచం ?

(నిష్క్రమిస్తాడు. క్షణం సేపటికి శివరాం పొడుంపీలుస్తూ ప్రవేశిస్తాడు)

శి : అందులో నేను ! నేను సహిస్తానా ఈ కూళ్ళ యెధవ వేషాలు ? వీళ్ళది దరిద్రుల పార్టీ అట ! మొత్తం జనాభాలో నూటికి తొంభయి మంది దరిద్రులేనట. వాళ్ళంతా వీళ్ళ పార్టీయేనట ! గాంధీ ఆదర్శాల్ని వీళ్ళు అమల్లో పెడతారట ! ఏడిశారు. నేను మాత్రం కాంగ్రెసులో చేరలే మొన్న ? ఏదో పైకి "గాంధీ మహాత్ముడికీ జై" అంటాంగాని సత్యం ఎవడు పలకగలడు ? హింస యెవడు మానగలడు ? హరిజన స్త్రీని దేశానికి అధ్యక్షురాల్ని చెయ్యమన్నాడు - రామ రామ - ఆ గాంధీకి బుర్రవుందీ ? లేదు - ఉహు ఈ కూలివాళ్లని పైకి రానియ్యకూడదు. వీళ్ళ నాయకులందరిమీదా దొంగకేసులు అవీ పెట్టించి, అరెస్టు చెయ్యిస్తా. భయంకర్‌గాడిచేత దోపిడీలు, ఖూనీలు చెయ్యిస్తా, ఆ కేసులన్నీ కూలీ నాయకులమీద రుద్ధిస్తా, రైతుల పేరుతో పార్టీ లేవదీసి ఎలక్షనులో భూస్వాముల్ని గెలిపిస్తా, మా విశ్వనాథరావుని అధ్యక్షుణ్ని చేసి, నేను ప్రధానమంత్రి నవుతా, వహ్వా ! అమాంబాపతూ ఓ లక్ష గడించాగా ? ఇక నా కడ్డేం? (ఇటు, అటూ పరకాయించి) సత్యాగ్రహం చేస్తామని నోటీసిచ్చారు వెధవలు. మా బాగా తన్నించా. ఇక తలెత్తితే వొట్టు! ఆ దయానందంగాడు అడిగిన కూలీ ఇచ్చేసి కోతలు కొయ్యించేసు కున్నాడు. ఈ వేళతో వాడిపని సరీ. (నిష్క్రమిస్తాడు అంత తెర లేస్తుంది. కూలీ యూనియన్ ఆఫీస్. ఉషఃకాలం. పరంజ్యోతి

గాంధీజీ పటం ఎదుట నిలబడి ఆయన ఆదర్శాలను గానం చేస్తూ వుంటుంది.)

పర : (పాట)

భారతదాస్యము బాపిన దెవరు ?
భవ్యాదర్శము నొసగిన దెవరు ?
పీడిత జనతోద్ధారణలో జీ
విత మర్పించిన దెవరు ?
నీవే కాదా ? నీవే కాదా ?
నీవే నవభారత గాధా .
దాస్య తమో నిల ధాత్రిదేవికి
ధైర్యము గొల్పిన దీవె,
మహిత స్వేచ్ఛా స్వాతంత్ర్యోదయ
మార్గము చూపిన దీవె.
నీవే, నీవే విశ్వపితా !
నీవే హరిజన జన చరిత.
ప్రాతస్సంధ్యా గీతారవమున
పాడిన వైతాళికుడా ?
శక్తులు చచ్చిన చల్లని నెత్తురు
సలసల గాచిన మొనగాడా !
నీవే సేవారతి వోయీ !
నీవే సేనాపతివోయీ
గీతారణ్య తపశ్శాలీ ! లో
కిక మూర్ధన్య యశశ్శాలీ ?
సత్యాహింస వ్రత శూలీ ! వి
శ్వ ప్రేమామృత ఫల హాలీ !

నీవే, నీవే, నీవే బాపూ !
నీవే జగతికి రేపు.
గ్రామ పునర్నిర్మాణముకై నీ
ప్రేమము కేతా మెత్తిన దెవరో !
స్వరాజ్యమును స్వారాజ్యము జేసే
వసంతమును మా కీరా ??
నీవే మా హృదయాలయవాసి,
నీవే మా యాత్రకు కాశి.

(పాట మధ్యలోనే నిష్కల్, మధు ప్రవేశించి పాట ముగిసేవరకు భక్తితో అంజలి బద్ధులై నిలబడి వుంటారు. తరువాత ఇష్టాగోష్టికి ఉపక్రమిస్తారు.)

మధు : ఆకటితో మనం చస్తున్నా, ఈ భూస్వాములకు మనమీద దయలేదు. పని జరగడమే వాళ్ళకు కావలసింది. పనిచేసేవాళ్ళు ఎలా బ్రతుకుతున్నారనేది వాళ్ళ కక్కరలేదు. ఎక్కువ కూలి అడిగితే ఇవ్వరు. అడిగిన వాళ్ళమీద పగపూని పోలీసుల చేతా, రౌడీలచేతా తన్నిస్తున్నారు. ఇప్పుడేమిటి మన కర్తవ్యం ?

పర : గాంధీ మహాత్ముని అవతార పురుషునిగా పూజిస్తున్న దేశం ఆయన సిద్ధాంతాలను, ఆదర్శాలను గడ్డిపరకలుగా తీసిపారేస్తున్నది.

ని : దేశం కాదమ్మా ! అలా చేస్తున్నది. స్వార్థపరుల ముఠా మాత్రమే.

మధు : మహాత్ముడు ఏ సత్యాగ్రహంతో స్వాతంత్ర్యాన్ని సాధించాడో, ఆ సత్యాగ్రహానికే నేడు స్థానం లేదా ?

ని : సత్యాగ్రహాన్ని అణిచి వెయ్యడానికి నాడు విదేశ ప్రభుత్వం ఎలా పూనుకొన్నదో అలా నేడు మన సత్యాగ్రహాన్ని అణిచి వెయ్యడానికి ధనవంతుల ముఠా పూనుకొంటొంది. అందులో విచిత్ర మేముంది?

పర : అయితే ఇప్పుడు మన కర్తవ్యం?

ని : మన పార్టీని బలపరచుకోవడమే. దరిద్రులంతా ఏకమై ప్రభుత్వాన్ని స్వాధీన పరచుకోవడమే. ధనవంతులు, భూస్వాములు అడుగడుక్కీ మనల్ని ప్రతిఘటిస్తారు. అయితే అట్టివారు నూటికి పదిమంది కూడా లేరు. యీ సత్యాగ్రహోద్యమంలో ఇప్పుడు మనం కొంచెం తగ్గి, ఎన్నికల కార్యక్రమాన్ని కొనసాగిద్దాం.

మధు : దేశంలో ప్రతి రాష్ట్రంలోను మన పార్టీ ప్రచారాన్ని తీవ్రతరం చేద్దాం ఇక మనకు సమ్మెలూ అక్కరలేదు, సత్యాగ్రహాలూ అక్కరలేదు. వయోజన వోటింగుతో మనపార్టీ ప్రభుత్వంలోకి రాగానే సర్వజన శ్రేయోదాయకమైన ఆర్థిక సమత్వం స్వేచ్ఛగా ఏర్పడిపోతుంది.

పర : సరే ఈ రాష్ట్ర విషయం మిత్ర, నేనూ చూసుకుంటాం. మీరందరూ తలొక రాష్ట్రానికి పోయి ఎన్నికల ప్రచారం ప్రారంభించండి.

ని : అభ్యర్థుల నియామకంలో జాగ్రత్తగా వుండాలి. ఆరితేరిన ప్రజాసేవకులైన యువకునే నిలపాలి. స్వార్థపరులు, అభివృద్ధి నిరోధకులు పార్టీలో చేరతారు. అట్టి వాళ్ళను ఏరిపారవెయ్యడంలో కనుగలిగి వుండాలి. శక్తులు సళ్ళిన, వయస్సు మళ్ళిన సోదరుల్ని" కాక "నెత్తురు మండే, శక్తులు నిండే" ప్రజా సేవకులనే మనం యెంచాలి. నేనిక బైలుదేరుతా. మధూ ! ఎవరెవరు ఏయే ప్రాంతాలకు వెళ్ళాలో నిర్ణయించి, నీవు అన్ని రాష్ట్రాలూ ఒకసారి చుట్టిరా. (నిష్క్రమిస్తాడు)

మధు : మిత్ర రాలేదే ఇంకా !

పర : అన్నట్టు మిత్ర సంగతి తెలియలా ? ఏదో ఎదిరించిందని, నిన్న సాయంత్రం భయంకర్ ఆమెను కొట్టిపోయాడు.

మధు : ఆఁ !

(అంత కంగారుగా జోగులు ప్రవేశిస్తాడు)

జో : అయ్యో దేముడా ! మా నాయకులమీద నేను కూడా కేసెట్టా నంట, ఇదెక్కడి చావురా, బాబూ !

పర : ఏమిటి జోగులూ, ఆ కంగారు ?

జో : నా కేమి తెలవదమ్మా ! మీ పాదాలతోడు (సాష్టాంగ పడతాడు)

పర : (లేవనెత్తి) ఏమిటి సంగతి ?

జో : నా చేత యేలుముద్దర్లు ఎయ్యించుకొన్నారమ్మా అంతే !

(అంత ఒక కూలీ యువకుడు పరిగెత్తుకొస్తాడు)

యు : పోలీసులు ! పోలీసులు ! !

మధు : మళ్ళీనీ ?

పర : ఆఁ ! ఎక్కడ ? (నిష్క్రమిస్తుంది)

1యు : ఏవో కేసులట ? వారంట్లట ! నాయకులందర్నీ అరెస్టు చేస్తారట!!

(మరొక యువకుడు పరిగెత్తుకొస్తాడు )

2యు : దయానందంగారి ఇల్లు దోచేశారట. ఆయన్ని పొడిచేశారట !

మధు : (ఆతృతతో) అరె !

(అంత కొందరు భూస్వాములూ, రౌడీలు, పోలీసులతో ప్రవేశిస్తారు)

1పో : నీవేనా కూలీ యూనియన్ నాయకుడివి ?

2పో : దయానందరావు ఇల్లు దోచీ, అతణ్ణి పొడిచింది నీవేనా .

1పో : నిన్ను ఈ అఫీసు గదిలోనే ఇంటర్న్ చేశాం.

2పో : నిన్నూ, నీ ఆఫీసునీ సోదాచేస్తాం. ఈ లోగా చుట్టూ పహారా

(అందరూ తలొక్క ప్రక్కకూ నిష్క్రమిస్తారు)

మధు : (ఉద్రేకంతో) ఆఁ ! ఏమిటిది ? కలగాదు గద ! దయానందం ఇల్లు నేను

దోచానా ? అతణ్ణి నేను పొడిచానా ? అందుకు నన్ను బంధించారా ! వీళ్ళకు పిచ్చెక్కలేదు గదా ?

ఇదంతా విశ్వనాధరావు పన్నాగం. పొట్టకూటికై దేవులాడే పేద కూలీలను పగబట్టి కరిచే త్రాచుపాముల పన్నాగం ఇది !

విశ్వనాధం ! నీవు మనిషివి ; నేను మనిషిని. నీ యింటినిండా అన్నం వున్నది; నా కడుపు నిండా ఆకలి వున్నది. నీ సుఖాన్ని నీవుపోగొట్టుకోవు; నా కష్టాన్ని నేను భరించకోలేను. ఇది ద్వంద్వ యుద్ధం.

ధన మదాంధతకూ, ఆకలిమంటకూ – నిత్యసుఖలోలతకూ నిరంతర కష్టానికి – గర్వ ప్రమత్తతకూ, అభిమాన తీవ్రతకూ – నిరంకుశత్వానికీ, స్వాతంత్ర్యేచ్ఛకూ – యజమానిత్వానికీ, దాస్యానికి – ఇది ద్వంద్వ యుద్ధం!

ఈ యుద్ధంలో నీవు జయించలేవు. అణచలేవు, ఇది కాలికింద అణగదు. కత్తికి తెగదు. కారాగృహాలలో నాశనం కాదు. ఇది ప్రచండాగ్ని. నీ ఆర్థిక విధానాన్ని, నీ నిరంకుశత్వాన్ని భస్మంచేసే ప్రళయాగ్ని.

ఓరి బుద్ధిహీనుడా ! కార్మిక ప్రళయాగ్నితో అనవసరంగా పగ పెంచుకుంటున్నావ్ జాగ్రత్త !

విశ్వనాథ్ ! నీ మేడ గట్టిందెవరు ? ఓ భూస్వామీ ! నీ పొలం దున్నిందెవరు ?

ఓ భాగ్యశాలీ ! నీవు తింటున్న ప్రతిముద్ధలోను కూలీల కష్టం లేదా ? నీ మేడ ప్రతి ఇటికలోను కూలీల నెత్తురు లేదా ?

ఓరి కృతఘ్నుడా ! నీకంటె రాక్షసుడెవడు ! కృతఘ్నునికంటె రాక్షసు డెవ్వడు ?

నీవు కంచం నుండి ఎత్తుతూవున్న ప్రతి ముద్ధవంక ఎన్నివేల కూలీల ఆకటి కళ్ళు రెప్పవెయ్యకుండా చూస్తున్నాయో నీ బుర్రకు తట్టుతున్నదా ?

ఎంత సంకుచిత దృష్టి !

అన్నం లేదని అడిగాం. పెట్టనన్నావు. కూలి మరో గిద్దెడు గింజలు కూడా ఇవ్వనన్నావు. సత్యాగ్రహం చేస్తామన్నాం. చావమన్నావు, చావదన్నావు, తన్నించావు. ఇక మాకు దిక్కేది. మే బ్రతకడం ఎలా ?

బహిరంగంగా ఎదిరించలేక ఈ కుత్సిత మార్గాల నవలంబిస్తు న్నావా? ఓరి మూర్ఖుడా !

ఔను క్రూర సర్పాల నివాసం చీకటి బొరియల్లోనే. బహిరంగంగా రావడానికి నీకు ధర్మం ఎక్కడిది. బాహాటంగా ఎదిరించడానికి నీకు బలమెక్కడిది ? దుర్నీతికీ, దౌష్ట్యానికీ వెలుగును చూచే ధైర్యంలేదు.

చీకటి పుంతల్లో గోతులు త్రవ్వి, మా కూలీ ఉద్యమాన్ని కూలద్రొయ్యాలని చూస్తున్నావా ? వెర్రివాడా ! ధనగర్వ ప్రమత్తుడవై నీవే పడతావోయ్, ఉన్మత్తుడా ! నీవు త్రవ్వు కొనే గోతుల్లో నీవే పడతావ్.

నన్ను ఖైదు చేస్తావా ? నా వంటి వాళ్ళు లక్షలు, కోట్లు, నీ మీద విరుచుకుపడతారు. నీవు ఆగలేవు. ఈ ఉప్పెనని ఆపలేవు. నీకు ఒక వోటుకూడ పడదు. నీ వోటు కూడ నీకు దక్కదు – గ్రహించుకో.

మాది ప్రజల పార్టీ, దరిద్రుల పార్టీ, రేపు పోలింగులు కార్మిక, కర్షక ప్రజలకు తీర్థయాత్రలవుతాయి. మా పార్టీ గెలుస్తుంది. రేపటి ప్రభుత్వం మాదే జాగ్రత్త ! నీ భాగ్యం, నీ గర్వం, నీ నిరంకుశత్వం, నీ కుత్సిత పంథా, నీ అధికార ప్రమత్తత మూడు రోజుల ముచ్చట.

ఓయి భూస్వామి ! ఓయి భాగ్యాయతప్ర
గర్వి ! ఇకనైన తెరువుము కన్నుదోయి!
మనుజులందరు నొక్క సమాజమన్న
సత్యము గ్రహింపు, ఆటలు సాగవింక

(తెర)

## రంగం:9

(ఒక దారి, ప్రేమకుమార్ పాడుతూ ప్రవేశిస్తాడు.)

ప్రే : (పాట)

లే - లే - లే -

ఓ శ్రమజీవి ! లే !

ఆపత్సమయములో

అధైర్యపడదగునా ?

రాత్రిగడుపగా

రాదా పగలు?

నేలను గలసిన కూలీ

నెత్తురు వృథయౌనా ?

ఇక్కట్టులు గ

ట్టెక్కే మార్గము

ఊహింపుము త్వరగా లేచి

ఊరక యేడ్చిన ఫలమేమి.

ఈ దుష్కృత్యాల్ని ఆపడానికి నేనెంత కృషిచేసినా ఫలితం లేకపోతూవుంది!.. ఆహా ! మనిషికి మనిషికీ మధ్య దాటరాని అడ్డుగోడలా, మనిషికి మనిషికీ మధ్య సహించరాని శత్రుత్వమా! మనుష్యులలో ఉన్న ఈ కౌటిల్యం ప్రకృతిలోనే వుంటే ?

సర్వం సహా సర్వ సామ్రాజ్య పతియైన

భానునకే పక్షపాతమున్న,

రసపూర్ణుడై భూమి రంజించు మేఘుని

వితరణలో కులద్వేషమున్న

సస్య సుశ్యామల క్ష్మాలక్ష్మి గర్భాన
జాతిభేదానల జ్వాలయున్న,
ప్రాణ ప్రదాత యౌ పవన కుమారుని
గుండియ స్వార్థ సంకుచితమైన
ప్రకృతిమాతకు వంశ కాపట్యమున్న
జగము జగమెల్ల భళ్ళున పగిలిపోదె ?
తోడి మానవు గుండె నెత్తురుల కొరకు
దాహ మొందెదు ? బుద్ధిలేదయ్య మనిషి :

పాపం కూలీలు ! కడుపునిండా కూడులేదు. ఎక్కువ కోసం అడిగితే ఎదిరింపంటారు. పనిచెయ్యలేమంటే సమ్మె అంటారు. సమ్మె అని చావదన్నుతారు. మా భూస్వాముల దుర్మార్గాలకు ఒక అంతంటూ లేదు.

గాంధీజీ ప్రసాదించిన సత్యాగ్రహ ఆయుధం కూడా ఉపయోగించుకునే నోము ఈ దురదృష్ట కూలీలు నోచుకోలేదా?

వాళ్ళమీద దొంగకేసులు, సెక్యూరిటీ కేసులూ కల్పించి ప్రభుత్వ దృష్టిలో వాళ్లని కేడీలుగా చూపి, పోలీసులచేత తన్నించి, ఖైదులో పెట్టించి, నానా హింసలూ పెట్టడమా ? మా భాగ్యవంతుల కృత్యాలు, రాక్షసకృత్యాలను మించిపోతున్నాయి. అటు ప్రభుత్వాన్ని మోసగిస్తున్నారు. ఇటు మానవత్వానికే ద్రోహు లవుతున్నారు.

ఈ ఘోర పాపాలను నేను చూస్తూ వూరుకోలేను. కూలీ యూనియన్‌లో చేరుతాను. జాతీయ కాంగ్రెస్ నే కూలీ యూనియన్‌గా మారుస్తాను. నా శక్తియుక్తుల్నీ నా పలుకుబడినీ ఉపయోగించి రేపటి ఎన్నికలలో ఈ పార్టీ విజయం పొందేలా కృషి చేస్తాను. అప్పుడు గానీ ఈ భూ ధనస్వామిక నరకం అంతం కాదు.

కూలివాడు రాజ్యమేలి నప్పుడుగాని
సంఘ బాధలెల్ల చక్కబడవు,

పరగనట్టి రాజ్య ప్రస్థానమునకై
బ్రతుకు ధారవోసి పాటు పడుదు.

(నిష్క్రమిస్తాడు) – లోన పాట వినిపిస్తుంది. అది మిత్ర యిల్లు. మిత్ర బెంగతో, యోచనతో, పాడుకుంటూ వుంటుంది.)

మి : (పాట)

ఏమి సంఘం ? ఏమి లోకం ?
ఏమీ సృష్టి విధానం ?
కష్టానికి కన్నీరా ఫలితం ?
గత్యంతరమే లేదా ?
తగిలిన చోటనె తగిలే రాయికి
ధర్మము నెరిగే గుణముందా ?
రాతికి మించిన నీతియె లేదా ?
భూత మటో ఈ భూస్వామికము ?
న్యాయము, నీతి, ధర్మమటంచును
వ్రాయగనేలా పుస్తకాలలో ?
బలవంతుడె రాజన్న మార్గమే
ప్రకృతి సిద్ధమో యేమో !

(ఉత్సాహం పొంది) అయితే, కూలీలకన్న నేడు బలవంతు లెవరు? మే మెందుకు రాజ్యమేలడం లేదు ?

(అంత మెల్లిగా తలవంచుకొని ప్రేమ్‌కుమార్ ప్రవేశిస్తాడు)

ప్రే : ఏలగలరు. చెల్లీ ! మీరే రాజ్యమేలగలరు. సందేహం లేదు. నూటికి తొంభైమందివున్న మీ కూలీలే రాజ్యమేలకపోతే – ఇక రాజ్యమేలే అర్హత ఎవరికుంది ?

మి : (తీక్షణంగా చూచి) మీలాంటి విజ్ఞానవంతులైన యువకులు కూడ కూలీల్ని తన్నిస్తూ అరెస్టులు చేయ్యిస్తుంటే - మా బాగా ఏలగలరు రాజ్యం !

ప్రే : మహావరదలో నేనొక పూచిక పుల్లనమ్మా ! మీ కూలీలంతా తలచుకుంటే ఏది సాధించలేరు? నాలాంటి వాళ్లు లెక్కా ; జమా?

మి : మా కూలీ సభలకు వస్తుంటే మీరేదో మాకు సానుభూతి పరులను కున్నాం. మాకు కనీసం అపకారమన్నా జరక్కుండా చూస్తారను కున్నాం. పరంజ్యోతి మీ నుండి ఎంతో ఆశించింది కాని -

ప్రే : క్షమించు చెల్లీ ! ఇంతవరకు నేనొక తండ్రిచాటు బిడ్డను.

మి : మాదే బుద్ధితక్కువ - ఒక ధనవంతుని బిడ్డ కూలీలకి సాయం చేస్తాడని అనుకోవడంలేదు.

ప్రే : నిజమే మీ నాయకత్వం మీలోనుంచే రావాలి. రకరకాలైన పార్టీల పేర్లతో మీ కూలీల్ని ఉపయోగించుకోడానికి భూస్వాముల బిడ్డలు తయారవుతారు. అట్టివాళ్ళని మీరెప్పుడూ నమ్మవద్దు. మీ నాయకుడు మీ వాడే అయి ఉండాలి.

మి : మీరూ అంతే ?

ప్రే : నేను నాయకత్వం కోసం రాలేదు. మీ నాయకుల క్రింద అసమర్థుడిగా వచ్చాను.

మి : మొదట అందరూ అలానే అంటారు. కూలీలపాట్లు చూచి మొసలి కన్నీళ్ళు కారుస్తారు. కూలీపేటలన్నీ బంగారం చేస్తామని కోస్తారు; లోబరుచుకుంటారు. తమ స్వార్థానికి, ఉన్నతికి నిచ్చెన మెట్లుగా అమాయకపు ప్రజల్ని ఉపయోగించుకుంటారు. పైకి పోయి కాలితో తన్నిపారేస్తారు. ఇదంతా మీ గురించి కాదనుకోండి. నేటి రాజకీయపు రీతి చెపుతున్నా?

ప్రే : .......... .... .....

మి : కోపం వచ్చిందా ?

ప్రే : ... ... .. ...

మి : క్షమించండైతే, ఇప్పుడు మీరు వచ్చిన పనేమిటి ?

ప్రే : మీ కూలీ యూనియన్‌లో చేరి, పనిచేద్దామని వచ్చాను.

మి : నిర్మల హృదయంతో వచ్చారా ?

ప్రే : నా జీవితమంతా మీ ఉద్యమ విజయానికి ధారపోస్తాను. కాంగ్రెసు మహాసంస్థను మీకు అండగా నిలుపుతాను.

మి : మీ స్వభావం మంచిదేనని పరంజ్యోతి చెప్పింది. మధు కూడా అప్పుడప్పుడంటూ వుండేవాడు.

ప్రే : వారిద్దరికీ నామీద మంచి అభిప్రాయం వుందా ?

మి : లేం దెవరి మీద? లోకంలో అందర్నీ మేము మంచి అభిప్రాయం తోటే చూస్తాం. మేము నమ్మిన వాళ్ళే మమ్మల్ని మోసగించేది.

ప్రే : ... ... ...

మి : మిమ్మల్ని నొప్పిస్తున్నానేమో - క్షమించండి.

ప్రే : ఎన్నిసార్లు క్షమించడం ?

మి : క్షమించడంలోనే వున్నదండీ గొప్పతనమంతా ! పోనీగాని - నేటి నుండి మీరు కూలీ యూనియన్ సేవకు లన్నమాట.

ప్రే : నీది చాల కఠిన పరీక్ష, చెల్లీ!

మి : కొంచెం ఆలోచించండి. మీ నాయనగారి నాయకత్వం క్రింద భూస్వాములు మమ్మల్ని పెడుతున్న హింసలకు అంతున్నదా ?

ప్రే : లేదు.

మి : మేము అన్ని ఆశలూ విడిచిపెట్టుకొని, ఒక్క గాంధీజీ అడుగులే నమ్ముకొని, యెన్నికలలో పోటీ చేస్తున్నాం. మా నాయకులమీద కేసులు, వారంట్లు జారీ అవుతున్నాయి. నేటి నుంచి మీ నాయనగారికి విరుద్ధంగా మీరు పోరాడవలసి వుంటుంది.

ప్రే : అన్నీ ఆలోచించుకునే వచ్చాను. బుద్ధిమంతులు, అభ్యుదయ గాములు అయిన విద్యార్థి యువక దళాలు నా వెనుకవస్తున్నారు. ఈ ఎన్నికలలో మనం గెలుస్తాం. మీరనుకొంటున్నట్టుగా, గాంధీజీ ఆశయానికి అనుగుణ్యంగా పరంజ్యోతిని భారత రిపబ్లిక్కుకు అధ్యక్షురాలిగా చేద్దాం.

మి : ముందు మధును జామీనుమీద విడుదల "చేయించాలి. తక్కిన నాయకులమీద వారంట్లు రద్దు చేయించాలి. కేసులుంటే తర్వాత చూచుకుందాం. ఈ లోగా ఎన్నికలు జరిగిపోతాయి.

ప్రే : ఇప్పుడే ఆ ప్రయత్నం చేస్తాను.

మి : సెక్రటరీగారిని చూసారా ?

ప్రే : ఎవరు ? పరంజ్యోతినేనా ?

మి : ఔను.

ప్రే : ఇప్పుడు కాదు.

మి : అయితే - ఆమె యీ సందేశాన్ని మీకు అందజెయ్యమన్నది.

కూటికి కరవైన కులమున బుట్టినన్
మనుజుల మనుమాట మరువ వలదు,
ఆకటి మంటల నల్లాడుచున్నను

మానవంతుల మంచు మరువ వలదు,
పాలేరువృత్తి మీ పదసేవకులమైన
మహితాత్ముల మటంచు మరువ వలదు
ఇడుమలందైన మా హృదయాలు ప్రేమ మా
ధురిమమ్ము లనుమాట మరువ వలదు,

మూగ కూలిజనమ్ములు రేగిరేని
మహిని మండింపగలరని మరువ వలదు,
సత్కృపన్ నాకు ఆనా డొసంగినట్టి
మహిత వాగ్దాన మీనాడు మరువ వలదు.

ప్రే : (కన్నులొత్తుకుని) చెల్లీ ! ఇక సెలవు. నా మనవిగా ఆమెకు యిలా చెప్పు:

పనిగొని, రాత్రియు బగలు
పల్లెల, పట్నములన్ ప్రచారముం
బొనరిచి, పేదసాదలు ప్ర
బోధితులై వ్యవసాయకూలి యూ
న్యను గెలిపింప, సర్వజన
తాభ్యుదయమ్ముగ జ్యోతి భారతాం
బకు ప్రథమాధినేత్రిణిగ
బ్రస్తుతి జేయు ముహూర్తమందు నే
కనుగొనువాడ నామె పద
కంజము లానత మస్తకుండనై

(సవినయంగా నిష్క్రమిస్తాడు)

మి : తథాస్తు. ప్రేమ్‌కుమార్ ! తథాస్తు ఇక ఎన్నికల కార్యక్రమాన్ని తీవ్రతరం

చెయ్యాలి. పరంజ్యోతి యింకా రాలేదేమో ! ఆహా! ఆమె మూర్తీభవించిన చైతన్యం గదా !!

ఒకసరి రాజవేషము, ఒక్కతరిని
సాధువేషము, ఒకట బిక్షకుని వేష
మట్లు ఆబాలగోపాల మామె యగుచు
సాగుచున్నది జ్యోతి ప్రచారసరళి.

(తెర)

## రంగం:10

(ఒక తోటదారి, సందె చీకటి ముసుగు వేసుకుని, జబ్బకు కట్టు కట్టుకుని, చేత లాఠీతో భయంకర్ ప్రవేశిస్తాడు.)

భ : ఎన్నాళ్ళీ దాక్కోవడం ? దొంగతనం చేస్తే, దాక్కోమని వుందా ? నన్ను పొడిచిన దయానందం గాడు బట్టబైలుగా తిరుగుతున్నాడు ఎలెక్షన్లలో ! నేను దాక్కోవాలట ! ఈ శివరాంకి బుర్రలేదు. నేను దోపిడీ గాణ్ణట ! పట్ట పగలు బట్టబైలుగా దోపిడీలు చేసే యీ కామందులు, వ్యాపారస్తులు, వీళ్ళంతా మహా పత్తిత్తులట !! ఛీ, దొంగలోకం. అసలు లోకమే దొంగది. ఇప్పుడెక్కడికి నా ప్రయాణం చెప్మా ! జ్యోతిని ఈ రాత్రి పట్టుకోవాలి. మిత్ర యెక్కడా కనపడ్డం లేదు ! పోనీ, వెధవ ముండ. మొగాళ్ళంతా యెక్కడెక్కడికో ప్రచారానికి పోతున్నారు. దేవుడు మేలు చేస్తే – జ్యోతి ఒంటరిగానే దొరుకుద్ది. రైటో ! ఇక నా కడ్డులేదు. (కాలికి రాయి తగిలి) అబ్బా! దారిలో రాళ్లను పుట్టించిన దేవుడి తలకాయలోది మెదడా, రాడా? (వంగి కాలు చూచుకుంటాడు, అంత జోగులు విసురుగా వస్తూ మీదపడతాడు)

జో : అయ్యబాబో ! (అరుస్తాడు)

భ : ర్రే ! !

జో : చచ్చాన్రా దేముడో ! !

(పారిపోతాడు)

భ : (తమాయించుకొంటూ) ఛీ, పాడులోకం (ఏదో జ్ఞాపకం వచ్చి) యిలాంటి సమయంలో సారా వుంటే ! మధ్యనిషేధమట – వీళ్ళ తలకాయ నిషేధం. ఈ వేళ మద్య నిషేధం, రేపు మహిళా నిషేధం – పిచ్చి పుల్లాయలు. ఇప్పుడొక్క గుక్క సారావుంటేనా – చూసేవాళ్ళు నా తడాఖా !

(లోపల పాట వినిపిస్తుంది. కొంచెం ఆలకిస్తాడు) ఎవరది? (పారచూచి) నిష్కల్‌గాడు ? వాడే ! వీణ్ణి కూడా సఫా చెయ్యమనేగా మా కామందుగారి అజ్ఞ? మా బాగా దొరికాడు. మా బాగా దొరికాడు. (లాఠీని సదురుకొంటూ దాక్కొన్న వాడిలా తెరలోకి నిష్క్రమిస్తాడు. అంత పాడుతూ పరంజ్యోతి ప్రవేశిస్తుంది - సాధువేషంలో)

పర : (పాట)

కూలీలారా, లెండి - మీ
కోరిన హక్కులు పొందండీ !
హక్కులు మాత్రమే కాదండీ,
రాజ్యము సర్వము మీదేనండీ !
మనుజులందరికీ స్వేచ్ఛా జీవన
మార్గము చేకూర్చండీ !
కూడు గుడ్డ కొంపలకు లోటు లే
కుండగ చేయండి !
సంఘీభావమె బలమండీ - మీ
సాధనె స్వారాజ్యము సుండీ !
సర్వస్వామ్య సమాజముకై మీ
శక్తులెల్ల వినియోగించండీ !

(మెల్లిగా భయంకర్ వెనుకనుంచి ప్రవేశించి, పరంజ్యోతిని కొట్టి తప్పుకుంటాడు. ఆమె కెవ్వున కేక వేసి తెరలోకి పడిపోతుంది. వెనుక వస్తున్న కొందరు కూలీలు "పరంజ్యోతీ, పరంజ్యోతీ" అంటూ వచ్చి ఆమె పడిపోయిన కేసి నిష్క్రమిస్తారు.)

భ : (నిలువున నీరై, లాఠీ జారవిడుస్తూ) హాఁ పరంజ్యోతి ! (వికలితుడై నిష్క్రమిస్తాడు. అంత ముసుగు వేసుకుని శివరాం ప్రవేశిస్తాడు. వైఖరి చాలవరకు దిగాలు పడి వుంటుంది.)

శివ : చీకట్లో దారే కనపడ్డంలేదు. ఇది ప్రపంచానికే చీకటో, నాకు రేజీకటో, ఖర్మ ! (తడవు కొంటూ నడుస్తాడు) దయానందంగాడు చావలేదు. పైగా వాడు ఆ కూలీలలో చేరిపోయి ప్రచారం ప్రారంభించాడు. ప్రేమ్‌కుమార్ కూడా అదే దరువు. వాడు తండ్రినే విడిచి పెట్టేశాడు! దుర్మార్గుడు ! పేదోళ్ళంతా ఒక్కటే కుల మట ! దిక్కుమాలిన సంబంధం ! ఈ దెబ్బతో రైతులూ, కుర్రగాళ్ళూ కూడా ఆ కూలీపార్టీలో కలసిపోతారుట. గంగలో కలవనీ, నాకేం? విశ్వనాథరావుని యెన్నికల్లో నిలబెట్టా, ఉన్న డబ్బంతా ఖర్చు పెట్టించైనా అతగాణ్ణి గెలిపించాలి. కూలీ వాళ్ళు దరిద్రులు, అల్పబుద్ధులు, పకోడీ చేతిలో పెడితే పండగ చేసుకునే బాపతు. తలొక రూపాయీ పడేస్తే వొట్లన్నీ మనవే !

ఈ భయంకర్‌గాడి మూలాన్న నా పుట్టి మునిగే లాగుంది. మా కడ్డంవచ్చే వాళ్ళందర్నీ వీడిచేత కొట్టించేసి, వీణ్ణి నేను కొట్టేసి, ఏ రష్యాకో పారిపోతే, ఏ ఏటంబాంబు కంపెనీవో పెట్టుకోవచ్చు. అక్కడి కూలీలు యిచ్చినంతా పుచ్చుకుని చచ్చినట్టు పడివుంటారట. సమ్మెలూ, సత్యాగ్రహాలూ అక్కడ చెల్లవట. అలా వుండాలి. గవర్నమెంటంటే, నోరెత్తిన దరిద్రుణ్ణెల్లా కాల్చి పారెయ్యొద్దూ ? హు !

ఇంతకీ ఈ వోటుల్లో మేం గెలుస్తామో, లేదో ! ఆ కూలీ పీనుగులే గెలిస్తే ? నన్ను బ్రతకనిస్తారా ? ఈ భయంకర్‌గాడు దొరికిపోతే – యిక నా పని సున్నే ! ! (కొంచెం వణికి) ఆఁ ! అధికార్లంతా నా చేతిలో లేరూ? నా చేతి పాలు త్రాగిన అధికార సర్పం నన్నే కరుస్తుందా ? (మరీ వణికి) ఆఁ

పర్వాలేదు. పర్వాలేదు. (వెతికి) వీడు యీ పొలం పాకలోనేగా దాక్కుంటున్నాడు ? లేడే ! ఇంటికి పోయాడేమో ! జాగ్రత్తగా వుండమని హెచ్చరించిపోతా.

(నిష్క్రమిస్తాడు. అంత తెర లేస్తుంది. భయంకర్రావు ఇల్లు. గదిలో టేబిల్ మీద కత్తులు, సీసాలు, సిరాబుడ్డి, కలం, కొంతవ్రాసిన కాగితాలు వగైరా వుంటాయి. భయంకర్రావు హెచ్చు విచారంతో తల రెండు చేతుల్లోనూ పట్టుకుని కూర్చుని వుంటాడు)

భ : (లేచి) హా ! పరంజ్యోతి ! నిన్ను చంపేశానా ! ఈ చేతులతో ! ఈ చేతుల్ని విరగ్గొట్టేస్తా ! (చేతులు విరగ్గొట్టు కోడానికి ప్రయత్నం చేసి) కాదు. ఈ చేతులకు సహాయపడ్డ ఈ రాక్షసవర్గాన్ని (టేబుల్ చూపుతూ) ముందు నాశనం చెయ్యాలి. (సీసా తీసి) దీని పని ఎప్పుడో అయిపోయింది. ఇది నన్ను నాశనం చేసింది. దీన్ని కాంగ్రెసోళ్ళు నాశనం చేశారే. భేష్, వాళ్ళే మొగాళ్ళు (నేల కేసి కొడతాడు, కఠారు తీస్తాడు) ఇది నా ప్రియురాలు. ఓ ప్రియా ! ఎందరి కంఠాలనో కౌగిలించుకున్న నీవు యిప్పుడు నా కంఠం కౌగిలించుకో ! (ఎత్తి) ఆగు ! (కాగితాల మీద ఏదో వ్రాస్తాడు. తలుపు తట్టిన చప్పుడవుతుంది.) ఎవరది ?

తెరలో : నేను.

భ : నేనంటే ?

తెరలో : నేన్రా ! నేను !

భ : ఓహో ! తమరా ! దయచెయ్యండి.

(తలుపు తీసి శివరాం వచ్చిన తర్వాత మళ్ళీ గడియ పెడతాడు)

శి : ఒరే !

భ : తమరు ! భేష్ ! సమయానికొచ్చారు. చిన్నప్పటి నుంచీ మనం స్నేహితులం, ఇప్పుడూ అంతే.

శి : ఓరే !

భ : బోడి ముండలాగున్నారే !

శి : నేనురా ! తెలుసా ?? (ముసుగు తీస్తాడు)

భ : ఔనురా ! తెలుసురా !

శి : మతిపోయిందా ?

భ : ఓరి నా మతి మండా ! పోయిందంటావా ?

శి : సరే నేను పోతాను (వెళ్ళబోతాడు)

భ : ఒక్కరూ వెళతారా ? నేనూ వస్తాను. (వెనక్కు లాక్కొస్తాడు)

శి : ఎక్కడికి ?

భ : నరకానికి. స్వర్గం పేరు ఎత్తడానికి మనకి అర్హత వుందా ?

శి : (గడగడ వణకుతూ) ఒరే ! నీకు పుణ్యం వుంటుంది. నన్ను పోనియ్యి.

భ : హహ్హ పుణ్యమా ? వెధవ పుణ్యం ఇన్నాళ్ళూ దాన్ని దగ్గరకు రానియ్యలేదు. ఇప్పుడు రానిస్తానా ? ఇలా దయచెయ్యండి. (బల్ల దగ్గరకు తీసుకెళ్ళి కాగితాలు చూపుతాడు)

శి : (హడలిపోయి, గుండె కొట్టుకొంటూ) ఒరే ! బాబ్బాబు ! నన్ను బ్రతకనియ్యి. ఆ కాగితాలు ఇలాతే. నీకు పదివేలిస్తాను. బాబ్బాబు నన్ను బ్రతకనియ్యి. (కాళ్ళు పట్టుకుంటాడు)

భ : (తలమీద ఒక్కటి తన్ని) పదివేలా ? పట్టుకు నడు, నరకానికి.

శి : (అరచి, దొర్లిపోతాడు).

భ : పశ్చాత్తాపపడు. నీవు చేసిన – నా చేత, విశ్వనాథరావు చేత చెయ్యించిన –

పాపాలన్నింటికి పశ్చాత్తాప పడు. ఇక టైం లేదు. వాడు కూడ ఇక్కడికొస్తే బాగుండును. పశ్చాత్తాపపడు - ఒన్ -టు- పశ్చాత్తాప పడు.

శి : బాబ్బాబు - బ్రతకనియ్యరా (చేతులు మోడుస్తాడు)

భ : మనం బ్రతకడమంటే - మంచివాళ్ళు పదిమంది చావడమన్నమాట. పశ్చాత్తాపపడు - త్రి - (కత్తితో పొడుస్తాడు) గుండెల్లేని రాక్షసుడు ! చావు ! వద్దు. చావకు, బ్రతక్కు, అలానే వుండు, నేనూ వస్తున్నా. ఈ లోగా చచ్చావంటే చంపేస్తా (కఠారుతీసి, పైకెత్తి) ఓ కఠార్ ! చెప్పు, ఇది ఎన్నో హత్య ? ఎంతమంది పీకలు కోశావు ! అరుగో వాళ్ళంతా ! ... అరుగో ! ! కామందులు. పాలేళ్ళూ కలిసే వున్నారే! - చచ్చిన తర్వాత కులాలు వుండవు. ధనిక దరిద్ర భేదం వుండదు. అలానే పాపపుణ్య భేదం కూడా లేకపోతే ! ఛీ ఛీ నాలాంటి దుర్మార్గుడికీ, పరంజ్యోతి లాంటి దేవతకి పరలోకంలో ఒకటే సౌఖ్యమా ? కాదు, కారాదు, అసంభవం... సోదరీ ! జ్యోతీ !... (కఠార్ పైకెత్తి) నన్నెవరైనా పొడిస్తే బాగుండును. ఓ కఠార్ ! నన్ను పొడిచెయ్యి ! ఉండు. ఆగు... ఓ యువకులార ! నాకు లాగ రౌడీలు కాకండి. కులాల్నీ, మతాల్నీ, నిర్మూలించే ఉద్యమంలో చేరి, ఏకైక భరతజాతిని నిర్మించడానికి పాటుపడండి. వీర్యవంతులై విజృంభించండి. కూలీ సంఘాన్ని గెలిపించండి. గాంధీయిజాన్ని నిలబెట్టండి. స్వామ్య సమాజాన్ని నిర్మించండి. నాకు ఈ సభ్య ప్రపంచంలో స్థానం లేదు. నేను పోతున్నాను. శివరాం ! ఇక రా పోదాం. ఈ జగన్నాటకంలో మన పోర్షన్ అయిపోయింది. (అతణ్ణి పొడిచి; తాను పొడుచుకొని ఒరిగిపోతాడు.)

(తెర)

## రంగం:11

(ప్రజాపురంలో ఒక వీధి. ఎన్నికల ప్రచారం చేసుకుంటూ కూలీ సేవికాదళంతో మిత్ర ప్రవేశిస్తుంది.)

మి : (పాట)

లేవరా, ఓ కూలి రాజా !
లేవరా నిదుర !
నీవేరా యీ భూమికి భర్తవు,
నీవేరా యీ సృష్టికి కర్తవు,
నీదేరా యీ భారతరాజ్యం,
నీదేరా స్వారాజ్యం.
లేదురా, ఓ కూలి రాజా !
లేదురా, నీ కెదురు !
పూనికతో ముందుకు రారా !
పోటరివై దూసుకు పోరా !
గదగొని రంగములో నిల్చిన ని
న్నెదిరించే మగవాడెవడురా ?
వేయరా, ఓ కూలి రాజా !
వేయరా, వోటు !
దీక్షాకంకణ బద్ధుడవై నీ
పక్షమునే గెలిపించుకోరా
కూలీరాజ్యము సర్వప్రజలకు
కూడు గుడ్డ లొసగునురా !

ఓ కార్మిక ప్రజలారా ! ఓ వెనుకబడ్డ జాతులారా ! ఓ దరిద్రులారా ! దేశానికి మనమే రాజులం. వోటుగల ప్రతి వ్యక్తి దేశానికి రాజే ! వోటుతో రాజ్యం మన చేతికి వస్తుంది. హింస అక్కరలేదు. సమ్మెలక్కర్లేదు. సత్యాగ్రహాలక్కరలేదు. మన పేదలంతా ఒక్క త్రాటిమీద నిలబడి మన అభ్యర్థులకే వోట్లిస్తే – ప్రభుత్వం మన చేతిలోకి వస్తుంది. మనమే ప్రభుత్వం అవుతాం. మన ప్రణాళికే అమలు జరుపుతాం. కుల, మత, వర్గ, విభేదాల్ని తీసిపారేస్తాం సర్వసమానత్వం స్థాపిస్తాం. నేటి మన సమస్య సాంఘికం కాదు. కుల, మత సంబంధం అంతకంటే కాదు. నేటి మన సమస్య ఆర్థికం. రాజకీయాధికారం చేజిక్కక ఆర్థిక సమత్వం స్థాపించలేం. కనుక ఓ భారత దరిద్రులారా ! మీ ప్రతినిధులైన, మన యూనియన్ అభ్యర్థుల్ని గెలిపించండి. భూ స్వాముల, ధనికుల, స్వార్థపరుల దౌర్జన్యాలకు, ఎరలకు మీరు ఎంతమాత్రమూ లొంగిపోవద్దు. మన మీద కేసులున్నాయనీ, వారంట్లున్నాయనీ నిరుత్సాహ పడవద్దు. అవన్నీ స్వార్థపరులు కల్పించినవే. నిజమైనవి కావు. ఉత్సాహంతో ఎన్నికలలో పాల్గొనండి, ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోండి. మన అన్ని అవస్థలూ తీరిపోతాయి. నుధు మీకీ విధంగా చెప్పమన్నాడు:

ధనిక భూస్వామికంపు పాలనములోన
కష్టజీవికి న్యాయము కలుగబోదు ;
నేడు ప్రతివాడు వోటున్నవాడె రాజు,
నిలిచి రాజ్యము వోటుతో గెలుచుకొండు.

(నిష్క్రమిస్తుంది. అంత వెనుక నుంచి ప్రచారం చేసుకొంటూ ఒక భజన కూటమి ప్రవేశిస్తుంది.)

భజన :

వోటు విలువను తెలుసుకొండన్నా !
ప్రజలార మీరు,
వోటు రాజ్యము గెలుసుకొండన్నా !

సొమ్ము మూటలు గట్టుకొని మీ
గుమ్మములలో గిలకరించే
మోసగాళ్ళకు నోటు లిచ్చి
మొదలె మోసము తెచ్చుకొనకుడు !

వోటు మించిన శక్తి లేదన్నా!
ఈ లోకమందిక
వోటు గలవాడేను రాజన్నా !

ఎల్లడబ్బును, ఎల్లభూమిని
ఇంతకాలము అనుభవించుచు
పేదసాదల నణచిపెట్టిన
పెద్దలకు వోట్లివ్వద్దిక.

సంఘ బలమును తెలుసుకొండన్నా
అందరును ఒకటే
సంఘముగ నిర్మితము కండన్నా !

మీలో మీరె నాయకులుగా
ఏలుకొండీ కూలిరాజ్యము.
మేలుకొండీ పేదలారా !
చాలునిక భూస్వామి పద్ధతి.

(భజన నిష్క్రమిస్తుంది. వెనుకనుంచి తంబూరా భుజాన్న వేసుకొని జోగులు, మరొక ఇద్దరు కుర్రాళ్ళు ప్రవేశిస్తారు.)

జో : (బుర్రకథ ధోరణిలో పాట)

జయము జయము మన భారతభూమికి
జయము దిగ్విజయము

కు : భళాభళి

జో : జయము జయము మన కూలియూనియన్‌కు

కు : భళాభళి

జో : జయము జయము మన పరంజోతికి
జయము దిగ్విజయము

జో : భళాభళి - అనంᱰ్రా, కుᱰ్రనాయాళ్ళు !

కు : భళాభళి

జో : అబ్బే మీరేం పనికిరాᱰ్రా. ఇప్పటి కుᱰ్రోళ్ళు తిండానికి, తిరగడానికి తప్ప ఎందుకూ పనికిరారు. (పాట)

ᱰ్రతి మనిషికీ కూడూ గుడ్డా ...

కు : తందానో తానె తందనానా

జో : పచ్చని పొలమూ, వెచ్చని కొంపా,

కు : తందానో....

జో : ᱰ్రజలందరికీ సమాన సౌఖ్యం

కు : తందానో....

జో : ᱰ్రసాదిస్తదీ కూలి యూనియన్

కు : తందానో.....

జో : అట్టి కూలీ యూనియన్ నిలబెట్టిన అభ్యర్థులకే వోట్లెయ్యండి. ᱰ్రజలు..... (పాట)

వెయ్యర వోటు వెయ్యర

కు : సై.....

జో : కయ్యము మనకు వద్దురా

కు : సై....

జో : దెయ్యపు భూస్వామికము

కు : సై....

జో : గొయ్యితీసి కప్పెట్టరా

కు : భళాభళానోయి తమ్ముడా !
మేలు భళానోయి కూలోడా !

జో : ఓ కూలోళ్లల్లారా ! ఓ డబ్బు లేనోళ్లల్లారా ! మీ వోట్లన్నీ కూలీ యూనియన్ నాయకులకే యివ్వండి. ఇప్పుకైనా కళ్ళు తెరవండి. నేను చూడండి; పాలేరుతనం యెలిగించాను ముసలోణ్ణయిందాకా. నా ప్రయోజకత్వం చూడండి. ఏభై యేళ్ళు పాలేరుతనం చేసి యాభై చుట్టపీకలు కూడా సంపాదించుకోలేదు. మీ ఓట్లన్నీ మన నాయకుల కివ్వండి. మన బీదోల్లందరం బాగుపడతాం. మనకు సుఖం దొరుకుద్ది. జై.... కూలీ యూనియన్‌కి -

కు : జై, జై.

జో : పదండ్రా, పదండి, మన నాయకులంతా దేశదేశాలమ్మట ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ ఇంక మనకి మనమే నాయకులం. పదండి. ఊళ్ళూ, తాలూకాలు, జిల్లాలు, రాష్ట్రాలు, యిలా ప్రచారం చేసుకుంటూ పోదాం.

కు : కూలీ అభ్యర్థుల్ని గెలిపిద్దాం.

జో : (పాట)
జగతికంతా ప్రగతిచూపే
పాలివాడా ! కూలివాడా !

కు : ఓ- పాలివాడా ! కూలివాడా !

జో : చాలిచాలని గోచిపాతేనా ?
లోకమంతా శుభ్రపరిచే
పాకివాడా ! చాకివాడా !

కు : ఓ..... పాకివాడా ! చాకివాడా !

జో : చీకుచీదర మురికి గుడిసేనా ?
ప్రజలకంతా తిండిపెట్టే
పాలికాపా ! పంటకాపా !

కు : ఓ... పాలికాపా ! పంటకాపా !

జో : పంటికిందకు మంటి గడ్డేనా ?
దేశభాగ్యములెల్ల నుత్ప
త్తి జేసే వ్యవసాయ కూలీ !

కు : ఓ..... వ్యవసాయ కూలీ !

జో : దిక్కుమాలిన బక్క బ్రతుకేనా ?
బుర్రకొక్క వోటు వచ్చె,
బుద్ధిగలిగి వోటు యిస్తే

కు : మన - పెద్దలంతా యేకమైతే

జో : కొద్దిలో రాజ్యమ్మె మనదౌద్ది.

(పాడుకుంటూ నిష్క్రమిస్తారు. వెనుకనుంచి ప్రేమ్‌కుమార్, మరి కొందరు యువకులతో ప్రవేశిస్తాడు పాడుతూ)

ప్రే : (పాట)

కూలీలంతా ఏకం కండోయ్
కూలీరాజ్యం స్థాపించండోయ్

దున్నేవాడే భూమికి భర్త
దున్నేవాడే జీవనకర్త

వందలకొలదీ యెకరా లొకడే
వ్యక్తికి చెందుట తగదండోయ్

దేశంలోగల సర్వభూమినీ
జాతీయం చేయాలండోయ్

ఉత్పత్తిని జాతీయం చేసీ
కమ్మని పాలన జరపండోయ్

కలిమీ లేమీ తేడా మాపీ,
కమ్మని పాలన జరపండోయ్

అరకలు దున్నే అన్నల్లారా !
ఊడుపు లూడ్చే ఒదినెల్లారా !

సంపదకంతా కర్తలు మీరె
స్వారాజ్యానికి రాజులు మీరే.

ఓ ధనిక భూస్వాములారా ! మీ కొక చిన్న మనవి. మీ మీ అహాన్ని, స్వార్థాన్ని విడనాడి, ప్రజాబాహుళ్యంతో కలసిపొండి. కూలీ నాయకుల నాయకత్వం క్రింద కూలీ ఉద్యమాన్ని నడిపించండి. ఈ ఉద్యమంలో మీరు యెంత ముందుకు వస్తే అంత మంచిది మీకు. మీ భవిష్యత్తంతా నేటి మీ ప్రవర్తన మీదే ఆధారపడి వుంది. మీరు సహాయపడ్డా, సహాయపడకపోయినా, నూటికి 90 మంది వున్న యీ పేదలు యీ యెన్నికలలో గెల్చి తీరతారు. అప్పుడు మీ గతి ఏమవుద్దో ఆలోచించుకోండి.

భారతపిత గాంధీజీ సిద్ధాంతాల్ని అనుసరించి దారికి రండి. చైతన్యవంతులైన ప్రజల్ని యికమీరు అణచలేరు. మోసగించలేరు. కూలీ ఉద్యమాన్ని అణచడానికని మీరు చేసిన దౌర్జన్యమంతా ఆ ఉద్యమం బలపదడానికే తోడ్పడింది. ఇప్పుడు సామాన్య కూలీలే యెన్నికలు నడిపిస్తున్నారు. సర్వశక్తులూ వాళ్ళలో మూర్తీభవించి వున్నాయి నేడు. గాంధీ మహాత్ముని పవిత్ర ఆత్మ వాళ్ళని ఆవేశించి ముందుకు నడిపిస్తూ వుంది.

కులమత సాంఘికాంతరాల్ని అధిగమించి వాళ్ళు రాజకీయ ఆర్థిక ఉద్యమంలో ప్రవేశించారు. వాళ్ళని ఆపేశక్తి యీ ప్రపంచంలో లేదు. ఇక లెండి. భారత కూలీ యూనియన్‌ను గెలిపించండి. సర్వోదయ సోషలిజాన్ని స్థాపించండి!

కులమత వర్గ భేదములు
కూలిన, వాటి కతీతులై, ధరా
స్థలి నరులెల్ల నొక్కటని
చాటుడు: సర్వజనీన స్వామ్యసం

కలితా ప్రణాళికా పథక
కర్తలు కార్మిక నాయకుల్ సమ
ర్థులు తమ వోట్లొసంగి రయి
తుల్ గెలిపింపుడు శాంతికాములై.

(నిష్క్రమిస్తారు. వెనకనుంచి తలకు కట్టుకట్టుకొని దయానందరావు, మరికొందరు రైతులు ప్రవేశిస్తారు)

ద : ఓ పేదరైతులారా ! మీ వోట్లన్నీ కూలీ యూనియన్ అభ్యర్థులకే యివ్వండి. స్వతంత్ర భారత యూనియన్ అధ్యక్షపీఠానికి అభ్యర్థిని అయిన పరంజ్యోతికి మీ వోట్లిచ్చి గెలిపించండి. గాంధీ మహాత్ముని ఆశయాన్ని నెరవేర్చండి.

(అంత మిత్ర ప్రవేశిస్తుంది)

మి : ఏమండీ, యేమంటున్నారు యిక్కడి ప్రజలు ?

ద : నీవే అడుగమ్మా !

1 రైతు : మా వోట్లన్నీ యూనియన్‌కే యిచ్చేస్తున్నాం.

2 రైతు : కులభేదాల్ని తీసేసుకున్నాం.

3 రైతు : మా వెనకబడ్డ కులాల వోట్లన్నీ కూలీ యూనియన్‌కే.

4 రైతు : మా క్రైస్తవుల వోట్లన్నీ కూలీయూనియన్‌కే.

5 రైతు : మాకీ మతం గితం నహీ. మా సాహేబుల వోట్లన్నీ కూలీ యూనియన్‌కి హాం.

మి : మీ కందరికి నా వందనాలు. ఎన్నికలలో మనం గెలుస్తాం. మన యూనియన్ అధికారంలోకి వస్తుంది. ప్రజా ప్రభుత్వంలో ప్రజలే రాజులు. రేపటి ఎన్నికలలో నిజమైన ప్రజారాజ్యం స్థాపింప బడగలదు. మీలో యువకులంతా ప్రతి గ్రామమూ వెళ్ళి మన పార్టీ సిద్ధాంతాలు విశదపరచండి. ప్రతిపక్షాల కుట్రల నుంచి ప్రజల్ని రక్షించండి.

అందరూ: ఓ, మేమంతా నడుంగట్టుకు పనిచేస్తాం. (జై జై నినాదాలతో నిష్క్రమిస్తారు)

ద : అమ్మా ఇక నీవు అఫీసులోనే వుండి అవసరమైన ఆదేశాలను ఇస్తూండు. బయటి పనులన్నీ మేము చూచుకుంటాం. ప్రజలంతా మన పక్షాన్న వున్నారు. ఇక ఆత్రం పడవలసిందేమీ లేదు.

మి : సరే. అలానే కానివ్వండి. ఉక్కుతునకల్లాంటి మన కుర్రాళ్లని పోలింగుల దగ్గర కాపలా వుంచాలి. ప్రతిపక్షుల రౌడీయిజాన్ని ఎదుర్కోడానికి సిద్ధపడి వుండాలి. మనలో కూడా మేకతోళ్ళ తోడేళ్ళు వుంటవి. జాగ్రత్తగా వుండాలి.

ద : సరే (నిష్క్రమిస్తాడు)

మి : (నిట్టూర్పు) రాజకీయాలంటే నాకు పరమ అసహ్యం. అయితే ఆ రాజకీయాలే నాకు తప్పలేదు. ఈ బాధ్యతనంతా మధు చేతిలో పెట్టేసి ఒక దండం పెట్టేదాకా నాకు నిద్రలేదు. పరంజ్యోతి దెబ్బతింది. లేకపోతే నా అవస్థ కొంత తప్పేది. భయంకర్ ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్ననాటి నుంచి నన్ను పెంచిన మేనమామ – ఎంత దుర్మార్గుడైనా – నా తల్లి తర్వాత తల్లి వంటివాడు. అతణ్ణి గురించి కాస్త యేడవడానికైనా నాకు తీరికలేదు. మధూ ! ఎప్పుడొస్తావు ?

సంతోష మొనగూర్చు సహకార వనముల
కాసారముల నుషఃకాలమందు,

సరస శీతల తరుచ్ఛాయల శుకపికా
ద్యనురాగ రుచుల మధ్యాహ్నమందు

హృద్యగోదావరీ ప్రియ సైకతముల తీ
యని గానరమల సాయాహ్న మందు

అవధులు లేని నీలాకాశ వీధుల
రమణీయ కాంతులు రాత్రులందు

రంజనమ్ముగ ప్రేమానురాగములతో
బ్రతుకు సాగింప, కేల నీ రాజకీయ
ఊసరక్షేత్ర మందు వియోగ దుఃఖ
భారమున క్రుంగి బాధలు పడుట మనకు ?

(బెంగను, నిరుత్సాహాన్ని కనబరచి, మళ్ళీ తేరుకుని) అట్టి ఆనందాన్ని అనుభవించే అవకాశం నేడు పేదలకు ఎక్కడుంది ? దానిని ప్రజలందరికీ కలిగించడానికే కదా నేటి మా ప్రయత్నం ? రేపటితో ఇటో అటో - సుఖమో, దుఃఖమో - ప్రజారాజ్యమో, నిరంకుశ పాలనమో - ఆర్థిక సమత్వమో, అధిక సంఖ్యాక దాస్యమో- తేలిపోతుంది. ఓ ప్రజలారా !

నిర్మలముగ మీరు నిత్యకల్యాణంబు
పచ్చతోరణముగ బ్రతుక దలతు
రేని, పేదలార ! పూని గెల్పింపుడు
ఉత్సహించి కూలి యూనియనును.

(తెర)

# రంగం : 12

(ప్రభాతవేళ. ఒక వీధి. చక్కగా జాతీయ పతాకాలతో అలంకరించబడి వుంటుంది. కుర్రాళ్ళు హడావిడిగా వేదిక మీద నుండి ఈవలకు ఆవలకు వెళుతుంటారు. జై కొట్టుకుంటూ జోగులు వస్తాడు)

జో : ఓ ఆనందం ! ఆనందం ! ఈ ఆనందంతో నేను చచ్చిపోయే లాగున్నా(నా దేముడా ! ఎన్నికల్లో మా నాయకులంతా గెల్చారు. మా జ్యోతమ్మగారు గెల్చారు. మా పేదల పార్టీ గెలిచింది. ఇంక మాకు కూటికీ గుడ్డకూ లోటు వుండదు. ఈ పండగలో నేను కూడా పాల్గొనాలి. (ఆనందంతో నిష్క్రమిస్తాడు. వెనకనుంచి విశ్వనాథ మహీపతి విచారంగా ప్రవేశిస్తాడు)

వి : పోయింది. ఇంకేముంది అంతా పోయింది. ఎన్నికలలో గెలుద్దామని వున్న రొక్కం అంతా వెదజిమ్మాను. ఒక్కడా, యిద్దరా, లక్షల కొలది వోటర్లకి డబ్బెక్కడ పెట్టగలం ? కొందరు కుంకలు నా దగ్గర డబ్బు పుచ్చుకుని, నోట్లట్టుకెళ్ళి ఆ కూలీ పార్టీకి తగలేశారు. సొమ్మూ పోయింది. దిమ్మూ పట్టింది. ఆ శివరాంగాడే సగం తినేసి చచ్చాడు. ఉన్న సగం నేను తగలేశాను, రౌడీ గాడిద కొడుకుల్ని మేపి. ఇక భూములున్నాయి, వాటిని ఈ కొత్త గవర్నమెంటు పట్టుకు పోద్దిగావును. కొడుకుకూడా వాళ్ళలోనే కలిశాడు. వాడు కూడా గెల్చాడుగా కూలీల తరపున ! ఒక్కటే ఆశ వుంది. వాడి ద్వారా మనది మనం నిల్పుకోడానికి ప్రయత్నం చెయ్యాలి. వాడెక్కడ దొరుకుతాడు ? (అంత ప్రేమ్‌కుమార్ ప్రవేశిస్తాడు)

వి : (సిగ్గుతో) అబ్బాయ్ !

ప్రే : నమస్కారం నాన్నగారు !

వి : ఇంటికి రావూ ?

ప్రే : నా కిల్లెక్కడిది ? కూలీ యూనియన్ ఆఫీసే నా యిల్లు.

వి : నా నెత్తి మీద కొట్టు కోడానికా - అంత భవంతీ, అన్ని వేల ఎకరాలూ?

ప్రే : ఏమో. నాకందులో యాగాని ఆస్తి గూడా అక్కర్లేదు.

వి : నా అనంతరం ?

ప్రే : ప్రభుత్వమే దాన్ని స్వాధీనం చేసుకొంటుంది.

వి : నీ బ్రతుకు తెరువు ?

ప్రే : మా ప్రభుత్వంలో బ్రతుకుదెరువు లేకపోవడం అనేది వుండదు. నాన్న గారు ! ప్రభుత్వానికి బాధ్యత లేనంత కాలమూ ఎవడి బ్రతుకుదెరువు వాడే చూసుకోవలసి వచ్చేది. దాని విషఫలితాలే పెట్టుబడిదారీ భూస్వామిక విధానాలు. ఈ స్వరాజ్యంలో ఇప్పుడలా కాదు. ప్రతి వ్యక్తి బ్రతుకు తెరువునూ ప్రభుత్వమే చూస్తుంది. ఇక వ్యక్తిగత ఆస్తికి, స్వార్థానికీ సంఘంలో అవసరం లేదు, ఆస్కారమూ లేదు. మీ రేమీ బెంగ పెట్టుకోకండి.

వి : ఇంత కష్టపడి సంపాదించిన ఆస్తి -

ప్రే : అది పూర్తిగా ప్రభుత్వానిదే, దానికేం ఫర్వాలేదు. ప్రభుత్వం మీ కంటె పొదుపైంది.

వి : నీవూ ఆ పార్టీలో వాడివేగా ? దీనికేమీ చెయ్యలేవూ ?

ప్రే : ఈ మాట మరెక్కడా అనకండి. ప్రమాదం. సెలవు. (నిష్క్రమిస్తాడు)

వి : (తల రెండు చేతుల్తో పట్టుకుని) ఇక నాకు ఆత్మహత్యే శరణ్యం నన్ను విడిచి ప్రపంచం చాలా దూరం ముందుకుపోయింది. (నిష్క్రమిస్తాడు. వెనుక నుంచి పూలదండ చేతికి తగిలించుకొని మధమూర్తి ప్రవేశిస్తాడు. వెంట చాల మంది ప్రజలు ఉంటారు).

మధు : (చేతులు మోడ్చి) కార్మికులారా ! కృషికులారా ! నిరుపేద ప్రజలారా! మీ

కందరికీ కృతజ్ఞతాభివందనాలు. పేదలకు వోట్లిచ్చి పేదల పార్టీని గెలిపించి గాంధీ మహాత్ముని ఆదర్శాలకు, స్వప్నాలకు ఒక రూపం ఇచ్చి హరిజన బాలిక పరంజ్యోతిని స్వతంత్ర భారత అధ్యక్షురాలుగా చేశారు. మికివే నా ధన్యవాదాలు. మన పార్టీ ప్రణాళిక వెంటనే కార్యరూపంలో పడుతుంది. మీరంతా మహాసభకు పదండి.

(నిష్క్రమిస్తాడు. వెనుక నుంచి నిష్కల్ ప్రవేశిస్తాడు పాడుతూ)

ని : (పాట)

ప్రభాత మయ్యిందోయ్
ప్రభాస మయ్యిందోయ్, జగము

మహస్సు పెరిగి, రహస్సు విరిగి
అహస్కరోదయ, సహస్ర కరముల

ప్రభాత మయ్యిందోయ్
ప్రభాస మయ్యిందోయ్, జగము !

దరిద్ర జీవులు, చరిత్ర హీనులు
పీడితులంతా, తాడితులంతా
పండుగ జేసే, పర్వదిన మ్మిది

ప్రభాత మయ్యిందోయ్
ప్రభాస మయ్యిందోయ్, జగము !

నిరాధార కార్మికులారా !
పరాధీన జీవికలారా !
శ్రామిక విజయా రంభ మహోత్సవ
భవ్యక్షణ మిది, భాగ్యోదయ మిది
అనుభవించండోయ్, అంతా మీదే

ప్రభాత మయ్యిందోయ్
ప్రభాస మయ్యిందోయ్, జగము

ఓ ప్రజలారా !

పటుతర ఝంఝూ విభగ్నమై నను - వెన్క
చిగురింప కుండునా చెట్లగములు ?
ఘోరాంధకార సంకులమైనను ధరిత్రి
వెలుగొందకుండునా వేగువేళ !
గ్రీష్మాతపోగ్ని కారితమైన, జడివాన
చలువ లభింపగా సస్యపతికి !
మబ్బు చీకటిలోన మాటు జెందిన జ్యోతి
తెరదీసి వెలుగదా దివ్యకాంతి ?

జగతిలో దాపురించును శక్తిమించి
చిక్కు పెట్టెడి కష్టమ్ము లొక్కొకపుడు,
అంతమాత్రము చేత మీ యాత్మ బలము
జారిపోవగ నీకుడో శ్రమికులార !

(నిష్క్రమిస్తాడు. అంత ఉల్లాసంగా పాడుకుంటూ మిత్ర ప్రవేశిస్తుంది. చేతిలో అందమైన పూలదండ వుంటుంది.)

మి : (పాట)

వసంతకాలం వచ్చింది !
పసందులన్నీ తెచ్చింది ! !

కోకోరవముల్ కోమల సుమముల్
గున్నమామిడుల్, వెన్నెల నీడల్

బ్రతుకున హాయిని కూర్చింది !
బ్రహ్మానందం చేర్చింది !!

మ్రోడు కొమ్మల నెల్ల మోసు లెత్తించింది
ఎండు కాడల నుండి ఇగురు చూపెట్టింది !

నిరాశలన్నీ నిలిపింది,
దురాశలన్నీ దులిపింది !

కష్టకాలం గడిపివేసి,
కాంక్షలకు నవ్యత ఘటించి,

సుఖాంతానికి తెచ్చి, బ్రతుకుల
శోభలెన్నో కూర్చె నోహో !

(అంత మధు ప్రవేశిస్తాడు. చేతికి పూలదండ వుంటుంది)

మధు : మిత్రా ! ఆనందోత్సవాన్ని నీవొకతవే జరుపుకొంటున్నావే !

మి : ఇది యజ్ఞం, మధూ ! యజ్ఞం, దీన్ని మధుకామేష్టి అంటారు. దీంట్లోనుంచి మధు వస్తాడు.

మధు : ఐతే వచ్చాను.

మి : ఓహో నీవేనా ! (మెడలో పూలదండ వేస్తుంది. మధు తన చేతి దండ ఆమె మెడలో వేస్తాడు. ఒకరి ఒడిలో ఒకరు ఒక్క క్షణం మౌనంగా వుంటారు. తెరలో "ఇది రాధా మాధవ–" అని పాట వినిపిస్తుంది.)

మధు : మిత్రా ! మహాసభ ప్రారంభమౌతున్నది. నీవింకా రాలేదని నిన్ను వెతుక్కుంటూ వచ్చాను.

మి : నీ వలా వస్తావనే ఆలస్యం చేశాను. క్షమించు, మధూ ! పద పరంజ్యోతికి పట్టాభిషేకం చేద్దాం.

మధు : ఈ విజయం, యీ మహోత్సవం అంతా నీదే, మిత్రా, మొత్తం రాష్ట్రం రాష్ట్రం నీ చేతులమీద నడిపించావు !

మి : ఆకాశాన్ని యెగిరే గరుడపక్షి తన నీడను నేలమీద యీడ్చుకొంటూ పోతుంది. ప్రియా ! నీ నీడను కదా, యెన్ని రాపిడులైనా పడాలి. (ఒడిలో వాలి నిట్టూర్పు విడుస్తుంది)

మధు : మనం కొంచెం కష్టపడ్డా, యీ అశేష పీడిత ప్రజానీకానికి సౌఖ్యం చేకూర్చగలుగుతున్నాం కదా ?

మి : అదేలే. అయినా యిక నిన్ను విడిచి వుండలేను. ఈ కార్యప్రణాళికా నిర్వహణంతా మీరే చూచుకోండి.

మధు : నాకు మాత్రం యెందుకు ? పరంజ్యోతి భారత ప్రభుత్వ అధ్యక్షురాలైంది గదా ! అంతా ఆమెనే చూచుకొమ్మని మనం ఆనంద...

(పరంజ్యోతి ఒక పుష్పమాలతో ప్రవేశిస్తుంది)

పర : ఆనంద తన్మయత్వంలో యిక మే మెవళ్ళమూ కనిపించం గాబోలు!

మధు : మిత్ర : (సిగ్గుపడతారు)

పర : (ఇద్దరి చేతులూ కలిపి దండతో కడుతుంది) యిది లోపాయికారీ పెళ్ళి. రేపు నిష్కల్ యోగిగారి అధ్వర్యాన ఢిల్లీ దర్బారులో అసలు పెళ్ళి. ఏమే మిత్రా ?

మి : మన నలుగురి వివాహము ఒక్కసారే కావాలి. అక్కా ?

పర : నలుగు రెవరే ?

మి : ప్రేమ్‌కుమార్.

పర : నీకింకా ఆ మంకుబుద్ధి పోలేదు !

(తెరలో మళ్లీ పాట వినిపిస్తుంది)

మధు : ఇక పదండి.

(నిష్క్రమిస్తారు. అంత తెర లేస్తుంది. అది సర్వాలంకార శోభితంగావున్న సభామంటపం, ప్రజలు, ఉద్యోగులు బారులు తీరి కూర్చుని వుంటారు. వేదిక మీద ప్రేమ్‌కుమార్, దయానంద రావు, జోగులు అవీ ఇవీ సదురుతూ వుంటారు. తెర వెనుకనుంచి సంగీతం వినిపిస్తూ వుంటుంది.)

(పాట)

ఇది రాధామాధవ కళ్యాణోత్సవము,
ఇది కూలీరాజ్య రమా రమ్యోదయము !

సుమసుందర సుమనోహర
సుమనస్కర సాధన మిది,
మానవ ధాత్రికి స్వామ్య స
మాజ పునఃశోధన మిది,

ఇది రాధా... ...
ఇది కూలీ... ...

క్లేశములకు భవచింతా
లేశములకు తావీయని
పోటీ పోరాటాలకు
చోటీయని రాజ్యమిది.

ఇది... ...
ఇది... ...

దురదృష్టము దుర్మార్గము
తుడిచితి మెర్రసిరాతో
అవనీ కావ్యములో మా
నవుడిక నొక శ్రావ్యగీతి

ఇది... ...
ఇది... ...

సౌభాగ్యము, స్వాతంత్ర్యము,
సౌందర్యము, సౌహార్ధము,
స్వేచ్ఛా స్నేహముల తోడ
జీవింతురు మానవులిక.

(అంత నిష్కల్, పరంజ్యోతి, మిత్ర, మధుమూర్తి, వరుసగా ప్రవేశిస్తారు. జై జై నినాదాలతో ప్రజలు వారిని పుష్ప మాలాలంకృతుల్ని చేస్తారు. తమకు నచ్చిన మాలల్ని తీసి పరంజ్యోతి మెడలో వేస్తారు – మధు, మిత్ర వగైరాలు. చేతులు మోడ్చి మౌనంగా నిలబడి వుంటుంది పరంజ్యోతి. తెరలో సంగీతం వినిపిస్తూనే వుంటుంది అంతసేపూ)

పర : నా ప్రజలారా ! ఈ సంతోష సమయంలో నేనేమీ మాట్లాడలేను. ఎన్ని తుఫానుల్ని ఎదుర్కోవలసి వచ్చినా, కడకు మన నావ ఒడ్డు చేరింది. భూస్వామిక దౌర్జన్యానికిలోనై మన నాయకులు, వర్కర్లు, జైళ్ళలోను, హాస్పిటళ్ళలోను బాధలు పడవలసివచ్చి నప్పటికీ, నానా అవస్థలు, హింసలు భరించవలసి వచ్చినప్పటికీ, ప్రజలు తమను తామే నడిపించుకొని కూలీ యూనియన్‌ను గెలిపించి, ఉద్యమాన్ని జయప్రదంచేసి, కూలీ రాజ్యాన్ని స్థాపించారు. ఈ విషయంలో జాతి, కుల, మత వివక్షత లేకుండా ఉద్యమం కోసం పాటుపడిన ప్రజలకు నా ధన్యవాదాలు. మనకు ఆదర్శజ్యోతి అయిన గాంధీ మహాత్ముని ఆశయాలకు నేటికొక స్వరూపాన్ని ఇచ్చిన మీకు ఆ మహాత్ముని ఆత్మ ఎల్లప్పుడు తోడ్పడుగాక, ఇక మన ఉద్యమ ఆదర్శాలన్నీ కార్యరూపంలో పెట్టడానికి వెంటనే ప్రారంభిస్తాం. నిరుద్యోగాన్ని, నిరాశనీ, దారిద్ర్యాన్నీ, దాస్యాన్నీ, బాధనూ, బలహీనతనూ, అవిద్యనూ, అధర్మాన్నీ నిర్మూలించి – మన ప్రజలందరికీ చాలినంత తిండి, బట్ట, కొంప కలిగిస్తాం. ఈ కూలిపేటల్ని ఎత్తేసి ఐదు సంవత్సరాల ప్రణాళికలో నందన వనాల్లాంటి ఆదర్శ గ్రామాలు నిర్మిస్తాం. ధనమూలకమైన ఉత్పత్తి సాధనాలన్నీ ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని ప్రతి కుటుంబం నిత్య కళ్యాణం పచ్చతోరణంగా కలకల్లాడుతూ జీవించడానికి ప్రభుత్వమే బాధ్యత వహిస్తుంది. ఇంతకాలమూ

మనిషి మరో మనిషి భోగలాలసతకు సాధనంగా ఉపయోగింపబడ్డాడు. ఇకనుంచి మనిషి ఒక సాధనం కాదు, మనిషే పరమావధి. సాంఘిక, ఆర్థిక రాజకీయ, నైతిక, వైజ్ఞానిక కళా ముఖ్య విషయాలన్నీ మనిషికి సంపూర్ణతను కలిగించే సాధనాలు మాత్రమే. ఇదే మనపార్టీ పరమార్థం. ఈ పరమార్థాన్ని ప్రత్యక్షంగా సంస్థాపించడం నేడే మనం ప్రారంభిస్తాం. ఈ కార్యక్రమ నిర్వహణలో ప్రజలంతా, ప్రతి వ్యక్తీ తోడ్పడవలసి వుంది. గాంధీ మహాత్ముడు దృష్టి పథంలో చిత్రించుకొన్న రామరాజ్య మిదే. మన సర్వోదయ సోషలిస్టు వ్యవస్థ ఇదే !

(ప్రక్కనే అమర్చబడివున్న మహాత్ముని చిత్రపటాన్ని ఆవిష్క రిస్తుంది. అందరూ జై జై నినాదాలు చేస్తారు. అంత నిష్కల్ ముందుకు వస్తాడు.)

ని : సోదరులారా !

ఉర్వియెల్ల మేల్కాంచె, అభ్యుదయమయ్యె
కూలియూన్యను స్వారాజ్య మేల దొడిగె
సాగె స్వామ్య సామాజిక స్థాపనమ్ము
ఆకృతి ధరించె బాపూజీ ఆశయమ్ము
బాధ్యత వహించి ప్రజలార ! పడయు డింక
ఎల్ల సౌభాగ్యము సౌఖ్యము లెల్ల రుచులు.

(అంతా భక్తితో లేచి నిలబడి, జాతీయ గీతం పాడతారు)

(గీతం)

జయ జననీ, జయ జననీ
జయ భారత జననీ !

జయ భారత జననీ జయ
జయ సర్వంగ జీవనీ !

జయ జనపద పద సరోజ !
జయ సర్వోదయ సమాజ !

జయ పుష్కల సుశ్యామల
సస్యామృత ఫృధుపాణీ !

జయ సకల కళామందిర !
జయ నిఖిల సుఖేందిర !

జయ మధు మధుర వనేందిర !
జయ రాగసుధా బంధుర !

జయ మధ్యందిన దీన్య
చ్ఛండార్క మణీమకుటా !

జయ సుందర శోభాకర
శరదిందు జటా జుటా !

జయ సమస్త పీడితజన
భయ బాధామయ హరణా

జయ పవిత్రధాత్రీ ! జయ
జయ నిత్యోధిత సుగాత్రి !

జయ జయ జయ జన్మభూమి !
జయ జయ జయ కర్మభూమి !

జయ జయ జయ పరవర్ణా
జయ జయ జయ అన్నపూర్ణా !

(మెల్లిగా తెరవాల్తుంది)

**సంపూర్ణం**

* * *